ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు fb.com/vaartha
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-2-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 22 పేజీలు: 12 వెల: 8.00

## నేటి నుంచి 3 రాష్ట్రాల్లో ప్రధాని మోడీ పర్యటన

9లో

## ప్రధానమంత్రి కార్యదర్శిగా శక్తికాంత్‌దాస్

# మిర్చి రైతులను ఆదుకొంటాం



### వ్యాపారులు, ఎగుమతిదారులు సహకరించాలి

### క్వింటా మిర్చి ధర రూ.11,781కంటే తగ్గితే కేంద్రం ద్వారా కొనుగోలు

### రైతులకు బ్యాంకు రుణాలు మంజూరుకు చర్యలు

### గుంటూరు మార్కెట్ యార్డు లారీ యజమానులపై చర్యకు సీఎం చంద్రబాబు ఆదేశం

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** మిర్చికి అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్ రీత్యా ధరలు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రంలో మిర్చి ఉత్పత్తిదారులు ఎటువంటి దిగులు పడాల్సిన అవసరంలేదని, మంచి గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన మిర్చి అంతా అమ్ముడుపోయే దిశలో మంచి ధరతో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ దిశలో ట్రేడర్లు సహకరించాలన్నారు. ఏపీ నుంచి మిర్చి ఎగుమతి అయ్యే శ్రీలంక, మలేషియా, చైనా దేశాల్లో కూడా మిర్చిని సొంతంగా పండించడంతో మిర్చి ధర తగ్గిందని భావించినప్పటికీ అక్కడ పంట సరిగ్గా రాకపోవడంతో రానున్న రోజుల్లో మిర్చి ధర భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయాలన్నింటినీ ట్రేడర్స్‌కు వివరించడంతో పాటు, రైతులకు ట్రేడర్స్ ఇబ్బందులు కలిగించ వద్దని, సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని సీఎం సమావేశంలో స్పష్టం చేసారు. మిర్చి ధర నిర్ణయిస్తే ఆ ధరకే కొంటామని ట్రేడర్లు చెప్పే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని వైపుల నుంచి చర్యలు తీసుకుంటోందనితెలిపారు. ఈ అంశంపై కేంద్రానికి మూడు పర్యాయాలు లేఖను రాయడంతో పాటుగా తాము స్వయంగా ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో చర్చించామన్నారు ట్రేడర్లు మిర్చి ధరల విషయంలో ఎటువంటి హెచ్చుతగ్గులు లేకుండా చూసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ ఏడాది రెండు లక్షల ఎకరాల వరకు కూడా మిర్చి పంటను తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను రైతులు. వేశారని రైతుల తరపు ప్రతినిధులు సమావేశంలో సీఎం చంద్రబాబు దృష్టి తీసుకుని వెళ్ళారు. అంతర్జాతీయంగా మిర్చికి కొరత ఉన్నదన్నారు. ఆ క్రమంలోనే గత ఏడాది నుంచి శీతల గిడ్డంగుల్లో ఉన్న మిర్చి అంతా కూడా అమ్ముడుపోయిన పరిస్థితి ఉందన్నారు. ఇక ఈ ఏడాది మిర్చికి ధర విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. యార్డుల్లో ఏరోజు మిర్చి ఆరోజు కొనుగోలు జరుగుతోందని, మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారికి నైతిక స్థైర్యాన్ని ఇవ్వడంలో భాగంగా వర్తకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం నిర్వహించామన్నారు. మిర్చి ధరలపై రైతులు ఎగుమతిదారులతోను సీఎం చంద్రబాబు సమావేశంలో చర్చించారు. చైనా థాయిలాండ్ మలేసియా తదితర దేశాలకు మిర్చి ఎగుమతులు పెరుగుతున్న నేపథ్యంలో మిర్చి పంటకు సరైన ధర దక్కేందుకు ఉన్న మార్గాలను అన్వేషించాలని సీఎం ఆదేశించారు. గుంటూరు మార్కెట్ యార్డ్‌లో మిర్చి నిల్వలకు సంబంధించిన వివరాలు కూడా తెలుసుకున్నారు. పెట్టుబడి అధిక మవుతోంది. మిరప సాగుకు ఏటికేడు పెట్టుబడి పెరుగుతోందని, పెరిగిన పెట్టుబడి స్థాయిలో తమకు ఆదాయం రావడం లేదని రైతులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా మిర్చికి నల్లతామర తెగులుతో పంట నాణ్యత తగ్గడంతో పాటు దిగుబడి తగ్గిపోతోందని రైతులు తెలిపారు. ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకూ ఖర్చు అవుతోందని వివరించారు. కూలీ ఖర్చులు ఎప్పుడూ లేని విధంగా ఈ సారి మరింత పెరిగాయన్నారు. అయినా కూలీలు దొరకడం లేదని అన్నారు. ఎన్నో వ్యయప్రయాసాలతో యార్డుకు పంటను తెస్తే ఉదయం పూట నిర్ణయించిన ధర మళీ >>2

# గ్రూప్-2 పరీక్షలు నేడు యధాతథం

### వాయిదా వేయాలన్న ప్రభుత్వం

### సాధ్యం కాదన్న ఎపిపిఎస్సీ

**విజయవాడ,ఫిబ్రవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పరీక్షలను వాయిదా వేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను ఏపీపీఎస్సీ సానుకూలరీతిలో స్పందించలేదు. పరీక్ష వాయిదా వేయలేమని ప్రభుత్వం లేఖకు బదులుగా ఏపీపీఎస్సీ సమాధానం ఇచ్చింది. దీంతో ఇప్పటి వరకు ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలపై సందిగ్ద అభ్యర్దుల నెలకుంది. ఏపీపీఎస్సీ తాజా నిర్ణయంతో గ్రూప్ –2 మెయిన్స్ యధాతథంగా జరుగుతున్నాయి, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున్న గ్రాడ్యుయేట్లకు ప్రయోజనం కల్పించే నిర్ణయాలు తీసుకోలేమని ఏపీపీఎస్సీ వెల్లడించింది. ఇదే నిర్ణయాన్ని కట్టుబడి ఉంటామని వివరించింది. దీంతో పరీక్షలకు అభ్యర్దులు సిద్దమవుతున్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్–2 మెయిన్స్‌కు కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు సైతం ప్రకటించించారు. ఈ నేపథ్యంలో సైతం ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహణకు సిద్దమైంది.

**ఏపీపీఎస్సీ గ్రూప్స్ 2 మెయిన్ పరీక్షలు వాయిదా వేయాలని ఏపీ ప్రభుత్వం ఆదేశం!**

ఏపీపీఎస్సీ గ్రూప్స్ 2 మెయిన్ పరీక్షలపై అభ్యర్థుల విన్నపాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. ఆదివారం నిర్వహించాల్సిన పరీక్ష కొన్ని రోజులు వాయిదా వేయాలని కోరుతూ ఏపీపీఎస్సీ సెక్రటరీకి ప్రభుత్వం లేఖరాసింది. రోస్టర్ తప్పులను సరిచేయకుండా పరీక్ష నిర్వహణపై అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రోస్టర్ అంశంపై ఏపీ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. >>2 వచ్చే నెల 11వ తేదీన మరోమారు ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టనుంది.

# రూ. 90వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ

### నెల్లూరు జిల్లా రామాయపట్నంలో ఏర్పాటు

### వేలాది మందికి ఉపాధి అవకాశాలు

### శ్రీకాకుళం జిల్లాలో గ్యాస్ సరఫరా ప్రాజెక్టు ప్రధాన పైప్‌లైన్ పనులు కొలిక్కి: కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్ పురి



**విజయవాడ,ఫిబ్రవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** నెల్లూరుజిల్లా రామాయపట్నం వద్ద భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ రూ.90 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయబోతోందని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హరిదీప సింగ్‌పూరి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు, ఆయా ప్రాంతాలు సమగ్ర అభివృద్ధి చెందుతాయని అన్నారు. రాష్ట్రానికి చెందిన చాలా మంది ప్రజాప్రతినిధులు బీపీసీఎల్ ప్రాజెక్టును తమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రామాయపట్నం వద్ద ఆరు వేల ఎకరాల స్థలాన్ని కేటాయించిందని చెప్పారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పట్టాలెక్కించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, వారి కృషి అభినందనీయమని విజయవాడ పర్యటనకు వచ్చిన మంత్రి హరిదీప్ సింగ్‌పూరి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లోని అంశాలను వివరించేందుకు, అభిప్రాయాలు సేకరించేందుకు మేథావులతో ప్రత్యేకంగా భేటీ అయిన హరిదీప్‌సింగ్‌పూరి మీడియా సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో 2,650 కోట్ల రూపాయలతో గెయిల్ ద్వారా ప్రారంభించిన గ్యాస్ సరఫరా ప్రాజెక్టు ప్రధాన పైపు లైను పనులు కొలిక్కి వచ్చాయని అన్నారు. ఇతర పనులు కూడా సత్వరం పూర్తి చేసి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పైపు లైను ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డబుల్ ఇంజను సర్కార్ ద్వారా రాష్ట్రాభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం సముచిత సహకారం అందిస్తోందని వివరించారు. టాక్స్ డెవల్యూషన్ పేరిట 123 శాతం సాయం పెంచిందని చెప్పారు. 50 ఏళ్ల కాలానికి వడ్డీ లేని రుణం కింద ప్రత్యేక సహాయంగా రాష్ట్రానికి ఈ ఏడాది జనవరి 12 నాటికి ఈ ఆర్థిక సంవత్సరంలో >>2

# రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

### 28న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 24నుంచిఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి, అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు బీఏసీ సమావేశం జరుగుతుంది. సభ ఎన్ని రోజులు ఏఏ బిల్లులు ప్రవేశపెడతారనే అంశంపై బిఏసి లో చర్చ జరుగుతుంది. ఈ నెల 25న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం ఉంది. ఈ నెల 28న ఏపీ బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లుఅసెంబ్లీ ప్రాంగణంలో రాకపోకలు, ప్రవేశాలపై నిబంధనలు కట్టుదిట్టంగా అమలుకు నిర్ణయం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక పాస్‌లు జారీమీడియా, విజిటర్లు, పోలీసు సిబ్బందికి ప్రత్యేక పాస్ లు జారీ భద్రతా కారణాల రీత్యా పాస్ లు ఉన్న వారికే అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతి అసెంబ్లీ, మండలిలో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేలా వివిధ కలర్ కోడ్‌లతో పాస్‌లు జారీ అసెంబ్లీ ఒకటో గేట్ నుంచి మండలి ఛైర్మన్, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ కు అనుమంతిఅసెంబ్లీ ఒకటో గేట్ నుంచి సీఎం, డిప్యూటీ సీఎంలకు మాత్రమే అనుమతి అసెంబ్లీ గేట్ 2 నుంచి మంత్రులకు మాత్రమే అనుమతిఅసెంబ్లీ గేట్ 4 నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాత్రమే అనుమతి మండలి ఛైర్మన్, >>2




# అసభ్య పోస్టులకు ఇక కళ్లెం!

### పోలీసులకు సూచనలు చేసిన హైకోర్టు

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యక్తులు ఒకరిపై మరొకరు ప్రతీకారం తీర్చుకునేందుకు చేసే వ్యాఖ్యలతో అంతిమంగా సామాజిక మాధ్యమ సంస్థలు లాభపడుతున్నాయని ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియా వేదికగా వస్తున్న అసభ్యకర పోస్టులను కట్టడి చేయాల్సిన అవసరముందని పేర్కొంది. ఇప్పటికే పోస్టు చేసిన వాటిని తొలగించేందుకు సామాజిక మాధ్యమ సంస్థలకు ఏమైనా సూచనలు చేశారా? అందుకు తీసుకున్న చర్యల వివరాలను కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పలువురు మంత్రులు వారి కుటుంబ సభ్యులపై సోషల్‌మీడియా వేదికగా దూషిస్తూ అసభ్య పోస్టులు పెట్టిన వ్యవహారంపై నమోదైన కేసుల్లో బెయిలు కోసం వైకాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పూర్వ ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డి, సిరిగిరెడ్డి అర్జున్ రెడ్డి వైకాంగ్రెస్‌పార్టీ సానుభూతిపరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఈనెల 27కు వాయిదా పడింది. ఈ కేసు విచారణ సందర్భంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్దానం పలు అంశాలను ప్రస్తావిస్తూ వ్యాఖ్యానం చేసింది. పోస్టులు పెట్టడంలో పిటిషనర్లు హద్దులు మీరారనడంలో సందేహం లేదని వ్యాఖ్యానించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఈ కేసులో ఇచ్చిన ఆదేశాల్లో అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించేందుకు చట్టం అనుమతిస్తుందన్న >>2

# మహిళల రక్షణకు సురక్ష యాప్:

### హోం మంత్రి అనిత



**విజయవాడ, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళల రక్షణ కోసం సురక్ష పేరుతో మహిళా దినోత్సవం నాటికల్లా ప్రత్యేక యాప్ అందుబాటులోకి తేవాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. మహిళల భద్రత కోసం అన్ని జిల్లాల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డీజీపీ హరీష కుమార్ గుప్తా. ఇతర పోలీసు ఉన్నతాధికారులతో రాష్ట్ర సచివాలయంలో ఆమె సమీక్షించారు. ప్రతి జిల్లాలో సురక్ష బృందాలను పెట్టి నిఘా పెంచాలని సూచించారు. పోక్సో కేసుల్లో నిం దితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చేయాలని చెప్పారు. 112,181,1098 తదితర హెల్ప్‌లైన్ల నంబర్లపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి. నేరాలు జరిగే అస్కారమున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పట్టాలి. పోలీసింగ్‌లో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలి. సామాజిక మాధ్యమాల్లో మహిళలను దూషించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. మహిళలు రక్షణ కోసం ప్రత్యేకంగా పోలీసు కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో మహిళలకు వ్యతిరేకంగా దాడులు జరిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం క్రియాశీలక కార్యచరణ చేపడుతుందన్నారు. క్రైమ్ ఎగినేస్ట్ విమెన్ నియంత్రించే దిశలో పూర్తి స్థాయిలో >>2

# చెత్త పన్ను రద్దు

### బకాయిలు కూడా మాఫీ: ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ,ఫిబ్రవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో ప్రజలకు ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. నగరాలు, పట్టణాల్లో వసూలు చేస్తున్న చెత్త పన్నును ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా 2024 డిసెంబర్ 31 నుంచి రద్దు అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. 2021 నవంబర్‌లో చెత్త పన్ను వసూలు ప్రారంభమైంది. దీన్ని రద్దు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఆ మేరకు తీసుకొచ్చిన మున్సిపల్ చట్ట సవరణను అసెంబ్లీ ఆమోదించగా, గవర్నర్ అనుమతితో ఇటీవల గెజిట్ విడుదలైంది. ప్రజలు ఇక నుంచి చెత్త పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. సంబంధిత బకాయిలను చెల్లించనవసరం లేదు.

23-2pg2exHMNWJQE.qxd:23-2pg2exHMNWJQE.qxd 01/01/01 9:40 AM Page 1





శనివారం ఢిల్లీ సిఎం రేఖా గుప్తా ప్రధాని మోడీని మర్యాద పూర్వకంగా కలిసిన దృశ్యం

# రూ.90 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ


>> 5,663 కోట్ల రూపాయలు విడుదల చేసిందని చెప్పారు. రైల్వే బడ్జెట్‌లో 9,417 కోట్ల రూపాయలు సాయం ప్రకటించిందన్నారు. 90 వేల కోట్ల రూపాయలతో కాకినాడలో హెచ్‌పీసీఎల్ రాబోతోందని చెప్పారు. ఓఎన్‌జీసీ ద్వారా ఒక్క రోజులో 45 వేల బ్యారెల్స్ ముడి చమురును ఉత్పత్తి చేసేలా ఆదుని కీకరిస్తోందన్నారు. విశాఖ పూడిమడక ప్రాంతం గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా అభివృద్ధి చెందబోతోందని చెప్పారు. ప్రపంచంలోనే ఇంధన ఖర్చు తగ్గించిన దేశం ఒక్క భారతదేశమేనని తెలిపారు. రాష్ట్రంలోని దగదర్తి, భోగాపురం, ఒర్వకల్లు వద్ద గ్రీన్‌ఫీల్డు విమానాశ్రయాలను ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. తిరుపతి, విజయవాడలోని విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ప్రధానమంత్రి మోదీ కడప విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనానికి శ్రీకారం చుట్టారని, రాష్ట్రంలో 4,741 కిలోమీటర్లకు పైగా పైగా జాతీయ రహ దారులు నిర్మాణం చేశామని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గ్లోబల్ మార్కెట్‌లో తన మార్క్ చూపించాలనుకుంటున్నారని అన్నారు. దిల్లీలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, త్వరలో బిహార్ ఎన్నికల్లో కమలం విజయం సాధిస్తుందని కేంద్ర మంత్రి హరిదీప్‌సింగ్ పూరి ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రిని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలపై చర్చించారు. మేధావుల సదస్సులో ఏపీ ఛాంబరు ఆఫ్ కామర్స్, రాష్ట్ర పెట్రోలియం డీలర్ల సమాఖ్య, లారీ ఓనర్స్ అసోయేషన్ ఇతర సంఘాల ప్రతినిధులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఒక దేశం, ఒకే ధర విధానం అమలు చేయాలని కోరారు. డీలర్ మార్జిన్ సవరించాలని కోరారు. నిర్మలా సీతారామన్ 8వ బడ్జెట్ బడ్జెట్ చాలా బాగుంది. మంచి కేటాయింపులు, కేంద్ర వికేంద్రీకరణ, మధ్యతరగతికి 12 లక్షల పన్ను మినహాయింపు, 2027 నాటికి భారతదేశం 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది, మంచి పాలన మంచి పాలన మంచి రాజకీయమని మోడీ జీ పరిశీలించారు రూ.7. 90000 కోట్ల కాకినాడ హెచ్‌పిసిఎల్ రాబోతోంది ఓఎన్‌జిసి 2 లక్షల కోట్లు ఒక రోజులో 45000 బ్యారెళ్ల ముడి చమురు విశాఖపట్నంలో 2 లక్షల కోట్ల పునాది ప్రాయశ్చిత్తం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ పుడిమడక, రైల్వే మరియు రోడ్డు ప్రాజెక్టులు రూ.19500 కోట్లు, నక్కపల్లిలో ఫార్మసీ పార్క్ చెన్నై కారిడార్‌లోని క్రిస్ నగరం. జనవరి 2025లో శ్రీహరికోటలో 3వ సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం 3984 కోట్లు,. ఇంధన ఖర్చు తగ్గించబడిన ఏకైక దేశం భారతదేశం 16. కేంద్ర ప్రభుత్వం చమురును దిగుమతి చేసుకోదు కానీ ప్రైవేట్ కంపెనీలను దిగుమతి చేసుకోదు లభ్యత మరియు భరించగలిగే సామర్థ్యం (సబ్సిడీ కారణంగా 28000 కోట్ల నష్టం) లిశిబి) 17. ట్రంప్ పరిపాలన భారతదేశానికి మద్దతుగా ఉంది 18. వికాసిత్ భారత్ 2047 19. ఇప్పటివరకు 1000 విమానాలు ఆర్డర్ చేయబడ్డాయి మాజీ కేంద్ర మంత్రి బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ భారతీయులు ప్రపంచ వ్యాప్తంగా తలెత్తుకునే పరిస్థితి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కల్పించారు. నరేంద్ర మోడీ పై దేశంలో నైనా గౌరవం పెరిగింది ఈ కారణంగా ఎన్నో ప్రయోజనాలు భారతీయులకు కలిగాయి. మధ్యతరగతి ప్రజలు మెచ్చే బడ్జెట్ అన్నారు. బిజెపి మీడియా రాష్ట్ర ఇంఛార్జి పాతూరి నాగ భూషణం మాట్లాడుతూ బడ్జెట్ పై మాట్లాడుతూ బడ్జెట్ ప్రవేశ పెట్టి ప్రజలతో చర్చించే ధైర్యం ఒక్క బిజెపిప్రభుత్వానికి మాత్రమే ఉంది సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాంఅధ్యక్షత వహించారు. మేదావులు ప్రశ్నలకు కేంద్ర మంత్రి వివరణలు ఇచ్చారు.

# గ్రూప్-2 పరీక్షలు నేడు యధాతథం

>> హై కోర్టులో ఉన్న ఈ అంశంపై అఫిడవిట్ వేసేందుకు ఇంకా సమయం ఉందని అప్పటి వరకు పరీక్షలు నిర్వహించవద్దని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. గ్రూప్2 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని, రోస్టర్ విధానంలో మార్పులు చేయాలంటూ అభ్యర్థులు కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ విషయంపై అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లగా పరీక్షల ను నిలిపి వేయడాన్ని నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రూప్2 అభ్యర్థులు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. విశాఖపట్నం, హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. 2023 డిసెంబరు 7వ తేదీన ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్ సుప్రీంకోర్టు తీర్పు, ఏపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 77కి విరుద్ధంగా ఉందని, ఈ విషయాన్ని సింగిల్ జడ్జి విస్మరించారని తెలిపారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించి, 23న జరగనున్న గ్రూపు2 మెయిన్స్ పరీక్షను నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. అయితే గ్రూప్2 మెయిన్స్ పరీక్ష అనంతరం అభ్యర్థుల నుంచి మరోసారి పోస్టుల ప్రాధాన్యతలు తీసుకుంటారని ఏపీపీఎస్సీ తెలిపింది. ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా రూపొందించే ముందు దీనికి సంబంధించిన ప్రక్రియ చేపడతామని తెలిపింది.

పోస్టులు, జోన్‌లపై అభ్యర్థులు ప్రాధాన్యతలు ఇవ్వాల్సి ఉంటుందని వెల్ల డించింది. అలాగే న్యాయం చేస్తానని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఇప్పటికైతే ప్రభు త్వ లేఖను గాని, స్వయనా ముఖ్యమంత్రి చం ద్రబాబు, విద్యామంత్రి నారా లోకేష్‌ల విజ్ఞప్తిని ఏపీపీఎస్సీ పరిగణనలోకి తీసుకోలేదు.





ప్రమాదం జరిగిన ఎస్ఎల్‌బిసి ఎడమగట్టు కాలువ టన్నెల్



శనివారం సంఘటనా ప్రాంతం వద్ద వివరాలు ఆరా తీస్తున్న తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

# మిర్చి రైతులను ఆదుకొంటాం

>> మచ్చుకుకు వచ్చిన తర్వాత ఉండటం లేదన్నారు. క్వింటాకు రూ.500 చొప్పున వ్యాపారులు తగ్గిస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే క్వాలిటీ సరిగా లేనందువల్లే తగ్గిస్తున్నామని వ్యాపారులు సమాధానం చెప్తున్నారని, ఉదయం ఉన్న క్వాలిటీ మధ్యాహ్నానికే ఎలా తగ్గుతుందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. యార్డుకు టిక్కీలు తేవాలంటే బాడిగకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని, యూనియన్‌లో లేని లారీలను బాడిగకు తీసుకొస్తే వారిని మిగతా లారీ యజమానులు బెదిరించి, కేసులు పెడుతున్నారని వివరించారు. నాటి తెలుగు దేశం ప్రభుత్వంలో ఇచ్చినట్లు క్వింటాకు ఇంత అని బోనస్ ప్రకటిస్తే రైతులకు మేలు చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. మిర్చి రైతుల నుంచి కిరాయి ఎక్కువ వసూలు చేసే లారీ యాజమాన్యాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణాను కొందరు తమ గుప్పెట్లో పెట్టుకుని రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించవద్దని అధికారులకు సూచించారు. మిర్చి యార్డులో ఎలక్ట్రానిక్ కాటాలు ఏర్పాటు చేసి మిర్చి టిక్కీలు కాటాలు వేసిన వెంటనే రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోల్డ్ స్టోరేజీలో టిక్కీలు నిల్వ చేసుకున్న రైతులకు బాండ్ల ఆధారంగా రుణాలు ఇచ్చేలా త్వరలో బ్యాంకర్లతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. గుంటూరులోని స్పైస్ పార్క్‌లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు మిర్చిని కల్లాల్లో ఆరబెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా అధికారులు తగిన సూచనలు చేయాలన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన భూసార పరీక్షలు మళ్లీ ప్రవేశపెడతామని, తద్వారా నేల స్వభావాన్ని బట్టి రైతులు ఏఏ పంటలు సాగుచేసుకోవచ్చునో తెలుసుకోవచ్చు అన్నారు. క్వింటా మిర్చిధర రూ.11,781 కంటే తక్కువగా ఉంటే మార్కెట్ ఇంట్రవెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని ప్రతిపాదనలు ఉంచినట్లు సీఎం తెలిపారు. దీనికి కేంద్రం అంగీకారం తెలిపింది అన్నారు. దీనిలో 50 శాతం కేంద్రం భరిస్తే, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం భరించాల్సి ఉందన్నారు. అయితే ఈ విధానం అమలు చేస్తే పక్క రాష్ట్రాల్లోని రైతులు, వ్యాపారులు ఏపీకి పంటను తెచ్చి అమ్ముకునే ప్రమాదం ఉందని, తద్వారా ఏపీ రైతులకు న్యాయం జరగదని రైతులు అభిప్రాయపడ్డారు. దీనిపై కేంద్రంతో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం అన్నారు. 2017లో కూడా ధర పతనమైనప్పుడు వెంటనే తమ ప్రభుత్వం స్పందించి క్వింటాకు రూ.1500 చొప్పున అందించామని, అందుకు రూ.135 కోట్లు ఖర్చు చేశామని సీఎం గుర్తు చేశారు. ఇప్పుడు కూడా రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కష్టాల నుంచి గట్టెక్కించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది నిన్న ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి చర్చించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. మిర్చి రేటు రూ.13 వేలకు పడిపోయిందని ఆరోపిస్తున్నారని, అయితే గత పదేళ్లలో మిర్చి ధరలు పరిశీలిస్తే అత్యధికంగా రూ.13,600/ లు మాత్రమే ఉందని ఆయన తెలిపారు. కేవలం గత రెండేళ్లు మాత్రమే అంతర్జాతీయంగా కొన్ని కారణాలు వల్ల మిర్చి రైతుకు రూ.20వేల ధర పలికిందన్నారు. ఈక్రాప్ ఆధారంగా రైతులకు సాయం ఈక్రాప్‌లో నమోదైన రైతుల వివరాలు, యార్డులో పంటను అమ్ముకుని రికార్డులో నమోదై ఉన్న వివరాలా ఆధారంగా రైతులకు సాయం చేసే అంశాన్ని పరిశీలిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కువగా మామిడి, మిర్చి సాగు ఉన్నందును బోర్డు ఏర్పాటుపైనా త్వరలో చర్చిస్తామని సిఎం అన్నారు. తక్షణమే కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం, అధికారులతో మాట్లాడి మిర్చి కంటెయినర్‌ల రవాణాకు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. వ్యవసాయమంత్రి కింజరపు అచ్చెన్నాయుడు సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో దాదాపు 70 శాతం జనాభాకి ప్రధాన జీవనోపాధిగా ఉన్న వ్యవసాయ అనుబంధ రంగాలను గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యం చేసిన వ్యక్తి ఇప్పుడు ఈ విధంగా మాట్లాడటం ఎంతో ఆశ్చర్యంగా ఉందన్నారు. మిర్చిరైతులకు గిట్టుబాటు ధర అంశంపై సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొనుగోళ్ళు, ఎగుమతులపై సమాచారాన్ని అప్డేట్ చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు.

సమావేశానికి వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మార్కెటింగ్ శాఖఅధికారులు హాజరయ్యారు.

# అసభ్య పోస్టులకు ఇక కళ్లెం!

>> కారణంతో వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగేలా అసభ్య పోస్టులు పెట్టడానికి వీల్లేదని స్పష్టం చేసారు. ఏది అసలైందో ఏది నకిలీనో గుర్తించలేకుండా ఫోటోలను మార్ఫింగ్ చేస్తున్నారు. డీప్‌ఫేక్ ఫోటోలపైనా పోలీసులు దృష్టి పెట్టాలని సూచించింది. అసభ్య, అభ్యంతరకర పోస్టులను నిరోధించేందుకు ఇవపోలీసుల తరపున పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు విన్పించారు. పిటిషనర్ల చర్యలు వ్యవస్థీకృత నేరం కిందకు వస్తాయి. తప్పుడు పోస్టులు పెట్టేందుకు తాడేపల్లిలోని వైకాంగ్రెస్‌పార్టీ సోషల్ మీడియా కార్యాలయంలో 400 మందికి పైగా పనిచేశారు. అక్కడి నుంచి మార్ఫింగ్ చేసిన ఫోటోలు మెసేజ్‌లను జిల్లాస్థాయి సోషల్ మీడియా కన్వీనర్లకు పంపించేవారు. కోకన్వీనర్లు నిర్వహించే గ్రూపుల్లో 200-250 మంది సభ్యులుంటారు. ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన అసభ్య పోస్టులను ఫోటోలను వారు వివిధ గ్రూపుల్లో షేర్ చేసేవారు. అందుకు వారికి డబ్బులు చెల్లించేవారు. వైకాపా సోషల్ మీడియా నిర్వహణలో పిటిషనర్లది కీలకపాత్ర. సజ్జల భార్గవరెడ్డి సూచనల మేరకే అలాంటి పోస్టులు పెట్టామని నిందితులు వాంగ్మూలమిచ్చారు. నచ్చని ఏ వ్యక్తినీ ఏ వర్గాన్నీ వదిలిపెట్టకుండా వీరు పోస్టులు చేశారు. న్యాయమూర్తులను చివరకు దేవుళ్లనూ వదల్లేదు. ప్రతి ఒక్కరూ వీరి బాధితులే. పిటిషనర్లు నిరక్షరాస్యులేమి కాదు. బాగా చదువుకున్న వారు. వ్యక్తిత్వ హననం, ప్రతిష్ఠలను దెబ్బ తీయం, అపకీర్తి పాల్జేయడం, బెదిరించడంలో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి వాటికి తావేలేదు. నిందితులెవరూ దర్యాప్తునకు సహకరించడం లేదని వాదించారు. ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కేసు నమోదైన సందర్భంలో నిందితులు నేరుగా హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదని సెక్షన్ 14ఏ ప్రకారం ముందుగా ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని కోర్టు దృష్టికి తెచ్చారు.



రాజంపేట మండలం మందపల్లె రెవెన్యూ పొలంలోని ప్రభుత్వ భూములు

# రాజంపేట ఎమ్మెల్యే భూ ఆక్రమణపై నివేదిక కోరిన ప్రభుత్వం

## జాయింట్ కలెక్టర్ విచారణ పూర్తి

## ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాకు నివేదిక

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఉమ్మడి కడప జిల్లా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి ప్రభుత్వ భూముల ఆక్రమణపై అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ విచారణ పూర్తి అయింది. జాయింట్ కలెక్టర్ జారీ చేసిన నోటిసులతో ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి ఎమ్మెల్యే తరపున న్యాయవాది సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఫిర్యాదుదారుడు గన్నే సుబ్బ నర్సయ్య నాయుడు కూడ జేసీ ఎదుట హాజరయ్యారు. అమర్‌నాథ్ రెడ్డి న్యాయవాదిని జాయింట్ కలెక్టర్ ఈ భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అమర్‌నాథ్ రెడ్డి అనుభవంలోనే చాలా కాలం నుంచి ఉన్నాయని పేర్కొనట్లు తెలిసింది. ఆ భూములు మీకెలా సంక్రమించాయని జేసీ ప్రశ్నించారు. భూములు ఎలా వచ్చాయో ఆధారాలు సమర్పించాలని జేసీ కోరారు. రాజంపేట కోర్టులో దీనికి సంబంధించి కేసు నడుస్తోందని న్యాయవాది చెప్పారు. మార్చి 4న వాయిదా ఉందని తెలియజేశారు. ఇప్పటికే చాలా గడువు ఇచ్చామని శనివారం సాయంత్రం 5గంటలలోగా భూములకు సంబంధించిన ఆధారాలు ఉంటే సమర్పించాలని కోరారు. అయితే ఎలాంటి ఆధారాలు చూపనట్లు సమాచారం. ఈ సంధర్భంగా జాయింట్ కలెక్టర్ న్యాయవాదిని పలు ప్రశ్నలు వేసినట్లు సమాచారం. రాత్రికి రాత్రి రికార్డుల్లో ఎక్కిస్తే అమర్‌నాథ్ రెడ్డి భూములు ఎలా అవుతాయని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ సంధర్భంగా విచా రణలో రాజంపేట తహసీల్దార్ పీర్‌మున్నీ, ఆకేపాడు, మందపల్లె, శేశమాంబాపురం గ్రామాల వీఆర్వోలు జేసీ కోర్టులో హాజరయ్యారు. అంతకుముందు పత్రికల్లో ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఆకేపాటి ఎస్టేట్‌లో ఉన్న ప్రభుత్వ భూములపై పత్రికల్లో వెలువడిన వార్తలపై ప్రభుత్వం నివేదిక కోరినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) సిసోడియా ఎమ్మెల్యే భూముల ఆక్రమణపై సమగ్ర నివేదిక పంపాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు జేసీ విచారణ అనంతరం ప్రభుత్వానికి నివేదిక కూడ పంపినట్లు తెలుస్తోంది. ఈ సంధర్భంగా ఆకేపాడు, మందపల్లె భూములే కాకుండా ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేర్లతో శేశమాంబాపురం, శ్రీరంగరాజు పొలెంలో కూడ పెద్దఎత్తున భూములు ఉన్నాయని, రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో కూడ వివరాలు ఉన్నాయని ఫిర్యాదుదారులు జాయింట్ కలెక్టర్ విచారణ సంధర్భంగా వివరాలు అందజేసినట్లు తెలుస్తోంది.

జాయింట్ కలెక్టర్ విచారణ పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వానికి నివేదిక ఆధారంగా ప్రభుత్వం ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే ఆక్రమించిన వ్యవహారంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

# మహిళల రక్షణకు సురక్ష యాప్: హోం మంత్రి అనిత

>> నిఘా చర్యలుంటాయన్నారు. నేర నియంత్రణలో సురక్ష టీములు చురుగ్గా వ్యవహరించాలన్నారు. పోలీసులు శాంతిభద్రతల అంశంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా సున్నిత పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నేర నియంత్రణకు సంబంధించి ప్రజలకు అత్యావసర సాయాన్ని అందించడానికి వీలుగా నిర్దేశించిన టోల్ నెంబర్లపై అవగాహన కల్పించాలన్నారు.

# రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

>> స్పీకర్, సీఎం వచ్చి వెళ్లే కారిడార్ లో ఇతరులకు అనుమతి లేదని స్పష్టం నాలుగో గేట్ గన్ పాయింట్ మినహా భద్రతా సిబ్బందిని అనుమతించేది లేదని వెల్లడి మంత్రులు, సభ్యుల పీఏలను అవసరం మేరకు మాత్రమే అనుమతి శాసనసభా వ్యవహారాలతో సంబంధం లేని ప్రభుత్వ సిబ్బందికి అనుమతి లేదని స్పష్టం శాసనసభ, మండలిలోకి సభ్యులు ఎవరూ ఆయుధాలతో రాకూడదని స్పష్టంఒక వేళ వచ్చినా ప్రాంగణంలో ఉన్న ఉన్న బెల్ ఆఫ్ ఆర్మ్‌లో డిపాజిట్ చేయాలని సూచన.

# అసెంబ్లీకి హాజరు కానున్న మాజీ సీఎం జగన్

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** జగన్‌తో పాటు అసెంబ్లీకి హాజరు కానున్న వైకాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు. ఈ నెల24న మొదటి రోజు గవర్నర్ ప్రసంగం రోజున అసెంబ్లీకి జగన్ వస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## వారం - వర్జ్యం

తేది : 23-02-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
దశమి మ.1.57
మూల సా.6.42
వర్జ్యం : తె.4.24-6.01
దు.సా.4.43-5.30
శుభసమయం : ఉ.7.00-8.00
సా.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. ఊహించని సంఘటనలు.

**వృషభం:** వృత్తి, వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురై చికాకులు పెడతాయి. స్వల్ప ధన లాభం పొందుతారు.

**మిథునం:** పనులలో ఆటంకాలు ఎదురైన పట్టుదలతో పూర్తి చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**కర్కాటకం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**సింహం:** సోదరులతో ఏర్పడిన మాట పట్టింపులు పరిష్కరించుకొంటారు. ఇంటా బయటా అనుకూలం.

**కన్య :** ముఖ్యమైన పనులలో ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**తుల :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం.

**వృశ్చికం:** ఆకస్మిక ధనలాభం పొందుతారు. విలువైన వస్తువులు, ఆభరణాలు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** మిత్రులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మకరం:** బంధువర్గం నుండి వత్తిడులు ఎదురైన అధిగమిస్తారు. ప్రముఖుల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**కుంభం:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**మీనం :** సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఇంటా బయటా అనుకూలం.

# కుప్పకూలిన సొరంగం

## ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనుల్లో అపశ్రుతి

## లోపల చిక్కుకొన్న 8మంది

## 42 మంది సురక్షితంగా బయటకు

## వారిని రక్షించేందుకు రెస్క్యూటీం యత్నాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ పనుల్లో అపశృతి చోటుచేసుకున్నది. బోరింగ్ పని మొదలుపెట్టిన వెంటనే టన్నెల్ పైభాగంలో ఒక్కసారిగా కుప్పకూలింది. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని దోమలపెంట సమీపంలో ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటరు వద్ద శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. లోపల సుమారు 50మంది వరకు కార్మికులు సిబ్బంది ఉండగా 42మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. మరి కొందరిని బయటకు తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈమేరకు మంత్రులు, అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. ఇప్పటికే మంత్రుల బృందం, కలెక్టర్, ఎస్పీలు, ఇంజినీర్లు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

**అసలేం జరిగింది..** దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాలు మొదలు పెట్టిన ఏజెన్సీ నిర్వాహకులు చెప్పే కథనం ప్రకారం అకస్మాత్తుగా లోపలికి నీరు, మట్టి 8 కిలోమీటర్ల మేర రావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెబుతున్నారు. రోజువారీగా పని మొదలు పెట్టినట్లే ఈ ఉదయం 8 గంటలకు పని మొదలు పెట్టిన 30 నిమిషాలలోనే ఈ సంఘటన జరగడంతో వెంటనే నిర్వాహకులు పనిని నిలిపి వేసి బయటకు రావడంతో పాటు వీలున్నంత వరకు సిబ్బందిని బయటకు తీసుకొచ్చారన్నారు. 14వ కిలోమీటరు వద్ద సొరంగంలో సుమారు 3మీటర్ల మేర పైకప్పు కూలిపడింది. ఏదైతే టన్నెల్ బోర్ మిషన్ టీబీఎం, వద్ద పని మొదలు పెట్టారో అక్కడికి నీరు, మట్టి చేరుతుండడంతో పాటు ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మిషన్ మీద ఉన్న వారు, వెనుక భాగంలో ఉన్న వారు బయటకు రాగలిగారని, మిషన్ ముందు భాగంలో ఉన్న వారు అందులో చిక్కుకున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ ప్రమాదంపై ఎస్పీ వైభవ్ గైక్వాడ్ స్పందించారు. ప్రమాద సమయంలో 50మంది కార్మికులు ఉన్నారని, రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని తెలిపారు. గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఎడమవైపు సొరంగం పనులు మొదలు పెట్టి నాలుగు రోజులు కావడం గమనార్హం.

**టన్నెల్‌లో చిక్కుకున్న వారి వివరాలు..**

1. మనోజ్ కుమార్ (పీఈ) ఉత్తర ప్రదేశ్
2. శ్రీనివాస్ (ఎఫ్ఈ) ఉత్తర ప్రదేశ్
3. సందీప్ సాహు (కార్మికుడు)జార్ఖండ్
4. జటాక్స్ (కార్మికుడు)జార్ఖండ్
5. సంతోష్ సాహు (కార్మికుడు)జార్ఖండ్
6. అనూజ్ సాహు (కార్మికుడు)జార్ఖండ్
7. సన్నీ సింగ్ (కార్మికుడు)జమ్మూ కాశ్మీర్
8. గురుప్రీత్ సింగ్ (కార్మికుడు)పంజాబ్

### దురదృష్టకరంః తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఎస్.ఎల్.బి.సి టన్నెల్ లో ఈ తరహా సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్.ఎల్.బి.సి టన్నెల్ తవ్వకాలలో ప్రమాదం జరిగిందన్న విషయం తెలుసుకుని హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నారు. సంఘటనా స్థలిని పరిశీలించడంతో పాటు లోపట చిక్కుకున్న వారిని కాపాడడం కోసం అవసరమైన చర్యలు తీసుకునేందుకు గాను దోమలపెంటలోని జే.పి గెస్ట్ హౌస్‌లో సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి తెలంగాణా అగ్నిమాపక, రిస్క్యూ టీం డి. జి నారాయణ రావు, ఐ. జి సత్యనారాయణ నాగర్ కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్‌తో పాటు రాబిన్ సంస్థ కు చెందిన లెన్ మైనార్డ్ తో సమీక్ష సమావేశం నిర్వహించారుఅనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సొరంగంలో చిక్కుకున్న మిగిలిన ఎనిమిది మందిని సురక్షితంగా కాపాడడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డి పని చేస్తుందన్నారుఅందు కోసం ఇప్పటికే సింగరేణి కి చెందిన రిస్క్యూ టీం లు రంగంలోకి దిగాయని, భారత ఆర్మీ కి చెందిన రిస్క్యూ టీంలతో తాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడామని ఈ రాత్రి వరకు ఆ టీం ఇక్కడికి చేరుకుంటుందని ఆయన వెల్లడించారు. అంతేగాకుండా టన్నెల్ వద్ద ప్రమాదాలు సంభవించినప్పుడు రంగంలోకి దిగి కాపాడే టీంలతో కుడా మాట్లాడినట్లు ఆయన తెలిపారు. ఈ మధ్య కాలంలో ఉత్తరఖండ్ రాష్ట్రంలో ఈ తరహా సంఘటన చోటు చేసుకున్నప్పుడు రంగంలోకి దిగి ప్రాణాపాయం లేకుండా కాపాడిన టీంను కుడా రంగంలోకి దింపనున్నట్లు ఆయన తెలిపారురాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లతో పాటు ఉన్నత స్థాయి ప్రభుత్వ యంత్రాంగం ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకుగాను ఎప్పటికప్పుడు సమాలోచనలు చేస్తూ సమిష్టి నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. అగ్నిమాపక డి.జి నారాయణ రావు ఆధ్వర్యంలో రీస్క్యూ టీం పనిచేస్తుండగా ఐ. జి సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయన్నారు. ఇప్పటికే వైద్య బృందం అంబులెన్స్ లను సిద్దంగా ఉంచామన్నారునీటిపారుదల శాఖాధికారులు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వారిని కాపాడేందుకు చేపడుతున్న చర్యలను పర్యవేక్షిస్తున్నామన్నారు. అయితే వెంటిలేషన్ కు ఇబ్బంది లేదన్నారు. టన్నెల్ తవ్వకంలో రాబిన్ సంస్థ ప్రపంచ స్థాయిలో పేరెన్నికగన్న దన్నారు. లోపల చిక్కుకున్న ఆ ఎనిమిది మందిని సురక్షితంగా కాపాడడమే ప్రభుత్వం ముందున్న సవాల్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారుప్రమాదంలో చిక్కుకున్న ఆ ఎనిమిది మందిలో ప్రాజెక్ట్ ఇంజినీర్, సైట్ ఇంజినీర్ తో పాటు ఇద్దరు మిషన్ ఆపరేటర్లు, నలుగురు వర్క ర్లు ఉన్నారని ఆయన వివరించారువారి వివరాలను ఆయన మీడియా కందించారు.

## లాభాల బాటలో ఉన్న ఫైబర్ నెట్‌ను నిర్వీర్యం చేసే కుట్ర

### - సంస్థ మాజీ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి

**విజయవాడ,ఫిబ్రవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** లాభాల బాటలో ఉన్న ఫైబర్ నెట్ ను చంద్రబాబు నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నారని ఫైబర్ నెట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డి ఆరోపించారు. అసత్యాలను ప్రచారం చేయడం ద్వారా సంస్థను భ్రష్టు పట్టించే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఫైబర్ నెట్ ను ప్రైవేట్ కంపెనీలకు అప్ప గించేందుకు రంగం సిద్ధం చేశారని ఆరో పించారు. చంద్రబాబు ఆదేశాలతో ఫైబర్ నెట్‌లో అవినీతిని చేసేందుకు ప్రయత్నిస్తున్నా రన్నారు. ఈ విషయంపై న్యాయ,ప్రజా పోరాటం చేస్తామన్నారు. చంద్రబాబు ఫైబర్‌నెట్ విషయంలో చేస్తున్న అక్రమాలను చూస్తూ ఊరుకోమన్నారు.తమ ప్రభుత్వ హయంలో ఫైబర్ నెట్‌ను లాభాల బాటలోకి తెచ్చా మన్నారు.. అలాంటి సంస్థను నాశనం చేసేం దుకు యత్నిస్తున్నారని గౌతమ్ రెడ్డి విమర్శించారు. 2014- 19లోనే ఫైబర్ నెట్ లో చంద్రబాబు భారీ అవినీతి చేశారన్నారు. దీనిపై తమ హయాంలో విచారణ జరిపించామని తెలిపారు. చంద్రబాబు అవినీతి, అక్రమాలను సీఐడీ నిరూపించిందని చెప్పారు. ఫైబర్ నెట్ ప్రతి కాంట్రాక్టులో అవినీతి జరిగిందని అన్నారు. ఇప్పుడు సీఎం అయిన తర్వాత తన మీద ఉన్న కేసులను చంద్రబాబు మాఫీ చేయించుకుంటున్నారని తెలిపారు.

## ఉద్యోగుల బకాయిలు చెల్లించేలా బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలి

### రాష్ట్ర విఆర్ఓ అసోసియేషన్

**విజయవాడ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** సోమవారం నుండి జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో ఏపి ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పాతబకాయిలు, డిఏ, ఐఆర్, పిఆర్‌సి కమిటీపై నిర్ణయం తీసుకుని ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఏపి విఆర్ఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరం లోగా నిర్ణయం తీసుకుంటామని డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం రావడానికి కృషి చేసిన ఉద్యోగులకు న్యాయం చేయాలని, సిపిఎస్ ఉద్యోగులకు పరిష్కారం చూపాలన్నారు.



ధ్వజస్తంభంపై చీరలు అధిరోహిస్తున్న దృశ్యం

## కన్నుల పండువగా కైలాసనాధుని ధ్వజారోహణం

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా,కన్నుల పండుగా కైలాసనాధుని తిరునాళ్ళకు ధ్వజపూజలు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం 1 గంటకు పూజల్ని ప్రారం భించారు. శుక్రవారం సాయంత్రం భక్త కన్నప్ప ధ్వజారోహణ తరువాత బ్రహ్మోత్సవాలకు శ్రీకారం కాగా స్వామి ధ్వజారోహణ ప్రారంభోత్సవం అని చెప్పవచ్చు. ఉదయం పట్టణ ప్రజలకు దాతలు అందించిన కొత్త వెండిపల్లకీల్లో స్వామి అమ్మవార్లు దర్శనమిచ్చి ఆలయానికి చేరుకున్న తరువాత స్వామి గర్భగుడి ఎదురుగా స్థానిక సంప్రదాయం మేరకు పంచమూర్తుల్ని ప్రతిష్టించారు. వెండిపల్లకిలో భోళాశంకరుని, దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని పడమర దిక్కుగా ప్రతిష్టించగా ఎదురుగా ధ్వజస్తంభం తూర్పు అభిముఖంగా దర్శనమిచ్చింది. అలాగే ఉత్తరాభిముఖంగా వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని దక్షిణాభిముఖంగా వినాయకుని ప్రతిష్టించారు. ఆలయ అభిషేకగురుకుల్ డాక్టర్ స్వామినాధన్, ప్రధానర్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్స్ పర్యవేక్షణలో వరదా గురుకుల్, వేదపండితులు,పొరోహితులు అర్ధగిరి, శ్రీని వాస శర్మ వేదమంత్రాల్ని పఠిస్తుండగా అష్టదిక్పాలకులు, పంచపాలకులు, వరుణదేవుని కలశాల్ని ప్రతిష్టించారు. వాటి ముందు ప్రధాన కలశాన్ని దాని ముందు హోమాన్ని ఏర్పాటు చేశారు. శాస్త్రోక్తంగా సంకల్పం జరిపారు. స్వామి అమ్మవార్లకు పండ్లు,పత్రి,పూలతో కూడిన పళ్ళెముల్ని ఊరేగింపుగా నాయకులు, అధికారులు తీసుకొని ధ్వజస్తంభం నుంచి స్వామి గర్భగుడిలో ప్రదక్షిణలు జరిపారు. అనంతరం మళ్ళీ హోమాలు జరిపారు. ఆలయ సంప్రదాయం మేరకు సుమారు రెండు గంటలకుపైగా వేదపండితుల వేదఘోషతో కార్యక్రమాలు సాగాయి. అనంతరం శాస్త్రోక్తంగా మొదట ఆలయం నుంచి ధ్వజ మింటిని ఆధిరోహించారు.ఆ తాడుతో పాటు ధ్వజ సంకేతం కల్గిన పటాన్ని ధ్వజస్తంభంమీదికి అధిరోహింపజేసారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పూజలు, వేదమంత్రాలతో పునీతమైన కలశాల్లోని నీటితో ధ్వజస్తంభానికి అభిషేకాలు జరిపారు.బలి ముద్దల నివేదన జరిపాక ఉత్సవర్లకు ధూపదీప నైవేద్యం సమర్పించారు.అనంతరం గర్భాలయంలో మూలవిరాట్టుకు దీపారాధన జరిపారు. దాంతో ధ్వజారోహణ కార్యక్రమాలు ముగిశాయి.ఈ కార్యక్రమాల్లో ఉభయదారులు బయ్యా నాగమ్మకుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఏర్పాట్లను ఇఓ డి.బాపిరెడ్డి వ్యక్తిగతంగా పర్య వేక్షించారు. వచ్చిన భక్తులకు ఉభయదారులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ఇఇ మురళీ ధర్‌రెడ్డి,డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్, ఎఇఒలు సతీష్‌మాలిక్, లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, వెంకటమునిరెడ్డి సుదర్శనం, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి పర్యవేక్షణలో, వారి సిబ్బంది పర్యవేక్షించారు. కాగా ఈ కార్యక్రమాలకు ఎంఎల్ఏ మాతృమూర్తి బొజ్జలబృందమ్మ, మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్,పట్టణ తెలుగుదేశం మహిళ అధ్యక్షురాలు సుమతి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సాగుతున్న తొక్కిసలాట కేసు విచారణ!

### - మలివిడత రంగంలోకి విశ్రాంత న్యాయమూర్తి - బాధిత సాక్షుల విచారణతోనే వాస్తవాలు

**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జనవరిలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల టోకన్లు జారీలో జరిగిన తొక్కిసలాట కేసు మలివిడత విచారణ సాగుతోంది. తాజాగా గత జనవరి 8వతేదీ రాత్రి జరిగిన తొక్కిసలాటఘటనలో ప్రత్యక్ష సాక్షులైన తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను పిలిచి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఈ కేసు దర్యాప్తు అధికారి జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తి కారణాలను రాబడుతున్నారు. అసలు ఈ తొక్కిసలాట ఎలా జరిగింది?ఎంతమంది ఒక్కసారిగా తిరుపతి బైరాగిపట్టెడలోని పద్మావతి ఉద్యానవనం నుండి రామానాయుడు పాఠశాల ఆవరణలోకి వెళ్ళేందుకు ప్రయత్నించారు, తొక్కిసలాట ఎలా జరిగిందంటూ ప్రత్యక్షసాక్షులు కొందరిని విచారణ చేయడానికి ప్రశ్నావళి సిద్ధం చేసుకున్నారు. ఈ కేసులో మొదటి విడతలో టిటిడి ఇఒ శ్యామలరావు, జెఇఒ వీరబ్రహ్మం, తిరుపతి అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, సిఐలు,ఎస్ఐలను కొందరిని తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రత్యేక గదిలో విచారణ చేసి వారి నుండి వివరాలు సేకరించారు. ఇప్పుడుప్రత్యక్షసాక్షులను మాట్లా డించి వివరాలు రాబట్టేందుకు చూస్తున్నారు. దీనితరువాత అసలు కారకులు ఎవరనేది రానున్న వారంలో విశ్రాంత న్యాయమూర్తి నివేదికలు సిద్ధం చేయనున్నారనేది తెలుస్తోంది. దాదాపు 50మందికిపైగా క్షతగాత్రులు ఉన్నా వారిలో తీవ్రంగా గాయపడి కోలుకున్న వారిని మాత్రమే విచారణకు పిలిచి సమాచారం రాబట్టనున్నారు. జనవరి 8వతేదీ దేవుని దర్శనానికి వైకుంఠద్వార మోక్షమార్గానికి రమ్మని పిలిచి సరైన సౌకర్యాలు,భద్రత కల్పించలేకపోవడంతో తొక్కిసలాట జరిగిందనే ప్రధాన కారణంగా ఇప్పటికే సమాచారం ఉంది. మళ్ళీ రెండవ విడత న్యాయమూర్తి రావడంతో శనివారం నుండి ఈ కీలక విచారణ మొదలైంది. వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీకి ముందే చోటుచేసుకున్న తొక్కిసలాటకు కారణాలు, అక్కడ భద్రత ఏర్పాట్లుపై సంబంధిత పోలీసు, రెవెన్యూ, టిటిడి అధికారుల వ్యవహారంపై ప్రజల నుండి ఆధారాలు రాబట్టనున్నారు. తిరుపతిలో బైరాగిపట్టెడ పద్మావతి ఉద్యానవనం లో, శ్రీనివాసం వసతిసముదాయం ప్రాంగణం లోపల, విష్ణునివాసంలో జరిగిన ఘటనలు విషాదకరమే. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులంద రికీ తగిన ఆహారం, తాగునీరు,టీ,కాఫీ వంటి సదుపాయాలుగానీ, విశాలమైన చోట్ల వసతి లేకపోవడంతోనే టోకెన్ల జారీ సమయంలో తొక్కిసలాట జరిగిందని కొందరు తెలిపినట్లు సమాచారం. ఒక్కసారిగా నిరీక్షణ ప్రాంతం నుండి క్యూలైన్లలోనికి చేరుకునేందుకు తోపులాట జరిగిందనేది వివరాలు వెల్లడించినట్లు తెలుస్తోంది.

ఈ ఘటనలో గతంలోనే టిటిడి జెఇఒ గౌతమి, సివిఎస్ఒ శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి టౌన్ డిఎస్పీ వెంకటనారాయణపై బదిలీ వేటు పడిన విషయం విదితమే. బైరాగిపట్టెడలో బందోబస్తు పర్యవేక్షణలో ఉన్న తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్, టిటిడి గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాధరెడ్డి సస్పెన్షన్ చేశారు.

## ఏడు వారాల నగలు: శివరాత్రి అలంకరణలో ప్రత్యేకాకర్షణలు



.విలువ కట్టలేని శెనగపూల దండ, వజ్ర వైఢ్యూర్యాలు పొదిగిన స్వామి అమ్మవార్ల కిరీటాలు

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త** ఏడాది పొడవునా బ్యాంకు లాకర్లలో కునుకు తీసే స్వామి అమ్మవార్ల ఏడు వారాల నగలు మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలంటే వెలుగు చూస్తాయి. వాటితో అలంకరించటం విగ్ర హాలకే ప్రత్యేకత సంతరించు కుంటుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కైలాసనాధునికి రాజులు చేయించిన విలుక కట్టలేని, కోట్ల రూపాయల విలువ కల్గిన నగలతో ముస్తాబు చేయనున్నారు.ఈ మేరకు ఆలయ ఇఓ బాపిరెడ్డి,బాధ్యులు రాజేష్‌గురుకుల్, సూరి గురుకుల్,అకౌంటెంట్ యుగం ధర్, బాలాజి బ్యాంకులోంచి ఏడు వారాల నగల్ని బయటకు తీసారు. వాటిని అలంకార గురుకుల్స్‌కు అప్పగించారు. 1999లో అప్పటి ట్రస్టుబోర్డు చైర్మెన్ కొండుగారి శ్రీరామమూర్తి మొదటి సారి లాకర్లలోని నగల్ని బయటికి తీయించి భక్తులకు చూపించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వ రాలయానికి సంబంధించి రాజులు పరిపాలించిన కాలంలో ఏడు వారాల నగలు విలువ కట్టలేనివి అందించారు. ఈ నగలు మిరాసి ఉన్నంత కాలం ఆలయ ప్రధానార్చకుల చేతుల్లో ఉండేవి. 1984 తరువాత ఈ నగల్ని దేవస్థానంకు అప్పగించారు.అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయానికి సంబంధించి కూడా కోట్ల విలువ చేసే ఏడు వారాల నగల్ని రాజులు బహుకరించారు. అయితే మిరాసి విధానం రద్దు అయిన తరువాత వీటిని దేవస్థానం స్వాధీనం చేసుకుంది. వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరచారు. 1998 వరకు ఈ నగలకు సంబంధించి భక్తులకు జనానికి తెలియదు. ఆ సంవత్సరం ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా ఉన్న కొండుగారి శ్రీరామమూర్తి చొరవ చూపి బ్యాంకు లాకర్లో మూలుగుతున్న కోట్ల విలువ చేసే బంగారు ఆభరనాల్ని బయటకు తీసారు. వాటిని స్వామి అమ్మవార్లకు అలంకరించి భక్తులకు కనువిందు చేశారు శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో స్వామి అమ్మవార్లకు రాజులు అందించిన ఏడు వారాల నగల్ని అలంకరించాలని ప్రస్తుత ఇఓ పి.బాపిరెడ్డి నిర్ణయించారు. దాంతో ఈ ఏడాది కూడా భక్తులు స్వామి అమ్మవార్ల ఏడు వారాల నగలతో దరి ్శంచుకోనున్నారు. శనివారం వెండిపల్లకీల్లో దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లు, ఏడు వారాల నగలఅలంకార భూషితులై కనువిందుచేశారు.

## కుంభమేళాలో పుణ్యస్నానం - ఆధ్యాత్మిక అనుభవం

### - వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,ఫిబ్రవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుతం యుపిలో కొనసాగుతున్న మహా కుంభమేళాలో పుణ్యస్నానం ద్వారా కలిగే అనుభవం అనిర్వచనీయమైనదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం నాడు ఆయన ప్రయాగ్ రాజ్ లో మహా కుంభమేళా సందర్భంగా పవిత్ర గంగానదిలో పుణ్యస్నానమాచరించారు. ఈ పవిత్ర స్నానం తనకు అత్యున్నత ఆధ్యాత్మిక అనుభవంతో పులకింప చేసిందని ఆయన "ఎక్స్" వేదికగా వ్యాఖ్యానించారు. ఈ స్నానం సందర్భంగా హైందవ సంస్కృతీ ప్రవాహం యొక్క విశిష్టతను అనుభవపూర్వకంగా తెలుసుకునే అవకాశం తనకు లభించిందన్నారు. ధనిక, పేద కుల, వ్యత్యాసాలకు అతీతంగా ఆధ్యాత్మిక వికాసానికి హిందూ ధర్మం చూపే విశ్వసనీయ మార్గానికి ఈ మహా కుంభమేళా సజీవ సాక్ష్యమని ఆయన అభివర్ణించారు. కోట్లాది మంది భక్తులు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రయాగ్ రాజ్ వద్ద పవిత్ర స్నానం చేయటానికి యుపి ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు అభినందనీయమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయాల స్వతంత్ర హోదాను కొనసాగించాలి

### - సిఎంకు విజప్తి చేసిన రాష్ట్ర ఛాంబర్స్

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:**రాష్ట్రంలో ప్రతిపాదిత వ్యవసాయ ఉద్యాన విశ్వవిద్యాలయాల విలీనాన్ని పునఃపరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేసింది.సీఎం శనివారం ట్రెడర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఎపి ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడంలో వ్యవసాయం, ఉద్యానవన విశ్వవిద్యాలయాలు పోషించే కీలక పాత్రను నొక్కిచెప్పారు. వారి ప్రత్యే సహకారాలను గుర్తిస్తూ ప్రత్యేక పరిశోధన కేంద్రీకృత విద్యరంగ నిర్దిష్ట ఆవిష్కరణలను నిర్ధారించడానికి వారి స్వతంత్ర హోదాను నిలుపుకోవాలని చాంబర్ గట్టిగా వాదించింది. వ్యవసాయం మరియు ఉద్యానవన రెండు విభిన్న విభాగాలు, ప్రతి ఒక్కటి ప్రత్యేకమైన సవాళ్లు మరియు అవకాశాలను కలిగి ఉన్నాయని ఎపి ఛాంబర్స్ పేర్కొంది. వ్యవసాయం పంటల ఉత్పత్తి నేల నిర్వహణ మరియు ఆహార భద్రతపై దృష్టి సారిస్తుండగా ఉద్యానవన పంటలు అధిక విలువైన పండ్లు కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు మరియు పూల పెంపకంలో ప్రత్యేకత కలిగి ఉన్నాయి. ఇవి ఎగుమతులు మరియు గ్రామీణ ఉపాధికి గణనీయంగా దోహదం చేస్తాయి. ప్రత్యే విశ్వవిద్యాలయాలను నిర్వహించడం ద్వారా కేంద్రీకృత పరిశోధన మరియు ఆవిష్కరణలు ప్రత్యేక విద్య మరియు శిక్షణ, సమర్థవంతమైన రైతు ఔట్రీచ్ కార్యక్రమాలు మెరుగైన నిదులు మరియు పరిశ్రమలు సహకారం మరియు వ్యవసాయ ఆధారిత వృద్ధికి ప్రభుత్వ దృష్టికి మద్దతు లభిస్తుందని ఛాంబర్స్ అభిప్రాయపడింది. ఆంధ్రప్రదేశ్లో ఆర్థిక వృద్ధికి కీలకమైన ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, ఉద్యానవన కేంద్రీకృత సంస్థల నుంచి అంకితమైన పరిశోధన మరియు మద్దతు నుండి ఎంతో ప్రయోజనం పొందింది. గత 7-8 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ భారతదేశం యొక్క ఉద్యానవన కేంద్రంగా ఉద్భవించింది. పండ్ల ఉత్పత్తిలో నంబర్ 1 మరియు కూరగాయలు ఎగుమతుల్లో నంబర్ 2 స్థానంలో ఉంది. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 2024-29 ప్రారంభించడంతో రాష్ట్రం ఉద్యాన అధారిత పరిశ్రమలు విలువ జోడింపు మరియు ఎగుమతి ప్రోత్సాహానికి తన నిబద్ధతను బలోపేతం చేసింది. రెండు విశ్వవిద్యాలయాల స్వతంత్ర హోదాను నిలుపుకోవడం ఈ దృక్పథానికి అనుగుణంగా ఉంటుందన్నారు.

## సీమ మీదుగా గుజరాత్ వెళ్లే రైలు సర్వీసుల వేళల్లో మార్పులు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త** రాయలసీమ జిల్లాల మీదుగా చెన్నై సెంట్రల్ నుంచి ఏక్తానగర్,అహ్మదాబాద్‌లకు వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసుల వేళలను సవరించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చెన్నై సెంట్రల్ నుంచి ఏక్తానగర్ వెళ్లే నెంబర్ 20919ఏక్తా ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 18నుంచి ప్రతి శుక్రవారాల్లో మధ్యాహ్నం 3.50గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరి రేణిగుంట 6-30/35, కడప రాత్రి 8-08/10, గుంతకల్లు 11-15/20,రాయచూర్ 1-18/20, వాడి 3-20/25, కలబురిగి(గుల్బర్గా) 3-57/04-00,షోలాపూర్ ఉదయం 6-35/40,పూణే 11-00/05,కళ్యాణ్ మధ్యాహ్నం 1-22/25,వైసాయి రోడ్డు 2-20/25,వాపి 3-43/45, వల్సద్ సాయంత్రం 4-05/07,సూరత్ 4-52-55,వడోదర(బరోడా) 6-25/45,ఏక్తా నగర్‌కు శనివారం రాత్రి 8-40గంటలకు చేరుకుంటుంది. అలాగే చెన్నై సెంట్రల్ నుంచి అహ్మదాబాద్ వెళ్లే నెంబర్ 20953వీక్లి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 20నుంచి ప్రతి ఆదివారాల్లో రాత్రి 10-40గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరి అర్కోణం 11-38/40,రేణిగుంట 1-10/20,కోడూరు 1-54/55,కడప తెల్లవారుజామున 3-08/10, ఎర్రగుంట్ల 3-38/40, గుత్తి 5-19/20, గుంతకల్లు 5-50/06-00,ఆదోని ఉదయం 6-44/45,మంత్రాలయం 7-13/15, రాయచూరు 7-43/45,యాద్గిర్ 8-43/45, వాడి 10-10/15,కలబురిగి (గుల్బర్గా) 10-52/55, షోలాపూర్ మధ్యాహ్నం 12-20/25,పూణే సాయంత్రం 4-35/40,కళ్యాణ్ 7-27/30, వసాయి రాత్రి 8-25/30,బయిసర్ 9-08/10,వాపి 9-51/53,సూరత్ 11-19/22, వడోదర(బరోడా) అర్ధరాత్రి 12-58/1-03,ఆనంద్ 1-50/52,నదియాడ్ 2-07/09,అహ్మదాబాద్‌కు మంగళవారం తెల్లవారుజామున 3.20గంటలకు చేరుకుంటుంది.

# తిరుమల సమాచారం

## సర్వభూపాల వాహనంపై సిరులతల్లి



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యం లోని తమిళనాడు చెన్నైలో ఉన్న పద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం సర్వభూపాల వాహ నంపై పార్థసారధిస్వామి అలం కారంలో పద్మావతి అభయ మిచ్చారు. శ్రీవారి హృదయ పీఠంపై నిలిచి లోకాన్ని కటాక్షిస్తున్న అలిమేలుమంగ సర్వభూపాలురు వాహనస్థానీయులై అమ్మవారిని సేవించి తరిస్తున్నారు. ఇందులో అష్టదిక్పాలకులు ఉన్నారు. వీరంతా జగదేకవీరుడైన శ్రీవారి అర్థాంగిని పద్మావతిని సేవించి తరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఒ పార్థసారధి ,సూపరింటెండెంట్ పుష్పలత, ఆలయ అర్చకులు అధికారులు పాల్గొన్నారు.

## మకరవాహనంపై కపిలేశ్వరుడు అభయం



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానానికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి శేషవాహనంపై భక్తులకు అభయమిచ్చాడు. తన శిరస్సుపై పరమేశ్వరుడు శేషుని పడగలు గొడుగూగా వహించి పూజలందు కుంటున్నారు. ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తిగా కామాక్షి అమ్మవారితో కలసి మకరవాహనంపై ఊరేగారు. ఉదయం నిత్యకైంకార్యలు పూర్తిచేసుకున్న తరూవాత స్వామివారు ఆలయ పురవీధుల్లో ఊరేగడంతో భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మకరం గంగాదేవికి నిత్యవాహనం. మకరం జీవప్రకృతికి ఉదాహరణ. భగవంతుని ఆశ్రయించినంత వరకు జీవుడు నీటిలో మొసలిలా బలపరాక్రమంతో జీవించవచ్చును. మధ్యాహ్నం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారికి వేడుకగా విశేష స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## భక్తితో లక్ష్మీకాసులహారం ఊరేగింపు



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి అలంకరింపజేసే లక్ష్మీకాసుల హారం చంద్రగిరి శ్రీనివాసమంగాపురం కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లోశనివారం రాత్రి గరుడసేవలో అలంకరించారు. స్వామివారికి ఎంతో అమూల్యమైన ,అపూర్వకానుక లక్ష్మీకాసులహారం తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనం వద్ద నుండి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు భక్తితో పూజలు చేసి తలపై పెట్టుకుని ఊరేగింపుగా కాలినడకన తీసుకెళ్ళారు. అక్కడ స్వామివారికి అలంకరించేందుకు టిటిడి జెఇఒ వీరబ్రహ్మంకు లక్ష్మీకాసులహారాన్ని అందజేశారు. స్థానిక ఆలయాల్లో జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో గరుడసేవకు లక్ష్మీకాసుల హారం తిరుమల నుండి పంపి అలంకరింపజేయడం శాస్త్రోక్తం. టిటిడి నుండి మూడు లక్ష్మీకాసుల హారాలను స్వామివారికి అందించినట్లు అదనపు ఇఒ తెలిపారు. తిరుపతి నగరవీధుల్లో ఈ లక్ష్మీకాసుల హారం భక్తితో, కళాకారుల నృత్యాల నడుమ ఊరేగించారు.

## రాష్ట్రం ఆర్థిక పరిస్థితి చక్కదిద్దాలని వేడుకున్నా

### - ఐదేళ్లలో పూర్తిగా విధ్వంసమైంది :యనమల



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం ఆర్థికపరిస్థితి పూర్తిగా దారుణంగా ఉందని, గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో అడ్డదిడ్డంగా అనుకూలురుకు నిధులు కేటాయింపులతో అప్పులమయమైందని టిడిపి సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు ఆరోపించారు. గడ్డు పరిస్థితిని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబునాయుడు పూర్తిగా కష్టపడి పనిచేస్తున్నారన్నారు.గత ఐదేళ్ళలో దోచుకో దాచుకో అనేరీతిలో వైసిపి నాయకులు ఖజానా ఖాళీచేశారని మండిపడ్డారు. ఈ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆర్థికంగా కోలుకోవాలని, అందుకు అవసరమైన పూర్తిస్థాయి ఆశీస్సులు స్వామివారిని వేడుకున్నట్లు యనమల తెలిపారు. చాలారోజుల తరువాత తిరుమలకు వచ్చిన ఆయన శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకున్నారు. అంతా మంచిజరగాలని, ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని ముఖ్యమంత్రికి ఇవ్వాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అలిపిరిలో వాహనాల తనిఖీలకు మరింత సాఫీ లైన్లు



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు రానున్న వేసవిలో భక్తుల తాకిడిపెరిగే అవకాశం ఉండటంతో ముందుగానే టిటిడి అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా తిరుమలకు ముఖ్యమైన ప్రవేశద్వారమైన అలిపిరి టోల్‌గేట్‌ప్రాంతంలో వాహనాలు రద్దీ పెరిగితే గంటల తరబడి నిరీక్షణ, తనిఖీలు అంతంతమాత్రమే. కొన్ని సార్లు నామమాత్రంగా తనిఖీలు చేసి కొండకు వచ్చేస్తుంటాయి. దీనివల్ల అన్యమత స్టిక్కర్లు వాహనాలు, నిషేధిత పదార్థాలు తిరు మలకు చేరుతున్నాయి. దీన్ని కట్టడిచేసి పూర్తిస్థాయిలో నియంత్రించడానికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇటీవల అలిపిరి తనిఖీకేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ వాహనాలు బారులు తీరకుండా, ప్రత్యేక వరుసలతో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. అలిపిరి ఏవిఎస్ఒ రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం వాహనాలు పెద్దసంఖ్యలో చేరినా వరుసక్రమంలో రావడంతో వెంటనే తనిఖీలు చేసి పంపడంతో భక్తులు కూడా కొంతవరకు సంతృప్తి చెందారు.

## నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ వైస్ ప్రెసిడెంట్‌గా బడే ప్రభాకర్



**విజయవాడ, ఫిబ్రవరి 22.ప్రభాతవార్తప్రతినిధి:** నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(ఇండియా) న్యూఢిల్లీ సంఘ 202426 ద్వైవార్షిక ఎన్నికల్లో జాతీయ కార్యవర్గం ఎన్నిక 45మంది పాలకవర్గ సభ్యులుతో ఇటీవల ఏకగ్రీవంగా జరిగింది. మధ్యప్రదేశ్ కు చెందిన సురేష్ శర్మ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నూతన కార్యవర్గంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి బడే ప్రభాకర్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు..ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసో సియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పెన్) సంఘ నేత ప్రభాకర్ జాతీయ సంఘ ఉపా ధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల ప్రజాప్రతినిధులు, సంఘనేతలు, అధికారులు హర్షం వ్యక్తంచేశారు.

ఇటీవల కాలంలో రాష్ట్రంలో మరికొన్ని హత్యలు ఈ తరహాలోనే జరగడం గమనార్హం. ఇది లావుండగా హత్యలతోపాటు హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడాలంటే సాక్షులు కోర్టులో సాక్ష్యం చెపా ్పల్సి వుంటుంది. నిందితులకు శిక్షలు పడాలంటే ఇది ఎంతో ముఖ్యం. అనేకదేశాల్లో సాక్షులను కాపాడుకునే వ్యవస్థవుంది. ఈవ్యవస్థను విట్‌నెస్ ప్రొటెక్షన్ సిస్టం అని పిలుస్తుంటారు. ఈ వ్యవస్థ పటిష్టంగా వుండేందుకు ఆయా దేశాల్లో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంటారు. అవసరమైతే సాక్షులకు పోలీసు విభాగాలు తాముండే సురక్షిత ప్రాంతాలలోనే వుండే వీలు కల్పించడంతోపాటు ఇదే ప్రాంతంలో ఉద్యోగాలు కూడా ఇస్తారు. ఈ తరహా వ్యవస్థను ఇండియాలోనూ ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ దశాబ్దాలుగా అనుకుంటున్నా ఆచరణలో అమలు కావడం లేదు. ఈ కారణంగా హత్యలు, హత్యాయత్నాల వంటి కేసుల్లో నిందితులు సాక్షులను ప్రలోభపెట్టడం, లేదా తమకు అనుకూలంగా మలచుకుని కోర్టులకు రాకుండా చేయడం, ఒకవేళ వచ్చినా సాక్ష్యం చెప్పకుండా చేసి కేసుల నుంచి సులభంగా తప్పించుకుంటున్నారని న్యాయ నిపుణులతోపాటు సీనియర్ న్యాయవాదులు అంటున్నారు. ఈ విషయంలో పోలీసు విభాగం ఇకనైనా దృష్టి సారించాల్సిన అవ సరం వుందనడంలో ఎలాంటి సందేహం లేదు. హత్యలు, హత్యాయత్నా లకు పాల్పడిన వారికి కర్ణాటకతో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లో వున్నట్లుగా ఏడాది న్నర నుంచి రెండేళ్ల పాటు బెయిలు రాకుండా చూసేలా చట్టాలను మార్చాలని, ఈ వ్యవధిలోనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తిచేసి నింది తులకు జీవితఖైదు శిక్షలు పడేలా చేయడం ద్వారా హత్యలు, హత్యాయత్నాల వంటి తీవ్రమైన నేరాలకు ఫుల్ స్టాప్ పెట్టవచ్చని న్యాయ నిపుణులు అంటున్నారు. •

# వరుస హత్యల కలకలం

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

రాష్ట్రంలో వరుస బహిరంగ హత్యలు, కిరాతక హత్యలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. చట్టం అంటే భయం లేదు. పోలీసులంటే లెక్కలేదు. చిన్నపాటి తగాదాలు, భూ వివాదాలతో ప్రత్యర్థులను దారుణంగా అంతమొందించే విషసంస్కృతి వేళ్లూనుకోవడం అన్నివర్గాలను షాక్‌కు గురి చేస్తోంది. ఇదే సమయంలో తమ వారిని చిన్నపాటి కారణాలతో దారుణంగా చంపుతున్న వ్యక్తుల దారుణ ఘటనలు సైతం రాష్ట్రవ్యాప్తంగా పెరిగిపోతున్నాయి. హత్యల తరువాత తాపీగా పోలీసులకు లొంగిపోతున్న నిందితుల్లో కొందరు ఆ తరువాత కోర్టుల నుంచి బెయిలు పొందుతూ ఆనక దర్జాగా మళ్లీ నేరప్రవృత్తిలో కొనసాగుతున్నారు. వరుసహత్యల్లో కొన్ని సుపారీ హత్యలు కూడా వుండడం గమనార్హం. హత్యలతో పాటు హత్యాయత్నం వంటి తీ వ్రమైన కేసుల్లో నిందితులకు సులభంగా బెయిలు లభిస్తుండడం ఒక ఎత్తయితే చాలా కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు వేయించడంలో పోలీసులు విఫలమవుతుండడం కూడా ఈ తరహా నేరాల పెరుగుదలకు దోహదం చేస్తుందని నిపుణులు అంటున్నారు. కొన్ని సందర్భాలలో హత్యల తరువాత నిందితులు రొమ్ము విరుస్తూ చేతులు పైకెత్తి మేమే గెలిచాం..హాహా...ఓహో... అంటూ మీడియా, పోలీసుల సమక్షంలో నినాదాలు చేయడం పైశాచిక ప్రవృత్తికి నిదర్శనంగా చెప్పాలి. రాష్ట్రంలో గత ఏడాది 856 హత్యలు జరిగినట్లు పోలీసు గణాంకాలు చెబుతుండగా ఇందులో హత్యలతో కూడిన బందిపోటు దోపిడీల సంఖ్య 83వున్నాయి. 2023లో 789 హత్యలు జరగగా బందిపోటు దోపిడీల సంఖ్య 59వున్నాయి.మొత్తం హత్యలలో 200వరకు జంట నగరాలు శివారు ప్రాంతాలలోనే జరుగుతున్నాయి.కాగా రాష్ట్రంలో జరుగుతున్న హత్యల్లో కీలకమైన కేసులు కొన్నింటిని మినహాయించి మెజారిటీ కేసుల్లో దోషులకు శిక్షలు పడడం లేదనే వాదన వుంది. నిపుణులు చెబుతున్న దానిప్రకారం 80 శాతం వరకు కేసులు కోర్టుల్లో నిలవడం లేదంటే పోలీసుల దర్యాప్తు ఎంత అపసవ్యంగా వుందో ఊహించుకోవచ్చు. ఒకప్పుడు ఒకచోట హత్య జరిగిందంటే పోలీసులు తీవ్రంగా వ్యవహరించే వారు. కానీ నేడు హత్యలు సాధారణ నేరాలను మించిపోయాయంటే అతిశయోక్తి కాదు. ఒక మనిషిని కొందరు కలిసి చంపడం నీచంగా చెప్పాలి. ఈతరహా నేరాలకు పాల్పడే వారిని పోలీసులు అరెస్టు చేస్తున్నా నిందితులను పొరుగు రాష్ట్రాలలో ముఖ్యంగా కర్ణాటకసహా పలు రాష్ట్రాల్లో వున్నట్లుగా కనీసం ఏడాది నుంచి ఏడాదిన్నర పాటు జైల్లో నిర్బంధించలేకపోవడం ఇక్కడి పోలీసు వైఫల్యంగా నిపుణులు చెబుతున్నారు. ఒక రకంగా ఇదిచట్టాలలో వున్న లోపాలుగా వారంటున్నారు.



దీని కారణంగా హత్యలకు పాల్పడుతున్న నిందితులు రెండు నుంచి మూడు నెలల వ్యవధిలోనే బెయిలుపై విడుదలవుతున్నారు. కొన్నిసార్లు నెలన్నరలోపే విడుదలవుతున్న ఉదంతాలు కూడా వున్నాయి. ఇక హత్యలవంటి తీవ్రమైన కేసుల్లో నిందితులపై మోపుతున్న అభియోగాలు కోర్టుల్లో చాలా సందర్భాలలో నిలబడడంలేదు. ఈ కారణంగా నిందితులు నిర్దోషులుగా విడుదలవుతుండడం పోలీసు శాఖకు పెద్ద వెలితిగా మారింది. సరిగ్గా ఈ అంశాలే హత్యలకు బరితెగిస్తున్న వ్యక్తులకు ఊతంగా మారుతుందనే విమర్శలు వున్నాయి. ఇది ముమ్మాటికి నిజమని నిపుణులుంటున్నారు. హత్యలకు పాల్పడ్డ వారిపై కొంతకాలం పోలీసులు నిఘా వుంచి ఆ తరువాత తమ పనుల్లో బిజీగా వుండడంవల్ల వీరి గురించి మరచిపోతున్నారు. హత్యకేసులతోపాటు హత్యకు ప్రయత్నించిన కేసుల్లో నిందితులుగా వున్న వారిపై పోలీసులు వెంటనే రౌడీషీట్ తెరుస్తూ వారంతా కొన్ని రోజుల పాటు ప్రతి రోజు, మూడు నెలల తరువాత వారానికి ఒకసారి, చివరగా ఇంకొంత కాలం తరువాత నెలకోసారి పోలీసు స్టేషన్లకు వచ్చి తమ వివరాలు ఇవ్వాల్సి వుంది. అయితే చాలాచోట్ల ఈ ప్రక్రియ సవ్యంగా అమలవడం లేదనే ఆరోపణలున్నాయి. నిందితుల తరపున కొందరు బడా నేతలు పోలీసులకు నజరానాలు ఇస్తూ హత్య కేసుల్లో నిందితులు స్టేషన్లకు రాకుండా చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా హత్యలు, హత్యాయత్నం కేసుల్లో నిందితులుగా వున్న వారు బడానేతలతో కలిసి పోలీసులకు ఆమ్యామ్యాలు ఇస్తూ దర్జాగా తిరుగుతూ మళ్లీమళ్లీ నేరాలు చేస్తున్నారనే అభియోగాలు కూడా వున్నాయి. ఇక చాలాకేసులు కోర్టులో వీగిపోవడానికి పోలీసుల విచారణ సరిగ్గా సాగడం లేదనే ఆరోపణలువునా ్న అసలు విషయం మాత్రం కోర్టుల్లో దాఖలు చేస్తున ్న ఛార్జిషీట్లు సవ్యంగా వుండడం లేదని న్యాయ నిపు ణులు అంటున్నారు. హత్యలు, హత్యాయత్నం కేసుల్లో నింది తులుగా వున్నవారిపై పోలీసులు కోర్టులకు సమర్పించే ఛార్జ్ షీట్లు చాలావరకు సరిగ్గా వుండడంవల్ల నిందితులు అతి సుల భంగా తప్పించుకుంటున్నారని హైకోర్టు సీనియర్ న్యాయవా దులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇటీవల వెలుగు చూసిన సంచలన హత్యల విషయానికి వస్తే భూపాలపల్లిలో మేడిగట్ట ప్రాజెక్టు సవ్యంగాలేదని మొదటగా పిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తిని ప్రత్యర్థులు నడిరోడ్డుపై కిరాతకం గా కత్తులతో పొడిచి హత్యచేశారు. భూ వివాదం కారణంగా ఈ హత్య జరిగినట్లు చెబుతున్నా దీని వెనుక రాజకీయ కార ణాలున్నాయని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ హత్యకు సంబంధించిన కేసువిచారణను సిఐడికి అప్పగించా రు. అంతకు ముందు మేడ్చల్‌లో ఉమేష్ అనే వ్యక్తిని అతని సోదరులే నడి రోడ్డుపై వెంటాడి కత్తులతో పొడిచి, గొడ్డలితో నరికి చంపారు. కుటుంబ కలహాల వల్ల ఈ హత్య జరిగినట్లు తేలింది. హత్య తరువాత నిందితులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. శనివారం పట్టపగలు కుషాయిగూడలో ఒక యువకుడు ఆస్తి వివాదం కారణంతో తండ్రిని నడిరోడ్డుపై కత్తితో పొడిచి చంపాడు. ఈ మూడు హత్యలకు ముందు శివార్లలోని మీర్‌పేట్‌లో గురుమూర్తి అనే మాజీ సైనికుడు తన భార్యను కిరాతకంగా హత్యచేసి శవాన్ని ఇంట్లోనే ముక్కలు చేసి, వాటిని వేడినీళ్లలో వుంచి, గ్యాస్ స్టౌవ్‌పై మాడిపోయాలచేసి, ఆనక మాంసం ముద్దలు పౌడర్‌గా మారాక సమీపంలోని చెరువులో పడవేసిన వైనం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. అంతకు ముందు మీర్‌పేట్‌లోనే రెండు కిరాతక హత్యలు జరిగాయి. మూడేళ్లక్రితం నిజామాబాద్‌లో న్యాయ వాద వృత్తిలో వున్న దంపతులను ప్రత్యర్థులు దారికాచిహత్య చేయడం సంచలనం రేపింది. ఇటీవల కాలంలో రాష్ట్రంలో మరికొన్ని హత్యలు ఈ తరహాలోనే జరగడం గమనార్హం. ఇది లావుం డగా హత్యలతోపాటు హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడాలంటే సాక్షులు కోర్టులో సాక్ష్యం చెపా ్పల్సి వుంటుంది. నిందితులకు శిక్షలు పడాలంటే ఇది ఎంతో ముఖ్యం. అనేక దేశాల్లో సాక్షులను కాపాడుకునే వ్యవస్థ వుంది. ఈవ్యవస్థను విట్‌నెస్ ప్రొటెక్షన్ సిస్టం అని పిలుస్తుంటారు. ఈ వ్యవస్థ పటిష్టంగా వుండేందుకు ఆయా దేశాల్లో ప్రత్యే కంగా నిధులు కేటాయిస్తుంటారు. అవసరమైతే సాక్షులకు పోలీసు విభాగాలు తాముండే సురక్షిత ప్రాంతాలలోనే వుండే వీలు కల్పించడంతో పాటు ఇదే ప్రాంతంలో ఉద్యోగాలు కూడా ఇస్తారు. ఈ తరహా వ్యవస్థను ఇండియాలోనూ ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ దశాబ్దాలుగా అనుకుంటున్నా ఆచరణలో అమలు కావడం లేదు. ఈ కారణంగా హత్యలు, హత్యాయత్నాల వంటి కేసుల్లో నిందితులు సాక్షులను ప్రలోభపెట్టడం, లేదా తమకు అ నుకూలంగా మలచుకుని కోర్టులకు రాకుండా చేయడం, ఒకవేళ వచ్చినా సాక్ష్యం చెప్పకుండా చేసి కేసుల నుంచి సులభంగా తప్పించుకుం టున్నారని న్యాయ నిపుణుల తో పాటు సీనియర్ న్యాయవాదులు అంటున్నారు. ఈ విషయంలో పోలీసు విభాగం ఇక నైనా దృష్టి సారించాల్సిన అవసరం వుందనడంలో ఎలాంటి సందేహం లేదు. హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడిన వారికి కర్ణాటకతోపాటు పలు ఉత్తరాదిరాష్ట్రాల్లో వున్నట్లుగా ఏడా దిన్నర నుంచి రెండేళ్ల పాటు బెయిలు రాకుండా చూసేలా చట్టాలను మార్చాలని, ఈ వ్యవధిలోనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తిచేసి నింది తులకు జీవితఖైదు శిక్షలు పడేలా చేయడం ద్వారా హత్యలు, హత్యాయత్నాల వంటి తీవ్రమైన నేరాలకు ఫుల్‌స్టాప్ పెట్టవచ్చని న్యాయనిపుణులు అంటున్నారు. •

శాస్త్ర

కర్ణాటక

# గెలిచినట్లేనా?

**ఎ.వి.వి ప్రసాద్**

నేరం చేయకపోవడం వేరు,నేరం చేశాడనే అభియోగానికి సాక్ష్యాధారాలు లేకపోవడం వేరు. కానీ కోర్టునుంచి ఈ రెండింటికి 'క్లీన్‌చిట్' అనేపదాన్నే ఉపయోగిస్తారు.'ముడా' కుంభకోణంలో చిక్కుకొన్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య,ఆయన భార్య పార్వతి,కొందరు సమీపబంధువులకు అలాంటి 'క్లీన్‌చిట్' లభించడంతో ఆ కుంభకోణం నుంచి ముఖ్యమంత్రి బయటపడినట్లే అనే ప్రచారమే జరుగుతోంది.ఆరోపణలన్నీ తప్పనీ, కుంభకోణంతో సిద్ధరామయ్యకుగానీ, ఆయన భార్యకు గానీ ఎలాంటి సంబంధంలేదనీ ఆయన అనుచరులు, కాంగ్రెస్ నేతలు పుంఖానుపుంఖాలుగా ప్రకటనలు చేస్తున్నారు. గత బుధవారం (19, ఫిబ్రవరి) లోకాయుక్త పోలీసులు ఇచ్చిన నివేదిక తర్వాత సిద్ధరామయ్య అనుచరులు సంబరాలు కూడా ప్రారంభించారు. అయితే సిద్ధరామయ్య గండంనుంచి గట్టెక్కినట్లేనా? అన్నది పెద్ద ధర్మ సందేహం. సామాజిక కార్యకర్త 'స్నేహమయి' కృష్ణ గతసంవత్సరం 'ముడా' కుంభకోణం గురించి చాలా అంశాలు బహిర్గతం చేస్తూ సిద్ధరామయ్య, ఆయన భార్య ఏ మేరకు అక్రమంగా ప్లాట్లు తమవశం చేసుకొన్నారో వివరించారు. అప్పటి నుంచి కర్ణాటకలో మొదలైన రాజకీయ తుఫాన్ చివరికి ముఖ్యమంత్రి పదవికే ఎసరు పెట్టేలా మారింది.అదే అదనుగాఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ పావులు కదపడం ఆరంభించారనీ, సిద్ధూ రాజీనామా తప్పదనీ వార్తలు వ్యాపించాయి. ఈ వేడి మరింత అధికమవుతున్న దశలో లోకాయుక్త నివేదిక విడుదల కావడం ముఖ్యమంత్రి,ఆయన కుటుంబ సభ్యులకుఊరట కలిగించినా,రాజకీయవర్గాలలో మాత్రంఅలజడిని రేపుతూనే ఉంది. దానికి ప్రధాన కారణం లోకాయుక్త నివేదికలో సిద్ధూకి వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలకు ఎలాంటి సాక్ష్యాధారాలు లభించలేదని చెప్పడమే. 'మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' నుంచి కోట్లాది రూపాయల విలువైన భూములను తనభార్య పార్వతికిలభించేలాముఖ్యమంత్రి కుట్రచేశారంటూ సమాచారహక్కు చట్టం కింద సామాజిక కార్యకర్తలు టిజె అబ్రహాం,ఎస్పీ ప్రదీప్, స్నేహమయి కృష్ణ గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈకేసుపై సమగ్రదర్యాప్తు జరిపించాలని కూడా వారు కోరారు. గవర్నర్ వెంటనే అనుమతి ఇవ్వటంతో దానిపై విచారణ మొదలయింది. ఆ తర్వాత కేసు అనేక మలుపులు తిరిగిందికూడా.ఈ కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్యతోపాటు బామమరిది మల్లికార్జున స్వామితోపాటు భూ యజమాని దేవరాజు కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గవర్నర్ తవర్ చంద్ గెహ్లాట్ తక్షణమే విచారణకు అనుమతించడం కూడా గతంలో సంచలనం కలిగించింది.



సిద్దరామయ్య

ముఖ్యమంత్రి వంటి కీలక నేతపై వచ్చిన ఆరోపణలపై విచారణకు అనుమతి వ్వాలంటే కొంత 'ప్రాసెస్' జరగవలసిఉంటుంది. ఈలోగా సిఎం టెర్మ్ పూర్త య్యే అవకాశం కూడా ఉంటుంది.కానీ ప్రభుత్వం కాంగ్రెస్‌ది కావడం వల్లనే గవర్నర్ అనుమతి వెంటనే లభించి ఉండవచ్చని కూడా రాజకీయవర్గాలలో భావించారు. ముఖ్యమంత్రి సతీమణి పార్వతికి మైసూరులోని కేసరే గ్రామంలో మూడెకరాల భూమి ఉంది. దానిని ఆమెకు సోదరుడు మల్లికార్జున్ 'బహుమతి'గా ఇచ్చారు. ఆ స్థలాన్నిఅభివృద్ధి చేయడానికి 'ముడా'తీసుకొంది. ఆ భూమిని స్వాధీనంచేసుకొన్నందుకు పరిహారంగా దక్షిణ మైసూరులోని విజయనగర్‌లో 38,238 చదరపు అడుగుల ప్లాట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇదంతా2021లో జరిగింది. విజయనగర్‌లో కేటాయించిన ప్లాట్లు చాలా 'పోష్'కావడంతో ఆ కేటాయింపు వల్ల ప్రభుత్వానికి 45 కోట్ల వరకు నష్టం వచ్చినట్లుగా సమాచారం. సిద్ధరామయ్య కుమారుడు ఎస్.యతీంద్ర, పలువురు 'ముడా' అధికారులకు కూడా ఈకుంభకోణంతోసంబంధం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో వారందరిని ఈ కేసులో చేర్చడంతో అతిపెద్ద కుంభకోణంగా మారింది.గతంలో అప్పటి ముఖ్యమంత్రియెడ్యూరప్పపై కూడా ఇటువంటి ఆరోపణలే రావడంతో ఆ కేసు విచారణ కూడా అప్పటి గవర్నర్ అనుమతి మంజూరు చేశారు. 2011 అక్టోబర్‌లోయెడ్యూరప్పను అరెస్టు చేశారు కూడా. దానితో ఆయన సిఎం పదవికి రాజీనామా చేసి23రోజులు జైలు శిక్ష కూడా అనుభవించారు. సిద్ధరామయ్య కేసులో ఇడికూడా చర్యలు చేపట్టింది. భూకుంభకోణం ఆరోపణలపై మనీలాండరింగ్ కేసు కూడా నమోదుచేసింది. దానితో రకరకాల కేసులు మెడకు చుట్టుకోవడంచూసి తనకు 'ముడా' కేటాయించిన 14 ప్లాట్లను తిరిగి ఇచ్చివేస్తున్నట్లుగా పార్వతి ప్రకటించారు. ఆమేరకు 'ముడా' కమిషనర్‌కు ఓ లేఖపంపించారు.గవర్నర్ అనుమతిని కర్ణాటక హైకోర్టు సమర్థించడమేగాక లోకాయుక్త విచారణకు కూడా ఆదేశించింది. అయితే లోకాయుక్త విచారణ అనగానే కేసులో నిజానిజాలు బయటకు వస్తాయా? అనే సందేహం కూడా అందరిలో కలిగింది.లోకాయుక్త నుంచివచ్చే తీర్పులపై గతంలో చాలామంది అనుమానాలు వ్యక్తం చేసిన ఉదాహరణలు అనేకం.అధికార నేతల నుంచి ప్రయోజనాలు ఉంటాయనీ, అందువల్లనే లోకాయుక్త నుంచి నిష్పాక్షికమైన విచారణ జరగదనీ గతం లో ఆరోపణలు వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు సిద్ధరామయ్య విషయంలో లోకాయుక్త ఇచ్చిన 'క్లీన్‌చిట్' నివేదిక విషయంలో కూడా అవే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపి, ఎమ్మెల్యేల స్పెషల్ కోర్టుకు లోకాయుక్త నివేదిక సమర్పించడంతో ఒక అంశం పూర్తయింది కానీ తుది తీర్పు ఇంకా వెలువడవలసి ఉంది. ఈ కేసులోని ఆరోపణలకు తగిన సాక్ష్యాధారాలు లేవని మాత్రమే లోకాయుక్త చెప్పింది కానీ సిద్ధరామయ్య 'నిర్దోషి'గా ప్రకటించలేదు గనుక దీనిపై తాము తిరిగి అప్పీలు చేస్తున్నామని కృష్ణ అంటున్నారు. అంటే కేసుకు ఇంకా తెరపడలేదనే అనుకోవాలి.కోర్టు ఎటువంటి తీర్పు చెబుతుందనే అంశంపై సిద్ధరామయ్య భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఈలోగా అన్ని సంబరాలెందుకో ఆయన అభిమానులు ఆలోచించుకోవాలి. ఈ నెలాఖరులో బహుశా కోర్టు తీర్పు వెలువడే అవకాశాలున్నాయంటున్నారు. •

ఘటన

ద.కొరియా

# కటకటాల్లో కొరియానేత!

**గన్ని మోహన్**

పారిశ్రామికంగా సుసంపన్న దేశంగా భాసిల్లుతున్న దక్షిణ కొరియా రాజకీయ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. దేశఅధ్యక్షుడు పదవీచ్యుతిపొంది అరెస్టు అయి జైలుకు పోగా విచారణకు హాజరయ్యేందుకు సియోల్ వీధుల్లో జైలుగార్డుల భారీ భద్రతమధ్య కోర్టులకు వెళుతున్నాడు. ఈ వారాంతంలోనే ఆయన రెండు కేసుల్లో కోర్టుకు హాజరయ్యాడు. దక్షిణకొరియా ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రకటించారని ఒకటి, తనను అధ్యక్ష పదవినుంచి దించి వేసేందుకు కుట్రలు జరిగాయని విచారణల్లో సహకరించకపోగా తిరుగుబాటు చేసారని మరో అభియోగం ఆయనపై ఉన్నాయి. దక్షిణకొరియా చరిత్రలో పదవిలో ఉన్న అధ్యక్షుడు అరెస్టు కావడం ఇదే మొదటిసారి. రెండింటిలో ఒకటి శిక్షార్హమైన నేరంకాగా మరోటి పదవీచ్యుతి. ఈ రెండూ కూడా గత ఏడాది డిసెంబరులో స్వల్ప కాలంపాటు ఆయన విధించిన మార్షల్ లా వల్లనే అన్నది తెలిసిందే. సియోల్ సెంట్రల్ జిల్లాకోర్టుకు భారీ భద్రత నడుమ ఆయన విచారణకు హాజరయ్యారు. కోర్టులో ముందు సాక్షుల వాంగ్మూలాలు, అనంతరం యూన్‌పై క్రిమినల్ విచారణ వంటి వాటిని నిర్ధారిస్తారు. మరోకేసులో ప్రాథమిక విచారణను మార్చికి వాయిదావేసారు. తమ క్లయింట్ యూన్‌ను ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేసారని, వెంటనే ఆయన అరెస్టును రద్దుచేసి ఆయన్ను కస్టడీ నుంచి విడుదల చేయాలని వాదించారు. నేషనల్ అసెంబ్లీ ఇప్పటికే ఆయన్ను గద్దెదించింది. ప్రధాని హాన్‌డక్‌సూ ఒక సాక్షిగా కోర్టుహాలులోకి రావడంతో యూన్ అక్కడినుంచి పక్కకు వెళ్లిపోవడం వంటి సంఘటనలుచూస్తే ఆయన సొంతపార్టీలోనే ఆయనకు అసమ్మతి సెగలు పెరిగిపోయాయయని తెలుస్తోంది. అధ్యక్షుడు, ప్రధాని ఒకేసారి కోర్టుహాలులో కనిపిస్తే దేశ ప్రజలకు తప్పుడు సంకేతాలు వెలువడతాయని అందువల్లనే వేరువేరుగా విచారణ చేయాలన్న ప్రతిపాదనతో ప్రధానిని కోర్టుహాలులో ఉంచి యూన్‌ను తాత్కాలికంగా బయటకు పంపించారు. మార్షల్‌లాను ప్రకటించేముందు కేబినెట్ సమావేశం ఏర్పాటుచేసి నిర్ణయాలనుచర్చించాల్సి ఉండగా యూన్ ఆవిషయంలో పూర్తిగా విఫలం అయ్యారని ప్రధాని హ్యాన్‌డక్ వాదించారు. మార్షల్‌లా పరంగాయూన్ రాజ్యాంగ నిబంధనలు సైతంఉల్లంఘించారని ఆయన ఆరోపించారు. కేబినెట్‌లో ఏఒక్క సభ్యుడు కూడా యూన్ మార్షల్‌లా ప్రకటనకు మద్దతివ్వలేదని అటువంటి పరిస్థితుల్లో మార్షల్‌లా ఎలా విధిస్తారని ఆయన కోర్టుకు నివేదించారు. ఉత్తరకొరియాకు సన్నిహితంగా మెలుగుతున్నారని, దేశద్రోహ చర్యలకు పాల్పడుతుండటంవల్లనే దేశాన్ని రక్షించడంకోసం



యూన్‌సుక్ ఇయోల్


తాను మార్షల్‌లా విధించాల్సి వచ్చిందని యూన్ సుక్ ఇయోల్ చెప్పిన సంగతి తెలిసిందే. తీవ్ర స్థాయిలో వ్యతిరేకత రావడంతో వెనువెంటనే ఆయన మార్షల్‌లా విరమించుకున్నారు. అయితే పాలనలో యూన్ విఫలం అయ్యారంటూ ఆయన తక్షణమే గద్దెదిగిపోవాలని చట్టసభలో సభ్యులంతా ఏకమై తీర్మానం ప్రతిపాదించారు. యూన్‌కు వ్యతిరేకంగా ప్రధాని, నిఘా ఏజెన్సీడిప్యూటి డైరెక్టర్లు కూడా తమ వాదనలు వినిపించారు. కీలకమైన రాజకీయ నాయకులందరినీ అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారని వారిలో స్పీకర్ వూవాన్‌షిక్‌తో పాటు ప్రతిపక్షనేత లీ.జాయ్ మ్యుంగ్ వంటి వారున్నట్లు ధర్మాసనం ముందు వివరించారు. గతనెల 26వ తేదీనే తిరుగుబాటు అభియోగాలపైయూన్‌ను అరెస్టు చేయాలని నిర్ణయించారు. ఈ అభియోగాలు రుజువైతే జీవితాంతం జైలు లేదా మరణ శిక్షకూడా విధించే అవకాశాలున్నాయి. దక్షిణ కొరియాలో అధ్యక్షులకు ఇలాంటి శిక్షలనుంచి కొంతమేర ఉపశమనం లభిస్తుంది. అయితే దేశద్రోహం,తిరుగుబాటు వంటి నేరాలపై మాత్రం ఎలాంటిమినహాయింపులు రావు. దేశంలో మార్షల్‌లా విధించడం అక్రమమని జాతీయ అసెంబ్లీని రద్దుచేసి రాజకీయ నాయకులు, ఎన్నికల అధికారులు అందరినీ అరెస్టులు చేయాలని భావించడం నియంతృత్వానికి దారితీస్తుందని ప్రభుత్వంలోని ఇతర పెద్దలందరూ కూడా ధర్మాసనం ముందు తమతమ వాంగ్మూలాలను ఇచ్చారు. వీటన్నింటినుంచి దేశాన్ని రక్షించేందుకే యూన్‌ను అధ్యక్ష అధికారాలను రద్దుచేసి ఆయన్ను పదవవీచ్యుతి చేయాల్సివచ్చిందని జాతీయ అసెంబ్లీ ప్రతినిధులు కూడా స్పష్టంగా చెప్పారు. ఇప్పుడు రాజ్యాంగ ధర్మాసనం ముందే యూన్ తన భవిష్యత్తును పరీక్షించుకోవాల్సి వస్తోంది. మార్షల్‌లాను కేవలం ఆరుగంటల్లోనే యూన్ ఎత్తివేసారు. దేశంలో రాజకీయ దుమారం పెద్ద ఎత్తున ఎగిసిపడటంతో తన నిర్ణయం నుంచి యూన్ వెనక్కితగ్గారు. యూన్‌కు మద్దతిస్తున్న కన్సర్వేటివ్‌లు, యూన్‌తరపు న్యాయవాదులు జిల్లాకోర్టు పరిధిని అతిక్రమించిందంటూ వాదించారు. అయినా కూడా యూన్‌ను అరెస్టు చేయాల్సిందేనన్న రూలింగ్‌తో ఇప్పుడు ఇటు జైళ్లలోను అటు కోర్టుల చుట్టూ యూన్‌సుక్ ఇయోల్ న్యాయం కోసం వెంపర్లాడాల్సి వచ్చింది.ఆయన అనాలోచిత నిర్ణయాలే ఆయనకు ఈ పరిస్థితిని తెచ్చిపెట్టాయని కన్సర్వేటివ్‌లు కూడా భావిస్తున్నారు.తిరుగుబాటు ఆరోపణలపైనే యూన్‌తో పాటు ఆనాడు రక్షణమంత్రిపోలీస్ చీఫ్, అనేక మంది మిలిటరీ కమాండర్లను కూడా అరెస్టుచేసారు. ఇప్పుడు శిక్షార్హమైన కేసులనుంచి బయటపడటం కంటే దక్షిణకొరియా అధ్యక్షుడికి రాజ్యాంగ ధర్మాసనం ముందు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన అనివార్య పరిస్థితులు అలుముకున్నాయి. తన భవిష్యత్తుకాలమే నిర్ణయిస్తుందన్న ధైర్యంతో ఉన్న యూన్‌కు రాను రాను మద్దతు కూడా తగ్గుతుండటంతో కీలకమైన ఈ రెండు కేసులనుంచి బయటపడటం సాధ్యంకానిపనేఅని ఆయన సన్నిహితులు కూడా చేస్తున్న వాదనల్లో వాస్తవం లేకపోలేదు.మొత్తంగా చూస్తేయూన్‌సుక్ ఇయోల్ తొందరపాటు నిర్ణయాలే ఆయన భవిష్యత్తుకు గండికొట్టాయని చెప్పాల్సి ఉంది.ఇప్పుడు భారం అంతా కోర్టులపైనే వేసి న్యాయం కోసం యూన్ కాలక్షేపం చేయకపత్పదు. •

# డీ లిమిటేషన్ దక్షిణాదికి శాపమా?



సుంకవల్లి సత్తిరాజు

మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి నియోజకవర్గాల డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్ల బిల్లు అమలు, జమిలీ ఎన్నికలు కీలకాంశాలుగా మారబోతున్నాయి. లోక్‌సభలో బిజెపికి తగినంత మెజారిటీ లేని దృష్ట్యా జమిలీ ఎన్నికలు జరుగుతాయా? లేదా? అనే సంశయం నెలకొంది. మహిళల రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే ఆమోదం పొందిన దృష్ట్యా, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరగవచ్చు. జనగణన జరిగి, నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాత మాత్రమే చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. ఈ సంవత్సరం జనగణన జరగవచ్చనే సూచనలు కనిపిస్తున్నా యి. ఏకారణంచేతనైనా జనగణన చేపట్టకపోతే లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు సంబంధించి నియోజకవర్గాల పునర్వి భజన కూడా వాయిదా పడుతుందని చెప్పవచ్చు. ప్రస్తుతం వెలువడుతున్న కథనాల ప్రకారం ఈ ఏడాది జనగణన జరుగుతుందని, వచ్చేఏడాది డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభం కావచ్చనే సమాచారముంది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల ప్రక్రియకు విశేషమైన ప్రాధాన్యత ఉంది. 1950జనవరి 25వ తేదీన ఏర్పడిన స్వయం ప్రతిపత్తి గల ఎన్నికల కమీషన్ ఎన్నికల వ్యవస్థలో అనేక మార్పులను ప్రవేశపెట్టింది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభలకు సీట్ల సంఖ్యను నిర్ణయించడానికి రాష్ట్రపతి ఉత్తర్వులతో కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమీషన్‌ను ఏర్పాటు చేస్తుంది. 1971లో జరిగిన జనగణన ఆధారంగా డీలిమిటేషన్ కమీషన్ లోక్‌సభ స్థానాలను నిర్ణయించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతున్నాయి. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించే హక్కు ఎవరికీ ఉండదు. డీలిమిటేషన్ కమిటీ నిర్ణయాలను లోక్‌సభ, శాసనసభలకు తెలియ చేస్తారు. ఈ నిర్ణయాలపై న్యాయస్థానాలకు వెళ్లే అధికారం ఉండదు. 1952, 1963, 1973, 2002వ సంవత్సరాల్లో నాలుగు పర్యాయాలు జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల సీట్ల సంఖ్యను పెంచడానికి డీ లిమిటేషన్ కమిటీలు ఏర్పడ్డాయి. భారతరాజ్యాంగం 1950 లో అమల్లోకి వచ్చింది. 1951-52 సంవత్సరాల మధ్య సుమారు నాలుగు నెలలపాటు మొదటి లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పటి దేశ జనాభా సుమారు 36కోట్లు. 499లోక్‌సభ సీట్లకుగాను 489 సీట్లకు అప్పట్లో ఎన్నికలు జరిగాయి. అప్పటి ఓటర్ల సంఖ్య సుమారు 17 కోట్లు. 1952 ఏప్రిల్ 17న మొదటి లోక్‌సభ ఏర్పడింది. ప్రస్తుత పార్లమెంటు దిగువ సభలోగల 543 మంది సభ్యులు 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడ్డారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి లోక్‌సభ,రాష్ట్ర శాసన సభల్లో ఆంగ్లో ఇండియన్‌లకు రిజర్వేషన్లు ఇవ్వబడ్డాయి. కేవలం పది సంవత్సరాలపాటు ఈ రిజర్వేషన్ల ఉనికి అమల్లోఉండాలి. అయితే రాజ్యాంగసవరణల ద్వారా2020 వరకు ఆంగ్లో ఇండియన్ల రిజర్వేషన్లు కొనసాగాయి. చట్ట సవరణ ద్వారా 2020లో ఈ రిజర్వేషన్లను రద్దు చేసారు. దేశంలో ప్రతీ పది సంవత్సరాల కొకసారి జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. 2011 వ సంవత్సరంలో దేశంలో జనగణన జరిగింది. 2021లో జరగవలసిన జనగణన కోవిడ్ కారణంగా వాయిదాపడింది. ఈ ఏడాది జనగణన జరిగే అవకాశాలున్నాయి. జనగణన ప్రక్రియ సుమారు సంవత్సరం పాటు కొనసాగుతుంది. 2026లో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో సీట్లసంఖ్య పెంచడానికి డీ లిమిటేషన్ కమీషన్ ఏర్పాటు చేయబడుతుందని తెలుస్తున్నది. అనధికార అంచనాల ప్రకారం ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్లసంఖ్య మరో 300వరకు పెరగవచ్చనే అంచనా ఉంది. డీ లిమిటేషన్ జరిగితే కొన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గుతుందనే అభ్యంతరాలతో అప్పట్లో ఇందిరా గాంధీ,వాజ్‌పేయ్ ప్రభుత్వాలు డీలిమిటేషన్ ప్రక్రియకు విరామం ప్రక




టించాయి.రాష్ట్రాల జనాభా నియంత్రణ కార్యక్రమాల ప్రభావం చట్టసభల సీట్ల సంఖ్యపై పడకూడదన్న ఉద్దేశ్యంతో జనాభా పెరిగినా, ఓటర్ల సంఖ్య పెరుగుతున్నా,నియోజకవర్గాల సంఖ్యను పెంచకుండానే ఎన్నికలు జరుపుతున్నారు. రాష్ట్రాల జనాభా నియంత్రణ కార్యక్రమాల ప్రభావం చట్టసభల సీట్ల సంఖ్యపై ప్రభావం చూపకూడదన్న ఉద్దేశ్యంతో జనాభా పెరిగినా, ఓటర్ల సంఖ్య పెరుగుతున్నా, నియోజకవర్గాలసంఖ్యను పెంచకుండానే ఎన్నికలు జరుపుతున్నారు. అయితే ఈసంవత్సరం జనగణన ప్రారంభమైతే, 2026లో డీలిమిటేషన్ కమీషన్ ఏర్పాటుచేసే అవకాశముంది. జనాభా ప్రాతిపదికన ప్రస్తుతమున్న 543లోక్‌సభ సీట్ల సంఖ్య753 నుండి 848 వరకు పెరగవచ్చునని ఒక ప్రచారం వ్యాప్తిలో ఉంది. 2023, 2024 అనధికారిక అంచనాల ప్రకారం వివిధ రాష్ట్రాల నుండి పెరిగే లోక్‌సభ సీట్ల సంఖ్య ఎలా ఉండబోతుందో స్థూలంగా ఒక నిర్ధారణకు రావచ్చు. జనగణన జరిగే వరకు లోక్‌సభలో ఏఏ రాష్ట్రాలకు ఎన్ని సీట్లు పెరుగుతాయే ఖచ్చితంగా ఒక నిర్ధారణకు రాలేము. కొన్ని అంచనాల ప్రకారందేశంలో అతి పెద్దరాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్లసంఖ్య 80నుండి 128కి, బీహార్‌లో 40నుండి 70వరకు, రాజస్థాన్‌లో 25నుండి 44 వరకు, మహారాష్ట్రలో 48నుండి 68వరకు, మధ్యప్రదేశ్‌లో 29నుండి 47వరకు లోక్‌సభ సీట్లసంఖ్య పెరగవచ్చుననే అంచనా ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కేవలం మూడుచొప్పున లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, తమిళనాడులో రెండు సీట్లు పెరుగుతాయని, కర్ణాటకలో28నుండి 36కు పెరగవచ్చు.కేరళలో ప్రస్తుతమున్న లోక్‌సభ స్థానాల సంఖ్య 20నుంచి19కి పడిపోయే అవకాశముంది. 2026 నాటికి జనగణన పూర్తయి,ప్రస్తుతమున్న 543 లోక్‌సభ సీట్లను అలాగే ఉంచి, జనాభా ప్రాతిపదికన లోక్‌సభలో సీట్లను కేటాయిస్తే యు.పిలో 11 సీట్లు,బీహార్‌లో 10, మధ్యప్రదేశ్‌లో 4,రాజస్థాన్‌లో 6సీట్లుపెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాలైన ఉభయ తెలుగు రాష్ట్రాలు ప్రస్తుతమున్న సీట్లలో 8సీట్లు కోల్పోవచ్చు. కర్ణాటక, కేరళ రాష్ట్రాలు 2సీట్ల చొప్పు న కోల్పోవచ్చు. జనాభా సంఖ్య ఆధారంగా లోక్‌సభ సీట్లు 848కి పెంచితే యు.పిలో లోక్‌సభ సీట్లు ప్రస్తుతమున్న సీట్ల సంఖ్యకంటే 63 పెరుగుతాయి. బీహార్‌లో 39,మధ్య ప్రదేశ్‌లో 23, రాజస్థాన్‌లో 25,తమిళనాడులో 10,తెలుగు రాష్ట్రాల్లో 12, కర్ణాటకలో 13 సీట్లు పెరిగే అవకాశముంది. లోక్‌సభ సీట్ల సంఖ్యను యథాతథంగా ఉంచి, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రక్రియచేపట్టినా, తెలుగు రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. సీట్ల సంఖ్యను 848 పెంచినా ఈరాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు పెద్దగా పెరిగేదేమీ లేదు.1991 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్ జరగలేదు. 2001 లో జనగణన జరిగినా లోక్‌సభ సీట్ల సంఖ్యనుపెంచలేదు. మహిళల రిజర్వేషన్ల బిల్లును అమలు చేస్తే 19వ లోక్‌సభలో మహిళా సభ్యుల సంఖ్య181కి పెరగవచ్చు.అధికజనాభా గల ఉత్తరాది రాష్ట్రాలు తక్కువ జనాభా కలిగి, కేంద్రానికి అధికపన్నులు చెల్లిస్తున్న దక్షి ణాది రాష్ట్రాలను కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వాలు చులకనగా చేస్తూ, బడ్జెట్‌లో అరకొర నిధులను కేటాయిస్తున్నదనే అపప్రధ ఇప్పటికే ఉంది. కేంద్రంలో ఏపార్టీ అధికారంలో ఉన్నా దక్షిణాది రాష్ట్రాల పట్ల సవతితల్లి ప్రేమ చూపిస్తున్నదనే భావన ప్రజల్లో నెలకొని ఉన్న నేపథ్యంలో డీలిమిటేషన్ అంశం ఉత్తరాది రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాలమధ్య పెను రాజకీయ వివాదాలకు కారణమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.కేంద్రప్రభుత్వనిర్ణయాలకు అనుగుణంగా దక్షి ణాదిరాష్ట్రాలన్నీ చాలావరకు జనాభాను నియంత్రణలో పెట్టాయి.అక్షరాస్యత విషయంలోను, అవగాహన విషయంలోను,అభివృద్ధిలోను ఉత్తరాది రాష్ట్రాల ను వెనుకకు నెట్టిదక్షిణాది రాష్ట్రాలు స్వాతంత్ర్యానంతరం అనేకరంగాల్లో ముందుకు దూసు కుపోతున్నాయి. ఆదాయం లోను, కేంద్రానికి చెల్లించే పన్నుల్లోను దక్షిణాది రాష్ట్రాలదే సింహభాగం. కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించి జనాభాపెరుగుదలను అరికట్టి,దక్షిణాది రాష్ట్రాలు తమకున్న వనరులను సద్వి నియోగంచేసుకుని ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించి, అభివృద్ధిపరంగా ఉత్తరభారతదేశానికి దక్షిణభారతదేశం ఆదర్శప్రాయంగా నిలిచింది.పలు ఉత్తరాది రాష్ట్రాలు ఈనాటికీ అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఉత్తరాది రాష్ట్రాలు ప్రవేశపెట్టలేకపోయాయి.కేంద్రప్రభుత్వం దక్షి ణాది కి నష్టం కలగని రీతిలోసముచిత నిర్ణయం తీసుకోవాలి. •

గుంటూరు వార్త

# ప్రతి పట్టభద్రుడు తప్పక ఓటును సద్వినియోగ పరచుకోవాలని

-నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 22 ప్రభాతవార్త :** ఉమ్మడి కృష్ణా-గుంటూరుజిల్లా పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలికి ఫిబ్రవరి 27వ తేదిన జరిగే పోలింగ్‌లో ఓటరుగా




నమోదు చేసుకున్న ప్రతి పట్టభద్రుడు తప్పక ఓటును వేసి సద్వినియోగపరచుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.బార్గవ్ తేజ కోరారు. శనివారం ఓటర్ల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్వీప్ ర్యాలీని జిల్లా కలక్టరేట్ నుండి జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.బార్గవ్ తేజ నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులులతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి హిందూ కళాశాల వరకు జరిగింది. సంయుక్త కలెక్టర్ ఏ.బార్గవ్ తేజ అందరిచే హిందూ కళాశాల వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 27వ తేదిన జరిగే పోలింగ్‌లో పాల్గొని ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటరు ముందుగా తన ఓటు నమోదు అయినట్లుగా తెలుగసుకుని అలాగే పోలింగ్ స్టేషన్ వివరాలను ముందుగా అవగాహన కలిగి ఉండి పోలింగ్ రోజున తప్పక ఓటు వేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కును సద్వినియోగపరచుకునేందుకు ఓటర్లుకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ రోజు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ వారి ఆదేవాల మేరకు స్వీప్ యాక్టివిటీలో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ఈరోజు ర్యాలీని నిర్వమిస్తున్నామన్నారు. జిల్లా రెవెన్యూ అదికారి షేక్ ఖాజావలి మాట్లాడుతూ ఓటరుగా నమోదైన



ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. గత 15 రోజుల నుండి ఓటర్లలో అవగాహన కల్పించేందుకు మండల కేంద్రాలలో స్వీప్ యాక్టివిటీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ర్యాలీలో గుంటూరు రెవెన్యూ డివిజన్ అదికారి శ్రీనివాసరావు, జియంసి అదనపు కమిషనరు ఓబులేశు, డిప్యూటీ కమిషనర్లు బి శ్రీనివాసరావు, వెంకట కృష్ణయ్య, సిహెచ్ శ్రీనివాస్ డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసరు దుర్గాబాయు డిఎస్‌డిఓ సంజీవరావు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 22 ప్రభాతవార్త :** ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో వార్డ్ సచివాలయాల వారీగా పక్కాగా అమలు చేయడానికి వార్డ్ అడ్మిన్ కార్యదర్శి నేతృత్వంలో కార్యదర్శులందరూ




సమన్వయంతో కృషి చేయాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వార్డ్ సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులతో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, వివిధ సర్వేల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల విజయవంతానికి సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు సకాలంలో అందించడం, వివిధ సర్వేలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల పర్యవేక్షణ కోసం డివిజన్ల వారీగా నోడల్ నియమించిన నోడల్ అధికారులు పర్యవేక్షణ భాధ్యతలు పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమాని స్పష్టం చేశారు. అనంతరం కార్యదర్శుల వారీగా మిస్సింగ్ సిటిజెన్స్, పిఏసిఎస్, హౌసింగ్ జియో ట్యాగ్, ఎన్పీసిఐ, నాన్ రెసిడెంట్ ఇన్ ఏపి, ఎంఎస్ఎంఈ సర్వేల పురోగతి పై వివరాలడిగి తెలుసుకొని, మాట్లాడుతూ, సోమవారానికి సర్వేలన్నీ పూర్తి చేయాలని సర్వేలను క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమీషనర్లు డి.శ్రీనివారావు, పి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిఎంఓహెచ్ డా.అమృతం, ఎంహెచ్ఓ డా. రవిబాబు, ఉపా సెల్ పిఓ రామారావు, గుంటూరు తూర్పు, పశ్చిమ తహసిల్దార్లు, నోడల్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# వర్సిటీ రమణీయతలో పర్యావరణ విభాగం సేవలు అవసరం

-రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** వర్సిటీ ప్రకృతి రమణ యతను పెంపొందించడంలో పర్యావరణ విభాగం సేవలు సూచనలు సలహాలు అవసరం అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పేర్కొన్నారు. పర్యావరణ విభాగంలో రెండురోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా పిచ్చుకల వంటి పర్యావరణానికి మేలు చేసే చిన్నచిన్న పక్షులను ఆకర్షించే విధంగా వర్సిటీని రూపొందించడంలో పర్యావరణ విభాగ ఆచార్యులు తగిన పరిశోధనాత్మక సలహాలను అందించాలని కోరారు. రెండురోజులుగా దేశం నలుమూలల నుండి ఎంతోమంది పర్యావరణ హితులుపాల్గొని పర్యావరణ పరిరక్షణకై ఎంతో విలువైన చర్చలు జరపడం అభినందనీయమని కొనియాడారు. సదస్సును విజయవంతం చేసిన ఆచార్యులైన ఏవివిఎస్ స్వామి, పి.బ్రహ్మాజీ లతో పాటు అతిథి అధ్యాపకులు డాక్టర్ వి.సుభాషిని, డాక్టర్ సి.హెచ్ సునీత, డాక్టర్ కె.శశిధర్ లను అభినందించారు. పర్యావరణ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఏవివిఎస్ స్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపే




ఉద్దేశ్యంతోనే ఇలాంటి సదస్సులను విభాగం ఏర్పాటు చేస్తుందని ఇందుకు సహకరిస్తున్న వర్సిటీ పరిపాలన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. సదస్సు సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీ మాట్లాడుతూ అవని ఆరోగ్యమే అందరి ఆరోగ్యమని, మన పర్యావరణాన్ని కాపాడుకోవాలని, భవిష్యత్ తరాల వారికి ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని మనం అందించాలని అన్నారు. అనంతరం పరిశోధక పత్రాలను సమర్పించిన విద్యార్థిని విద్యార్థులకు ధృవీకరణ పత్రాలను జారీ చేశారు. ఈసదస్సులో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్మీడియట్ పరీక్షలు

-ఇంటర్మీడియట్ బోర్డు ఆఫ్ ఆర్ఐఓ జికె జుబేర్

**గుంటూరు విద్య, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మార్చి 1వ తేది నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన సమగ్ర చర్యలను చేపట్టినట్లు ఇంటర్మీడియట్ బోర్డు ఆఫ్ ఆర్ఐఓ జికె.జుబేర్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై మాట్లాడుతూ ప్రతి పరీక్షాకేంద్రంలోని ప్రతి రూమ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని, పరీక్షా కేంద్రం ప్రదాన గేటు వద్ద రాకపోకల పరిశీలనకు సీసీ కెమెరా ఏర్పాటుచేశామని, ప్రశ్నాపత్రం బండిల్ ఓపెన్ చేసేటప్పుడు సీసీ కెమెరా ఉంచామన్నారు. ఈ తరహా సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రతి పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలో కూడా



ఉంటాయన్నారు. మొత్తం 87పరీక్షా కేంద్రాల నుండి 71,528మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అయిన వి.ఎస్.సుబ్బారావు నేతృత్వంలో శనివారం కోఆర్డినేషన్ సమావేశం జరిగింది, అందులో పరీక్ష నిర్వహణాధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఎలాంటి తప్పిదాలు దొర్లకుండా పరీక్షలను నూరు శాతం పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన సమగ్ర చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో కోర్సులు కు సంబంధించి ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులు 34,473మంది సెకండ్ ఇయర్ 34,973మంది ఇంటర్మీడియట్ ఒకేషనల్ కు సంబంధించి ఇంటర్ ఫస్టియర్ 1215మంది, సెకండ్ ఇయర్‌కి సంబంధించి 867మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను, రూట్ ఆఫీసర్లను, కస్టోడియన్ ఆఫీసర్లను, ఇన్విజిలేటర్లను నియమించా మన్నారు. 24మంది సో రేజి పాయింట్లకు పరీక్షా పత్రాలను పంపడం జరుగుతుందన్నారు. పరీక్షల్లో ఎలాంటి కాపీయింగ్ జరగకుండా 4ఆకస్మిక తనిఖీ బృందాలను, మరో 4 సిట్టింగ్ బృందాలను ఏర్పాటుచేశామన్నారు. గుంటూరు జిల్లా డివిఈఓ పద్మ పరీక్షల ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు కంట్రోల్ రూమ్ కూడా ఇంటర్మీడియట్ ఆర్ఐఓ కార్యాలయంలో ఏర్పాటుచేశా మన్నారు. 0863-2228528కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని పరీక్షకు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించే ప్రసక్తే లేదని జుబేర్ వెల్లడించారు.

# మానవ జీవన విధానంలో పర్యావరణ పరిరక్షణ అంతర్భాగం కావాలి

-ఏపి కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మానవ కార్యకలాపాల యొక్క ఆర్థిక, సామాజిక, పర్యావరణ అంశాలను కలిపి ఆచరణీయమైన పథకాలను నిర్వచించడమే స్థిరమైన అభివృద్ధి లక్ష్యం అని ఏపి కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. ఏఎన్‌యు పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, పర్యావరణ అభివృద్ధికి అవలంభించాల్సిన సుస్థిర విదానాలు అంశంపై రెండురోజుల యూజిసి జాతీయ సదస్సు వర్సిటీలోని డైక్‌మన్ ఆడిటోరియంలో ప్రారంభమైంది. ప్రారంభ సదస్సుకు వర్సిటీ ఇన్‌చార్జ్ విసి ఆచార్య కంచర్ల గంగాధరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపి కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ మానవ జీవనవిధానంలో పర్యావరణ పరిరక్షణ అంతర్భాగం కావాలన్నారు. వర్సిటీల్లో రీసైక్లింగ్ అంశంపై విస్తృతస్థాయిలో పరిశోధనలు చేట్టాలన్నారు. ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సామాజాభివృద్ధికి అనుసరించాల్సిన సుస్థిర సామాజిక అభివృద్ధి వ్యూహాలను వివరించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు జనాబా సుస్థిర అభివృద్ధికి కావలసిన పలు నూతనపథకాలను ప్రవేశపెట్టారని సూచించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పర్యావరణ విభాగం డీన్ డాక్టర్ కె.రాజేంద్రన్ కేలకోపన్యాసం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న కాలుష్య నివారణకు అనుసరిస్తున్న పద్దతుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, మిషన్ లెర్నింగ్ ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల్లో వ్యర్థాలను తొలగించేందుకు అనుగుణంగా సాంకేతికతను వినియోగించాలని సూచించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతుందన్నారు. వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ భవిష్యత్ తరాల అవసరాలను తీర్చే అవకాశాన్ని రాజీపడకుండా ప్రస్తుత తరం అవసరాలను తీర్చే ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధిలో కొనసాగడం జరగాలన్నారు కార్యక్రమంలో పర్యావరణ విభాగ అధ్యాపకులు డాక్టర్ వి.సుభాషిని, డాక్టర్ కె.శశిధర్, భారతి దాసన్ యూనివర్సిటీ అధ్యాపకులు ప్రొఫెసర్ వెంకటాచలం, మహారాష్ట్ర పెర్గోసన్ కళాశాల అధ్యాపకులు తన్వి యోగేష్ భరద్వాజ్, అమీర్ ముల్లా, ఆశీష్, మానవ వనరుల అభివృద్ధి విభాగ అధ్యాపకులు ఆచార్య తులసీదాస్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టెండరు దారులు ఓకరు..నిర్వాహణ మరొకరు

- అనుమతులు ఒక చోట...
ప్రయాణం మరో చోట
- శివరాత్రికి ఎలాంటి అనుమతులు లేకుండానే నడిపేందుకు సిద్ధం
- ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న పడవ దారులు
- చోద్యం చూస్తున్న అధికారులు...
పరిశీలించని మండల అధికారులు

**అమరావతి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** నది పరివాహక ప్రాంతాల్లో పడవలు, బల్లకట్టు నడిపేవారు నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఓవర్ లోడింగ్ చేసి వాహనాలతో పాటు ప్రయాణం చేయడం



ప్రయాణికులకు ప్రమాదకరమని స్థానిక ప్రజలు తెలిపారు. అమరావతి మండలంలో ధరణికోట ప్రాంతంలో పాట పాడి అమరావతి, క ంచికచర్ల రూటుకు పడవ తిప్పుతున్నారని ప్రజలు తెలిపారు. టెండరు పాటు ఐదు నెలలకు రూ.70 వేలకు పాడి టెండరు దారుణాన్ని పక్కకు జరిపి ప్రదేశాన్ని మార్చి చెవిటి కల్లుకు నిత్యం పడవను నడుపుతున్నారని ప్రజలు తెలిపారు. శివరాత్రి సమీపించడంతో అనుమతులు లేని ప్రదేశంలోనే వేలాది మంది భక్తులను అవతలి ఒడ్డుకు తరలించనున్నారు. దీని వలన రూ.లక్ష వరకు ప్రభుత్వ ఖజానాకు గండి అని నిపుణులు తెలుపుతున్నారు. జెడ్పీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. అచ్చంపేట మండలంలో గింజుపల్లి కూడా టెండరు దారులు ఒకరు పడవ నిర్వాహకులు మరొకరు అని ప్రజలు తెలిపారు. మిగిలిన ప్రదేశంలో పడవదారులూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఐదు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. ద్విచక్ర వాహనదారునికి రూ.50 లు చొప్పున ఒక వాహనం కలిగిన వ్యక్తి వద్దే రూ.100ల వరకు వసూలు చేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. చిన్న పడవల్లో సైతం 30 నుంచి 40 మంది ప్రయాణికులు ఎక్కిస్తూ ఓవర్ లోడ్‌తో ప్రయాణం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పడవ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ ఎంపిడివోలను ప్రజలు కోరుతున్నారు.

**నిబంధనలు తుంగలో :** జెడ్పీ ఆదేశాల మేరకు పాట పాడిన 15 రోజుల్లోపు మచిలీపట్నంలోని పోర్టు అధికారి వద్ద నిర్ణీత గడువులోపు రెన్యూవల్ చేయించుకోవాలని తెలిపారు. నీటి వనరులశాఖ నందు నిర్దేశించబడిన నియమాలను నిబంధనలకు లోబడి పాట దారుడు నడుపుకోవాలని, పరిమితికి మించి బరువులను పడవడల్లో తీసుకని పోకూడదన్నారు. గొలుసులు, తాళ్ళు, లైఫ్ జాకెట్లు మొదలగు సురక్షిత సామాగ్రి తరచుగా ఉంచుకోవాలని, లీజు దారులు తన సొంత ఖర్చులతో సి.సి.కెమేరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి ప్రయాణికుడికి సంబంధిత నిర్దేశిత ధరతో టిక్కెట్లు ఇవ్వాలి. లీజు దారుడు రేవు పాటను వేరే వారికి అద్దెకి ఇవ్వటం లాంటివి చేయరాదు. అలా చేసిన యెడల లీజు రద్దు అగును. పడవ నడిపే వారికి లైసెన్సు, పడవకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ ఉండాలని వివరించారు. పడవ నడిపే వారి వివరాలు, ఫోన్ నెంబరు పొందుపరచాలి, బల్లకట్టు పడవ నందు పేలుడు పదార్థాలు, పెట్రోలు, ఆల్కాహాలు, పాన్ గుట్కా, సిగరెట్లు, బీడీలు ప్రభుత్వ నిషేధిత వస్తువులు తరలించరాదు. సంబంధిత నిబంధనలకు విరుద్ధంగా నడిపితే వారి లైసెన్స్ ను రద్దు చేయడం జరుగుతుంది.

# మోలానా అబుల్ కలాం సేవలు చిరస్మరణీయం

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 22 ప్రభాతవార్త :** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త మోలానా అబుల్ కలాం సేవలు చిరస్మరణీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. మోలానా



అబుల్ కలాం వర్ధంతి సందర్భంగా శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. తొలుత అబుల్ కలాం చిత్రపటానికి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత దేశానికి తొలి విద్యా శాఖ మంత్రిగా అనేక సేవలు అందించారని తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర చాలా కీలకమని చెప్పారు. భారత దేశంలో విద్యా వ్యాప్తికి అనునిత్యం పరితపిస్తూ, ప్రజల జీవితాల్లో విద్యా దీపాలు వెలిగించారని పేర్కొన్నారు. దేశ అత్యుత్తమ పురస్కారమైన భారత రత్న అందుకున్న వారిలో అబుల్ కలాం ప్రముఖులని కొనియాడారు. "ఇండియా విన్స్ ఫ్రీడమ్" అనే పుస్తకాన్ని రచించి స్వాతంత్ర్య పోరాటం గొప్పతనాన్ని చాటి చెప్పారని పేర్కొన్నారు. జర్నలిస్టుగా, రచయితగా సామాజిక మార్పునకు దోహదం చేసే రచనలు చేశారని వివరించారు. భారతదేశ విభజనను వ్యతిరేకించిన వారిలో అబుల్ కలాం ఒకరని చెప్పారు. భారతదేశంలో హిందూ ముస్లిం ఐక్యత కోసం కృషి చేశారని, నేటి యువత అబుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అబుల్ కలాం ఆశయాల సాధన కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, గింజాం రాఘవేంద్ర, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఫఠాన్ జమీర్ ఖాన్, రఫీ, ఉస్మాన్, అన్వర్ , హాఫీజ్, చిలుకా వెంకటేశ్వర్లు, అల్లం బాజీ, వంగర ఏడుకొండలు , గొల్ల ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే అనుకువలు నేర్చుకోవాలి

**గుంటూరు, ఫిబ్రవరి22, ప్రభాతవార్త :** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ గుంటూరు జిల్లా విద్యార్థుల విభాగం యొక్క సదస్సు స్థానిక జాగర్లమూడి చంద్రమోళి లా కాలేజీలో జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖపట్నం లోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీకి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ న్యాయ విద్యార్థులకు అంతర్జాతీయంగా ఉన్న అవకాశాల గురించి బోధించారు. జనరల్ సెక్రెటరీ నల్లూరి




మాధవరావు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ విధానం గురించి దాంట్లోని విద్యార్థుల బాధ్యత గురించి మాట్లాడటం జరిగింది. సెక్రటరీ నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో విజయవంతంగా ఎలా రాణించాలి అంటే విద్యార్థి దశ నుండే అనకువలు అన్ని విధాలుగా నేర్చుకోవాలి అని మాట్లాడటం జరిగినది. కార్యక్రమంలో విద్యార్థి విభాగం కన్వీనర్ పచ్చ కిరణ్, కో కన్వీనర్ జాషువా మరియు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ న్యాయ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఐలు గుంటూరు జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ గా స్థానిక జాగర్లమూడి న్యాయ కళాశాల కు చెందిన కే. పుల్లారావు ఎన్నికయ్యారు. కో కన్వీనర్ గా విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లా కు చెందిన వాసంతి ఎన్నికయ్యారు. ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సలీం వారి పేర్లు ప్రతిపాదించగా విద్యార్థులందరూ వారి ఆమోదాన్ని తెలియజేశారు.

# గంజాయిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : డీజీపీ

**యడ్లపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** గంజాయి మీద ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, కొత్త కార్యక్రమం ప్రారంభించటం జరిగిందని, ఇందులో ఈగల్ ఆర్గనైజేషన్ ఏర్పాటుచేసి ఏవిధంగా నిర్మూలన చేయాలన్నదానిపై ఒక విధానాన్ని రూపొందించామని, ఇందులో పోలీస్ డిపార్ట్‌మెంట్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్, ఈగల్ ఆర్గనైజేషన్ మొత్తం గంజాయి గ్యాంగులపై దృష్టి పెట్టామని, త్వరలోనే వారిని అదుపులోకి తీసుకొని సమస్యను అదుపులోకి తీసుకు వస్తామని అంధ్రప్రదేశ్ డీజీపీ హరిష్‌కుమార్ గుప్తా తెలిపారు. పల్నాడు జిల్లా, యడ్లపాడు మండల పరిధిలోని కొండవీడు రెవిన్యూ గ్రామం కొత్తపాలెం వద్ద ఏర్పాటుచేసిన జిందాల్ వేస్ట్‌మేనేజ్ మెంట్ ఎనర్జీ








పవర్ ప్లాంటుకు అయన శనివారం విచ్చేసారు. కృష్టా జిల్లాలో పట్టుబడిన గంజాయి 3737కేజీలు మరియు 4.22కిలోల లిక్విడ్ గంజాయిని నియమ నిబంధనలు అనుసరించి డ్రగ్ డిస్పోజల్ కమిటీ సమక్షంలో దగ్ధం చేయు కార్యక్రమానికి రావటం జరిగిందన్నారు. మొత్తం 183కేసులు నమోదు చేటయం జరిగిందన్నారు. ఇందులో కృష్టా జిల్లా బందరు డివిజన్, గుడివాడ సబ్ డివిజన్, అవనిగడ్డ డివిజన్, గన్నవర్ డివిజన్ పరిధిలో ఉన్నాయన్నారు. వీటి విలువ 1,87,25,000కోట్లు ఉంటాయన్నారు. అనంతరం అయన మీడియాతో మాట్లాడుతూ ఉన్న సమస్యఅల్లా ఒరిస్సా రాష్ట్రం నుండి దిగుమతి అవుతుందని, వాటిని పట్టుకుంటున్నామని, మన రాష్ట్రంలో గంజాయి సాగు అవుతున్న రెండు వందల ఎకరాల వరకు ధ్వంసం చేయటం జరిగిందన్నారు. పరివర్తన పేరిట అన్ని కళాశాలల్లో అవగాహనకల్పించి అక్కడ ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయిస్తున్నామని, ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారంగా వారి అస్తుల్ని సైతం సీజ్ చేయడం జరుగుతు ందని, ఇలాంటి వ్యవహారాలు చేసిన కొందరు ఇతర రాష్ట్రాల్లో ఉన్నా అక్కడి వారితో కోఅర్డినేట్ చేసుకొని మన టాస్క్‌ఫోర్స్ పంపించడం జరిగిందన్నారు. త్వరలో వారిని కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. బెంగుళూరు నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గుంటూరు నగరంలో గంజాయి, మత్తు పదార్థాల సరఫరా చేస్తున్నారన్నారు. వారందరిపై నిఘా పెట్టామని గుంటూరులో రెండు కేసులు వచ్చాయని పరిశీలిస్తున్నామన్నారు. కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్దులు వారి తల్లిదండ్రులు సమన్వయంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులతో సహకరించాలని, అనుమానమున్న అన్ని ప్రాంతాల్లో నూ వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. విద్యార్దులకు అవగాహన కలిప్పించి వారిచే ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు గంజాయి గ్యాంగ్స్‌ను అందరికీ హెచ్చరిస్తున్నామని, మత్తు పదార్థాల విక్రయాలు, కొనుగోలు చేసేవారిపై పూర్తి నిఘా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వాటిలో దొరికిన వారిపై క్రిమినల్ కేసులే కాకుండా కఠిన శిక్షలు కూడా పడేలా చేస్తామని, మత్తు పదార్థాలు విక్రయించే వారిని గుర్తించి వారి అస్తుల్ని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో గంజాయి సాగు చేస్తున్న, విక్రయిస్తున్న, సేవిస్తున్న సమాచారం ఉంటే వెంటనే 112 లేదా 1972 ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. అనంతరం జిందాల్ ప్లాంట్ అవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవిజి అశోక్‌కుమార్, ఈగల్ ఐజీ అకే రవి కృష్ణ, గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠీ, కృష్ణ జిల్లా ఎస్పీ అర్ గంగాధర్, పల్నాడు ఎస్పీ కే శ్రీనివాసరావు, జిందాల్ ప్లాంట్ ఎండీ చారీ, జీఎమ్ రామకృష్ణ, ఇతర పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్యనాటక ప్రదర్శన



**గుంటూరు కల్చరల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** స్థానిక గంగాభ్రమరాంబ సమేత చంద్రశేఖరస్వామి కళాప్రాంగణం, తక్కెళ్ళపాడులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృతీ సమితి, విజయవాడ సౌజన్యంతో మహాశివరాత్రి సందర్భంగా శనివారం విరాట్ నాట్యమండలి, తక్కెళ్ళపాడు వారిచే సందేశాత్మకంగా సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్యనాటక ప్రదర్శన జరిగింది. విశ్వామిత్రడిగి తక్కెళ్ళపాడు షేక్ మీరావలి, హరిశ్చంద్రులుగా మందపాటి కోటేశ్వరరావు, షేక్ లాలు, జి.రామబ్రహ్మారెడ్డి, ఆర్.శ్రీనివాసరావు, నక్షత్రకులుగా జి.వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసరావు, చంద్రమతిగా ఎం.లక్ష్మీశ్రీ, కాలకౌశికుడుగా దరిసి శ్రీనివాసరావు, వీరబాహుడిగా కె.వేంకటేశ్వరరావు, కేశవగా ఆర్.రత్తయ్య, మాతంగి గా జి.పద్మ, పౌరాణిక పద్యాలతో నాటక ప్రదర్శన చేసి నాటకాభిమానులను అలరించారు. వీరికి హార్మోనియం ఎన్.సిద్దయ్య, డోలక్ ఎం.రాము,. క్లారినెట్ జి.రంగ వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో గుంటూరు కళాకారుల సంఘం అధ్యక్షులు నల్లక శ్రీనివాసరావు, అమ్మిశెట్టి నాగేశ్వరరావు, సనిశెట్టి సాంబశివరావు, చెన్నుపాటి కృష్ణారావు, తక్కెళ్ళపాడు సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి తదితరులు పాల్గొని కళాకారులను అభినందించి సత్కరించారు.

# భారీ బంగారం చోరీ కేసులో 8 మంది నిందితుల అరెస్టు

-4.800 కేజీల బంగారం -రూ.2 లక్షల నగదు స్వాధీనం

**గుంటూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరు వద్ద జరిగిన భారీ బంగారం చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసి, 4.800 కేజీల బంగారాన్ని గుంటూరు జిల్లా పోలీసులు కేవలం 6 రోజుల్లో రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. కేసు చేధనలో ప్రముఖ పాత్ర పోషించిన జిల్లా అదనపు ఎస్పీ(క్రైమ్స్). సుప్రజ, దిదిళీ బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 15న దీజులి జ్యుయలర్స్ షాపు యజమాని అయిన దివి.రాము విజయవాడలో గల తన షాప్ నందు తయారు చేయించిన సుమారు 5కేజీల బంగారు ఆభరణములను 17వ తేదీన నల్గొండ, సూర్యపేట, నకరికల్లు మొదలైన ఏరియాలకు పంపించుటకు గాను ఒక బ్యాగ్ నందు భద్రపరచి, తన వద్ద నమ్మకంగా పనిచేస్తున్న ,బంధువు దివి.నాగరాజుకు అప్పగించి, మంగళగిరిలో తన ఇంటికి తీసుకుని వెళ్లవలసినదిగా చెప్పారు. సుమారు 9.23 గంటలకు దివి. నాగరాజు తన యజమాని దివి.రాముకు ఫోన్ చేసి, తన వద్ద ఉన్న బంగారం బ్యాగ్ ను స్కూటి ముందు పెట్టుకుని వస్తుండగా, మార్గ మధ్యలో ఆత్మకూరు అండర్ పాస్ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్దకు వచ్చేసరికి, గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఒక బైక్ మీద వచ్చి, తన వద్ద ఉన్న బంగారం ఉన్న బాగ్ ను లాక్కుని ఫ్లై ఓవర్ వైపునకు పారిపోయినారు అని తెలిపారు. వెంటనే దివి.రాము నేరస్థలం వద్దకు వచ్చి, విచారించుకుని, నిజంగానే ఎవరో దొంగలు బంగారం బ్యాగ్ ను దొంగిలించుకుని పోయినట్లుగా తగిన చర్య తీసుకుని న్యాయం చేయవలసినదిగా మంగళగిరి రూరల్ పోలీస్ వారికి ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదు అందిన వెంటనే మంగళగిరి రూరల్ పోలీస్ వారు జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు తెలియపరచి కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించినారు. ఈ కేసును గుంటూరు జిల్లా ఎస్పీ. సతీష్ కుమార్ ఒక సవాలుగా తీసుకుని జిల్లా నేర విభాగ అదనపు ఎస్పీ సుప్రజమంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తో కూడిన 6 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, కేవలం 6 రోజుల్లోనే కేసును ఛేదించి, చోరీకి గురైన బంగారాన్ని రికవరీ చేశారు. నిందితులు ఒక ప్రణాళిక ప్రకారం, నిందితుడు దివి.నాగరాజు అదే షాపులో పనిచేస్తున్న భరత్, గతంలో బంగారం పని చేసిన నవీన్, ఇర్ఫాన్, మోహన్ వారి స్నేహితులైన లోకేష్, చందు, అరుణ్ బిక్షు అను వార్లతో కలిసి భారీ బంగారం చోరీ పథకానికి సిద్ధమైనట్టు విచారణలో తేలినట్టు పోలీసులు తెలిపారు. ఓ పథకం ప్రకారం ఎక్కువ మొత్తంలో బంగారమును విజయవాడలోని షాపు నుండి మంగళగిరిలోని యజమాని ఇంటికి తీసుకువెళ్ళే సమయములో సదరు బంగారు బ్యాగ్ ను విజయవాడ నుండి మంగళగిరికి తీసుకు వస్తున్న క్రమంలో బంగారం బ్యాగ్ ను మాయం చేసి గుర్తు తెలియని దొంగలు లాక్కుని పోయినట్లుగా సృష్టించి, యజమానిని మోసగించాలని, యజమాని బంధువు నిందితుడు దివి.నాగరాజు మంగళగిరి వస్తుండగా నవీన్, ఇర్ఫాన్ లు ఓ పల్సర్ 220 బైక్ పై హెల్మెట్, రేస్ ప్యాడ్ లు కాళ్ళకు కట్టుకుని, మరొకరు స్నేహితుడైన మోహన్ యమహా బైక్ పై కొంచెం దూరం నుండి నాగరాజు స్కూటిని వెంబడిస్తూ చుట్టుప్రక్కల గమనిస్తూ ఆత్మకూరు అండర్ పాస్ వద్ద మంగళగిరి లోకి వస్తూ ఉండగా దివి.నాగరాజు వద్ద ఉన్న బ్యాగ్ ని నవీన్, ఇర్ఫాన్ లు తీసుకుని పరారయ్యారు. దీంతో నిందితుడు దివి నాగరాజు నాటకీయంగా కొంతదూరం ముందుకు వెళ్ళి బ్యాగ్ ని దొంగలు లాక్కుని పోయినారని యజమాని దివి. రాము నిజమని నమ్మించడంతో దివి.రాము పోలీస్ వారికి ఫిర్యాదు చేశారు.

# అంగన్‌వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

**బాపట్ల, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** భూగర్భ జలాల పెరుగుదలకు అంగన్వాడి కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. భూగర్భ జలాల పెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ లో ఆయన సమీక్ష



సమావేశం నిర్వహించారు. జలవనరులను సంరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ భవనాలపై కురిసే వర్షపు నీరు నేరుగా భూమిలోకి వెళ్లేలా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. ప్రజా ప్రయోజనం కొరకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రతి అంగన్వాడి కేంద్రం వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలపై ఆయన ఆరా తీశారు. 261 ఇంకుడు గుంతలు నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా ఇచ్చిందని, అందులో 112 పూర్తకాగ, 129 నిర్మాణంలో ఉన్నాయన్నారు. మిగిలిన 18 ఇంకుడు గుంతల నిర్మాణాలకు భూసేకరణ చేపడుతున్నామని కలెక్టర్ కు ఎస్ ఈ పంచాయతీరాజ్ అదికారులు వివరించారు. నిర్దేశిత లక్ష్యాలను యుద్ధ ప్రాతి పదికన ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్. ఈ ని ఆయన ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాల్లో 190 మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం లక్ష్యాలను ఇచ్చిందన్నారు. అందులో లక్ష్యాలను పూర్తి చేయడమైనదని గ్రామీణ నీటి సరఫరా అధికారులు జిల్లా కలెక్టర్ వివరించారు, అదేవిధంగా మంచినీటి సరఫరా లో ఇచ్చిన లక్ష్యాలను కూడా పూర్తి చేసామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్ పనులు ఉంటే వాటిని ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. 73 అంగన్వాడీ కేంద్రాలలో విద్యుత్ కనెక్షన్లను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అందులో 46 కనెక్షన్లకు సర్వీస్ వైర్ ఏర్పాటు చేయగా, మిగిలిన 27 కనెక్షన్లను ఈనెలాఖరికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఈ నెలాఖరులోపు పూర్తి చేసి నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పిడి ఉమా, పంచాయతీరాజ్ ఇంచార్జి ఎస్ఈ జి రతన్ బాబు, ఆర్. డబ్ల్యూ. ఎస్ డీ. ఈ మాధవి, ఏపీ సీపీడీసీఎల్ డి. ఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# మౌలానా అబుల్ కలాంకు నివాళి

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మౌలానా అబుల్ కలాంకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా కార్యాలయంలో శనివారం నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. రానున్న రోజుల్లో మైనార్టీల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ఎన్నో కార్యక్రమాలను చేపట్టబోతుందన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు



వేసి నివాళులర్పించారు. అబుల్ కలాం 68వ వర్ధంతిని నిర్వహించుకోవడం ద్వారా ఆయన విద్యాశాఖామంత్రిగా చేసిన సేవలను వివరించారు. దేశంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. భారతీయుల ప్రతిభా పాటవాలు వెలుగులోకి రావాలంటే విద్య మాత్రమే మార్గమని తెలియజేశారని తెలిపారు. మాజీ సిఎం వై. ఎస్. రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వై. ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిలు మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఖాదర్‌బాషా, కరిముల్లా, సుభాని, జిలానీ, గౌస్‌పీరా, విజయ్‌కుమార్, గాబ్రియేలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర స్పెషల్ డ్రైవ్

**నూజెండ్ల, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** మండలంలోని అన్ని గ్రామ పంచాయితీ పరిధిల్లోని గ్రామాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు శనివారం నిర్వహించడం జరిగిందని ఈవోపిఆర్డి షేక్ రబ్బాని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోడ్ల పక్కన ఉన్న చెత్తను



తొలగించి క్లాప్ మిత్రలకు తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీ తయారు చేయటంపై సూచనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్, హసన్‌పిరా, రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, క్లాప్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించండి

**వినుకొండ, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కె. ఎస్. లక్ష్మణరావు కోరారు. శనివారం పట్టణంలోని యూటిఎఫ్ కార్యాలయంలో ఈ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన లక్ష్మణరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ 2007 నుంచి నిరంతరం ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ సంఘాల తరుపున అనేక పోరాటాలు చేశామన్నారు. ఈ సారి కూడా తనను గెలిపించినట్లయితే మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటిఎఫ్ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష, సమావేశం

**నూజెండ్ల, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన నూజెండ్ల ఎంపిడివో కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ఎంపిడివో ఉమాదేవి సమీక్ష, సమావేశం శనివారం నిర్వహించారు. సేద్యపు నీటి కుంటలు, ఇంకుడు గుంతలు కార్యక్రమంపై చర్చించారు. కార్యక్రమంలో ఏపివో ఆంజనేయరాజు, టెక్నికల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాలు పరిశీలన

వినుకొండ, ఫిబ్రవరి22, ప్రభాతవార్త: ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజిలో గల పోలింగ్‌స్టేషన్‌ను తహశీల్దార్ సురేష్ కుమార్, మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శోభన్‌బాబుతో కలిసి పరిశీలించడం జరిగింది.



# విద్యార్థుల విద్యాభ్యున్నతి మూలం ప్రాథమిక అంశాలు

**బాపట్ల, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** విద్యార్థుల విద్యాభ్యున్నతి మూలం ప్రాథమిక అంశాలు ముఖ్యమని సమగ్ర శిక్షా బాపట్ల ఎ. ఎం. ఓ. డాక్టర్ బి. మోజెస్ అన్నారు. స్థానిక మునిసిపల్ హైస్కూల్‌లో అంగన్వాడీ టీచర్స్‌కు జరుగుతున్న నాలుగవరోజు శిక్షణ కార్యక్రమం లో శనివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిప్రైమరీ



విద్యా వ్యవస్థ లో అంగన్వాడీ ల పాత్ర అమోఘమన్నారు. విద్యా వ్యవస్థ లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా భోదన చేయాలని సూచించారు. సమగ్ర శిక్షా, పాఠశాల విద్యా శాఖా, ఐ సి డి ఎస్, ల అధ్యర్యంలో జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమాలు చిన్నారుల భవితకు ఎంత గానో దోహద పడతాయని పేర్కొన్నారు. ఈసందర్భంగా అంగన్వాడీ టీచర్స్ కు మాడుల్స్, ఇతర భోదనోపకరణలను పంపిణి చేసారు. ఈకార్యక్రమంలో బాపట్ల ఎం. ఈ. వో ఎస్. నిరంజన్, మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిన బి. రాజశ్రీ. ఐసిడిఎస్. సిడిపిఓ లక్ష్మీ పార్వతి, సూపర్ వైజర్ జ్యోతి, శిక్షకులు ప్రసాదబాబు, ఎ. వి. నారాయణ, బాలకోటేశ్వరరావు, కీ రిసోర్స్ పర్సన్ నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. తోలుత ఎం ఈ ఓ నిరంజన్ మధ్యాహ్నన భోజనం పరిశీలించారు. తదనంతరం భవన నిర్మాణ పనులను వారు పరిశీలించారు.

# ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**నిజాంపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్తః** పంచాయితీ కార్యదర్శుల వద్దకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల వద్దకు వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు సత్వర న్యాయం అందజేయాలని ఎంపిడిఓ నాగలక్ష్మి కోరారు. శనివారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, పంచాయితీ



కార్యదర్శుల రివ్యూ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ సుబ్బారావు, ఎఇ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపిపి విజయనిర్మల, మోపిదేవి హరనాథ్, జడ్‌పిటిసి సుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఎంపిడిఓ నాగలక్ష్మీ (నిజాంపట్నం- ప్రభాతవార్త)

# అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-అగ్నిమాపకశాఖాధికారి ప్రసాదరావు**

**పొన్నూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి కొండపల్లి ప్రసాదరావు తెలిపారు. అగ్నిమాపకశాఖ తరపు నుంచి కూడా వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా పాఠశాలలు, కళాశాలలు, అపార్టుమెంట్లు, వివిధ ప్రాంతాల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తామని అదేవిధంగా ఈ ఏడాది కూడా ఏప్రిల్‌లో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తామన్నారు. పొన్నూరు అగ్నిమాపకశాఖ పరిధిలో ప్రమాదాల నివారణలో



తాము శక్తివంచన లేకుండా పనిచేస్తున్నట్లు చెప్పారు. పొన్నూరు పరిధిలో కాకుమాను, అమర్తలూరు, చుండూరు, పిట్టలవానిపాలెం, చెరుకుపల్లి, పొన్నూరు మండలాలు ఉన్నాయన్నారు. ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరిగినా తమకు తెలియజేసిన క్షణంలోనే సంఘటనా స్థలానికి వెళ్ళి ప్రజలు ఆస్తులను కాపాడిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. అయితే ఒకే సారి వివిధ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే కొంత ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. అయినప్పటికీ జిల్లా కేంద్రానికి తెలియజేసి తక్షణమే అక్కడి నుంచి వాహనాన్ని తెప్పించి మంటలను అదుపు చేసే ప్రక్రియలో కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయం సుమారు ఐదు దశాబ్దాలకు పూర్వం నిర్మాణం చేసింది కావడంతో శిధిలావస్థకు చేరింది. దాని స్థానంలో 2019వ సంవత్సరంలో రూ. 70లక్షల నిధులతో నూతన భవనాన్ని నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి సంబంధిత కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా విద్యుత్ వైరింగ్, ఫ్లోరింగ్, తదితర పనులు నిలిచిపోయినట్లు చెప్పారు. పాతభవనం కావడంతో మరుగుదొడ్లకు సంబంధించి పెచ్చులూరి పడుతుండడంతో కొంత ఇబ్బందికరంగా ఉందన్నారు. 2022-23 మార్చి వరకు 90, 2023-24 మార్చి వరకు 97, 2024-25 ఫిబ్రవరి వరకు 60ప్రమాదలు సంభవించినట్లు చెప్పారు. రైతులు మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తయ్యాక వ్యవర్థాలకు మండలు పెడుతుండడంతో మొక్కజొన్న, వరికుప్పలు దగ్గం అయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతులు మొక్కజొన్న పంటలో నిప్పు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నా మన్నారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు చెప్పినట్లయితే ఇంకొంత సమయాన్ని ఆదా చేసుకొనే అవకాశం ఉందన్నారు. ప్రమాదాలు జరిగిన తక్షణమే టోల్ ఫ్రీ నెం:1010, అగ్నిమాపక కేంద్రం ఫోన్ నెం:08643-242211కు ఫోన్ చేయాలని ప్రసాదరావు సూచించారు.



# గ్రంథాలయం స్థలంలో ఆక్రమణలను తొలగించాలి

**- సెక్రటరీ సుబ్బరత్నమ్మ**

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పట్టణంలోని గ్రంథాలయం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ తొలగింపు, ఆక్రమణలపై గుంటూరు జిల్లా సెక్రటరీ సుబ్బరత్నమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కు చెప్పి



చేశామంటూ చెప్తారా అంటూ ఆమె గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బందిపై మండిపడ్డారు. గార్లపాడు బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న పాత గ్రంథాలయ భవనం శిధిలావస్థకు చేరడంతో గతంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రత్యేక ఆదేశాలతో గతంలో స్థలం డోనర్, గ్రంథాలయ అధికారుల సూచనలతో పట్టణ ప్రణాళిక అధికారులతో సంప్రదించి ప్రజలకు ఏ ప్రాణపాయం కలగకుండా రెండంతస్తుల భవనాన్ని క్రేన్ సహాయంతో నేలమట్టం చేశారు. శనివారం సెక్రటరీ సుబ్బరత్నమ్మ పాత గ్రంథాలయ స్థలంలో ఆక్రమణలను చూసి నివ్వెరపోయి తక్షణమే ఆక్రమణలను తొలగించాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ గ్రంథాలయ స్థలాల్లో ఎవరైనా ఆక్రమణలు చేస్తే అటువంటి వారిపై కేసులుతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్, హోలీ ఫ్యామిలీ స్కూల్ ఉపాధ్యాయులతో శనివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టభద్రులు, గ్రాడ్యుయేట్స్ అందరూ మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి బలపరిచిన ఆలపాటి రాజా కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కోసం ఏ విధంగా అయితే కృషి చేశారో అదే రీతిలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెట్టింపు స్థాయిలో కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

**చెరుకుపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్తః** కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు పర్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని నీతి అయోగ్ అనుబంధ విచారణ కమిటీ సభ్యులు వికాస్ మాలాకర్ అన్నారు. శనివారం మండలంలోని ఆరుంబాకలో తమతోపాటు వచ్చిన కేంద్రసభ్యులతో ఆయన పథకాల తీరుపై విచారణ నిర్వహించారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం, జాతీయ గ్రామ సడక్ యోజన పథకం, పిఎంఎవై, పింఛన్ల పంపిణీపై గ్రామంలో తిరిగి విచారణ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదాని కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు విచారణ నిర్వహిస్తు న్నదని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం కనగాల పంచాయితీ పరిధిలో కమిటీ సభ్యులతో విచారణ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి టి మురళీకృష్ణ, సెంట్రల్ టీం అధికారులు వి సంధ్యారాణి, బి చంద్ర, లోకేష్, ఎఇ సేవానాయక్, ఆయా పథకాల అధికారులు, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పట్టణ ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

**- మునిసిపల్ షేక్ అబ్దుల్ రహీం**

**చిలకలూరిపేట, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** పట్టణ ప్రజలు రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా వాడాలని మున్సిపల్ డిఈ షేక్ అబ్దుల్ రహీం కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు వార్డుల వారీగా బైఫరికేషన్ చేయడం జరుగుతుందన్నారు. పురపాలకసంఘ పరిధిలోని ప్రతిఇంటికి వార్డుల వారీగా మంచినీటి కుళాయిల సర్వే జరుగుతుందని, కుళాయి ఉన్న ప్రతి ఒక్కరూ నీటి చార్జిలు చెల్లించాలని తెలిపారు



# సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత మెడికల్ క్యాంపు

**పిడుగురాళ్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః** మండలంలోని తుమ్మలచెరువులో సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యాన బోధి పాఠశాల సౌజన్యంతో శనివారం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపు పల్నాటి చరిత్రకి కీర్తి మకుటంగా నిలుస్తోందని, ఒకే చోట అన్ని విభాగాలకు చెందిన 20 మంది వైద్యులతో ఈమెగా క్యాంపు నిర్వహించినట్లు ప్రముఖ ఆర్థో



స్పెషలిస్ట్ డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. ఈ మెగా క్యాంపులో ఆర్థో, పిల్లల వైద్య విభాగం, జనరల్ చెకప్, గైనకాలజీ తదితర వైద్య సేవలను అందించినట్లు చెప్పారు. రక్త పరీక్షలు, షుగర్, బీపీ, ఎక్స్‌రే వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించగా 350 మందికి పైగా ప్రజలు ఈ సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు.

# వృద్ధులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలి

**-ఆధ్యాత్మిక వేత్త చక్కా శ్రీనివాసరావు**

**పొన్నూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** వృద్ధులకు, అవసరార్దులకు చేయూతనివ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని ఆధ్యాత్మిక వేత్త చక్కా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వృద్ధాశ్రమంలో, కసుకర్రు అమ్మసేవా నిలయంలోనూ పలువురు బాటసారులకు అన్న సంతర్పణ చేశారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982వ సంవత్సరం పదోతరగతి పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



తమ తోటి నాయకుడు అయిన స్వర్గీయ జక్కా శ్రీనివాసరావు జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూర్వ విద్యార్థుల బ్యాచ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంత మందికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ కరిముల్లా, సుబ్రహ్మణ్యం, ఎల్ఐసి శ్రీనివాసరావు, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**గుంటూరు విద్య, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ఖ్వాజ మొహినుద్దీన్ చిష్టి ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకులు హాజీ షేక్ మోహరున్నీసా 7వ వర్ధంతి సందర్భంగా కో-ఫౌండర్ హాజీ షేక్ అబ్దుల్ సత్తార్, అధ్యక్షులు షేక్ బాజిత్ భాషా ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. కొత్తపేట, ఆనందపేట తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలపై నిత్యవసర సరుకులను పెట్టుకొని అన్నార్థులకు పంపిణీ జరిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ సత్తారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారికి ఉన్నదానిలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయడం ద్వారా ఆ దేవుడు వారిని చల్లగా చూస్తాడని పేర్కొన్నారు. ఇతరులకు సహాయ పడటంలో ఎంతో తృప్తి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఖాదర్‌బీ, సలామ్ బాషా, సంధాని, నయీమ్, తదితరులు పాల్గొన్నారు.



# మత్తుపదార్థాల విక్రయాలు నేరం

చెరుకుపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్తః ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాటుసారా గంజాయి తదితర మత్తుపదార్థాలను విక్రయించినట్లయితే అటువంటివారిపై కఠిన చర్యలు తప్పవని నగరం ఎక్సైజ్ సిఐ ఎం శ్రీరాంప్రసాద్ అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శనివారం మండలంలో తనిఖీ చేస్తుండగా గూడవల్లి బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తివద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు. ఈ దాడులలో కానిస్టేబుల్ కె శ్రీనివాసరెడ్డి, కె మధుసూధనరావు, కె వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# బోధి పాఠశాలలో వైభవంగా వార్షికోత్సవ వేడుకలు

**పిడుగురాళ్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః** మండలంలోని తుమ్మచెరువు గ్రామంలో గల బోధి పాఠశాలలో మూడో వార్షికోత్సవ వేడుకలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఏవి గురవారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తే రూ. 25 వేలు ప్రోత్సాహక బహుమతికి అందిస్తామన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సూర్య భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ కళ్యాణ్‌రామ్, కరస్పాండెంట్ సునీతారెడ్డి, హెచ్ఎం వినీల పాల్గొని ప్రసంగించారు. ఛాంపియన్ ట్రోపి విజేతలకు ప్రత్యేక బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ గురవారెడ్డిని ఘనంగా సన్మానించారు.



# ఉచిత కంటి వైద్య శిబిరం

గురజాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్తః పట్టణంలోని పెన్షన్ భవనంలో గురజాల తాలూకా పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ శరమాల హనుమంతురావులు రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యాన పెన్షన్‌దారులకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రామలింగారెడ్డి మ్యాక్స్ విజన్ కంటి వైద్యశాల అందిస్తున్న సేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌జీపీఏ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ చేతుల మీదుగా పెన్షన్దఆరులకు గుర్తింపు కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో రామలింగారెడ్డి మ్యాక్స్ విజన్ కంటి వైద్య సిబ్బంది, గురజాల, కారంపూడి, రెంటచింతల పెన్షన్‌దారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# ఘనంగా మౌలాన అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం మౌలాన అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శమన్నారు. అటువంటి నాయకుని బాటలో దేశం ముందుకు పోతుందన్నారు. ఆయన ఆశయసాధన కోసం తెలుగుదేశంపార్టీ కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు.



# రైతుని బతికించండి : ఆర్కే యాదవ్

**పెదకూరపాడు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో రైతన్నలు మానసికంగా ఆందోళనకు గురవుతున్నారని తెలుగు జనసేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆర్కే యాదవ్ అన్నారు. నియోజకవర్గంలో విస్తారంగా పెదకూరపాడు మండలం, అమరావతి మండలం, అచ్చంపేట మండలం, క్రోసూరు మండలాల్లోని రైతులు మిర్చి అధికంగా సాగు చేశారని ఆర్కే అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఎకరా మిర్చి పండాలంటే లక్షల్లో ఖర్చువుతుందని ధర చూస్తే గిట్టుబాటు ధర లేదని ఆయన అన్నారు. మిర్చికి సరైన గిట్టుబాటు ధర లేకపోతే రైతులు నష్టాలు ఊబిలో ఉంటారని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులు టమాట సాగు చేశారని, కనీసం కోత కూలీలు కూడా టమాటా రైతుకి రాని పరిస్థితి నెలకొందన్నారు. టమాటా రైతులు ఆవేదన గమనించి టమాటా పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆర్కే యాదవ్ డిమాండ్ చేశారు. పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గి, ధర కూడా తగ్గితే రైతన్న బ్రతికేది ఎలా అని ప్రశ్నించారు. ఆరుగాలం కష్టపడి శ్రమించి పని చేసిన రైతుకు నిరాశ మిగులుతుందని ఆర్కే అన్నారు. ప్రభుత్వం మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. టమాటాను ప్రభుత్వమే కొనుగోలు చేయించి రైతులకు భరోసానివ్వాలని ఆయన కోరారు.

## నూతన వస్త్ర బహూకరణ వేడుకల్లో పాల్గొన్న యువనేత శివరామ్

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మండలంలోని రెంటపాళ్ళ గ్రామ తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు, కోడెల కుటుంబానికి ఆప్తుడు, రూరల్ మండల మాజీ అధ్యక్షులు మొక్కపాటి రామచంద్రరావు మనుమరాలు, మనుమడు నూతన వస్త్ర బహూకరణ వేడుకల్లో యువనేత శివరామ్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం రామచంద్రరావుతో ముచ్చటించారు. శివరామ్ వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.



# ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి

**నరసరావుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ఆంగ్లేయుల పాలనపై పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి శనివారం ఘనంగా శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ 178వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వారికి అధ్యక్షత వహించిన కార్యదర్శి స ర్ణ చిన్నరామిరెడ్డి అభినందనలు తెలిపారు. గుర్రంపై నరసింహారెడ్డి స్వారీ చేస్తున్న ఫోటోతో పోస్టల్ స్టాంపును గతంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసి ఆయన పోరాటానికి తగిన గుర్తింపు నిచ్చిందన్నారు. తెల్ల దొరలు కుట్ర పూరితంగా వెన్నుపోటు పొడిచి ఆయనను బంధించి ఉరి తీశారని న్యాయవాది శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన మృతదేహాన్ని కోట గుమ్మానికి వేలాడదీశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, జి. వి. సాంబశివారెడ్డి, ఆరేకూటి శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, లింగారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని బాధితుల సంఘం నాయకులు కేతినేని అగస్టీన్ విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలన్నారు. జప్తు చేసిన ఆస్తుల రక్షణ బాధ్యతను సిఐడి చీఫ్ పర్యవేక్షణలో మండల, రెవిన్యూ, పోలీస్ అధికారులకు అప్పగించి కాపాడాలన్నారు. రూ.40 కోట్ల విలువైన కలపను అమ్ముకున్న రాజకీయ పార్టీల నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరిముల్లా, శ్రీనివాసరావు, జగన్నాధం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## పత్రాలు లేకుండా తిరుగుతున్న ఆటోలు సీజ్

**కొల్లూరు, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త :** పత్రాలు లేకుండా రోడ్లపై తిరుగుతున్న ఐదు ఆటోలను శనివారం సీజ్ చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి.అంకమ్మరావు తెలిపారు. వేమూరులో రెండు ఆటోలు, కొల్లూరులో మూడు ఆటోలు పత్రాలు లేకుండా నడుపుతున్నారు అట్టి ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమూరు కొల్లూరులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే అట్టి వారిపై జరిమానాలు విధిస్తామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో ఎక్కించరాదన్నారు. వాహనాలను చిన్న పిల్లలు నడపరాదని అన్నారు. నడిపినచో అట్టి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్లపై నడిచే వాహనాలకు పత్రాలు తప్పని సరిగా ఉండాలని డ్రైవింగ్ లైసెన్సులు ఉండాలని అన్నారు. లేనిచో అట్టి వారిపై భారీ జరిమానాలు విధించబడతాయని వాహన యజమానులకు హెచ్చరించారు.



## అంగన్‌వాడీలకు మెడిటేషన్‌పై శిక్షణ

**కొల్లూరు, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కార్యకర్తలకు 120రోజుల జ్ఞాన జ్యోతి శిక్షణలో భాగంగా మెడిటేషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్లు ఫజరున్నీసా విజయలక్ష్మీలు తెలిపారు. శనివారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రసాద్, నిర్మల వారిచే అంగన్‌వాడీ కార్యకర్తలకు యోగా ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యకర్తలు ధ్యానం చేయటం ద్వారా ఒత్తిడి లేని జీవితం గడపవచ్చు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా పిల్లలకు ఆటపాటల ద్వారా ఒత్తిడి లేకుండా పూర్వ ప్రాథమిక విద్యలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు, కొల్లూరు, అనంతరం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



**కొల్లూరు బాలికోన్నత జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో :** కొల్లూరు బాలికోన్నత జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ ఫజరున్నిసా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులను శనివారం జరిగాయి. ఈ సమావేశంలో రిసోర్స్ పర్సన్ సుధాకర్, సాల్మన్‌లు పిల్లల విద్య బోధనపై అంగన్‌వాడీలకు పలు సూచనలు చేశారు. శిక్షణ పొందిన కార్యకర్తలు వారు నేర్చుకున్న అనుభవాలతో పిల్లలకు విద్యా బోధనలు చేయాలన్నారు. ప్రభుత్వం అందించిన వస్తువులతో పిల్లలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రసాద్ నిర్మల వారిచే అంగన్‌వాడీ కార్యకర్తలకు యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫజరున్నీసా, సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమృతలూరులో ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

**అమృతలూరు, ఫిబ్రవరి 22, ప్రభాత వార్త:** ఈ నెల 27వ తేదిన జరిగే కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ కేంద్రం అమృతలూరు జడ్‌పి హైస్కూల్‌ను తహశీల్దార్ కె.నెహ్రూబాబు, ఎంపిడిఓ బి.మారుతీ శేషమాంబ, ఎస్ఐ జానకీ అమరవర్ధన్ శనివారం తనిఖీ చేశారు.. హైస్కూల్‌లో 391, 392 రెండు పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. పోలింగ్ బూత్‌లో ఓటర్లు ఇబ్బంది పడకుండా బెసిక్ సౌకర్యాలు వెంటిలేషన్, కరెంటు, ప్యాన్, పోలింగ్ నిర్వహణ సిబ్బందికి తగిన సౌకర్యాలను పరిశీలించారు. మంచినీరు, టాయిలెట్స్ సౌకర్యాలను పరిశీలించారు. ఓటు హక్కు వినియోగించుకునే దివ్యాంగులైన ఓటర్‌లకు వీల్‌చైర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మండలంలో మొత్తం 1577 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని చెప్పారు. ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ నెహ్రూబాబు కోరారు.




## గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎంపిపి నరేంద్రకుమార్

**అమృతలూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** వేసవి కాలంలో త్రాగునీటి కొరతను దృష్టిలో పెట్టుకొని మండలంలోని అన్ని గ్రామల ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి రాపర్ల నరేంద్రకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి రాపర్ల నరేంద్రకుమార్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి వివిధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపిపి రాపర్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పారిశుద్యానికి, త్రాగునీటికి ప్రాధ్యాన్యత ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లో చెత్తచెదారం రోడ్లు మీద వేయకుండా డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ఆనందబాబు చొరవ తీసుకొని ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా కూచిపూడి-గోవాడ ఆర్‌అండ్‌బి రోడ్డు నిర్మాణం చేసి నందుకు ఎమ్మెల్యే ఆనందబాబుకు అభినందనలు తెలిపారు. ఎంపిడిఓ బి.మారుతీ శేషమాంబ మాట్లాడుతూ ఈ నెల 26వ తేది మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల మండల స్థాయి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి రవిశంకర్, ఎఓ మహాలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గోవాడ తిరునాళ్లకు ఛీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా అనుపమ నియామకం

**అమృతలూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే తిరునాళ్ల ఉత్సవాలకు ఛీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా తెనాలి వైకుంఠపురం దేవస్థానం సహాయ కమీషనర్ అనుపమను నియమిస్తూ తిరుపతి రీజనల్ జాయింట్ కమీషనర్ చంద్రశేఖర్ అజాద్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఇఓ బి.అశోక్‌కుమార్ తెలిపారు.



## చికెన్ షాపులు వెలవెల.. దుకాణ యజమానులు గిలగిల

**రెంటచింతల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** బర్డ్‌ఫ్లూ భయంతో జనం చికెన్‌కు దూరంగా ఉండటంతో సాధారణ రోజుల్లో రద్దీగా ఉండే చికెన్ దుకాణాలు బర్డ్ ఫ్లూ దెబ్బకు రెంటచింతల మండలంలోని చికెన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. దీంతో మండలం లోని చికెన్ దుకాణాల యజమానులకు షాపు అద్దెలు వెళ్లటమే కష్టంగా ఉందని వారు శనివారం ప్రభాతవార్తతో ఆవేదన వెలిబుచ్చారు. వివరాల్లోకి వెళితే వార్తల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిందని తెలుసుకున్న ప్రజలు చికెన్‌కు బదులు మటన్, చేపల దుకాణాల వైపు దృష్టిసారించారు. ఇదే అదనుగా భావించిన మటన్ దుకాణదారులు కేజీ ధర రూ.700 ఉన్న మటన్ కాస్త వెయ్యి రూపాయలకు పెంచారు. దీంతో సామాన్య ప్రజలకు చుక్క ఎదురైనట్లుంది. చికెన్ తిని అనారోగ్య సమస్యలు ఎదుర్కోవడం కన్నా మాంసం, చేపలు తిని ఆరోగ్యంగా ఉందామని మాంసం ప్రియులు భావిస్తున్నారు. సాధారణ రోజుల్లో చికెన్ ధర రూ.240 వరకు ఉండగా, నేడు కిలో ధర రూ.130లకు తగ్గినా కొనుగోళ్లు లేకపోవడంతో చికెన్ దుకాణదారులు నైరాశ్యంలో ఉన్నారు. చికెన్ అమ్మకాలు భారీగా తగ్గడంతో మెయింటెన్ చేయడం కష్టతరంగా ఉందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల ప్రజలకు చికెన్ తినడం మంచిదా కాదా అని తగు సూచనలు ఇవ్వాలని రెంటచింతల మండల ప్రజలు వేడుకుంటున్నారు.



## ఆలపాటి విజయం కాంక్షిస్తూ కూటమి నేతల ప్రచారం

**గురజాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కృష్ణా గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ కూటమి నేతలు శనివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. జేపీసీ కాలనీ, క్రిస్టియన్ పేట, బాలాజీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు, టీడీపీ పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, పదో వార్డు కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, శరమాల హనుమంతురావు, పోటు నాగేశ్వరరావు, కత్తి చలమరాజు, చింతకాయల కళ్యాణ్, కత్తి ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ మిల్స్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

**నరసరావుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పట్టణ, పరిసర ప్రాంతాలలోని ఆయిల్ మిల్లులపై రాష్ట్ర జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఏకకాలంలో ఎనిమిది బృందాలుగా ఏర్పడి శనివారం తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ నరసరావుపేటలో నూనె కల్తీ జరుగుతుందని వచ్చిన ఫిర్యాదులు, మీడియాలో కథనాలపై స్పందించి దాడులు నిర్వహించామన్నారు. నాలుగు రైస్ బ్రౌన్‌ఆయిల్, రెండు సన్‌ఫ్లవర్ ఆయిల్, మూడు గ్రౌండ్ నట్ ఆయిల్, ఒకటి పామాయిల్ శాంపిల్స్‌ను తీసుకోవడం జరిగిందన్నారు. వాటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపామని, ఆహార భద్రత, రక్షణ చట్టం ప్రకారం నాణ్యత ఉండాలన్నారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. రీ ప్యాకింగ్ యూనిట్స్‌లో ఆయిల్ స్టోరేజ్ ట్యాంక్‌లు శుభ్రంగా లేవని పూర్ణచంద్రరావు తెలిపారు.



## ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలి

**నిజాంపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి బలపర్చిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని కూటమి నాయకులు ఆర్‌డిఓ రామలక్ష్మీని, తహశీల్దార్ షాకీర్‌పాషాలను కోరారు. శనివారం నిజాంపట్నం వచ్చిన ఆర్‌డిఓ రామలక్ష్మిని కూటమి నాయకులు కార్యకర్తలు కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, ఉన్నారు.

## రైతులు ముందస్తు ప్రణాళికతో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

**బాపట్ల, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** రైతులు ముందస్తు ప్రణాళికతో రైతు యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా మినుములో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా. జి శివన్నారాయణ అన్నారు. శనగ మరియు మినుము చిరు సంచుల రకాలపై ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు శనివారం కారంచేడు మండలంలో పరిశీలించారు. కారంచేడు మండలం లోని తెమిడిదిపాడు గ్రామంలో బొడావుల సత్యన్నారాయణకు చెందిన పొలంలో బాపట్ల ఏరువాక కేంద్రం అద్వర్యం లో సాగుచేస్తున్న శనగ మరియు మినుము చిరు సంచుల రకాలపై క్షేత్ర స్థాయిలో ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు శనగ నూతన రకాలైన ఎన్బీజీ 833 ఎన్బీజీ 119 ఎన్బీజీ 1267 రకాలను చెక్ రకం జేజి 11 తో పరిశీలించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ శనగ రకాలలో ఎన్బీజీ 1267 యంత్ర కోతకు అనువైన రకం అని అలాగే మిగతా రకములతో పోలిస్తే అధిక దిగుబడులు ఇస్తుంది అని గమనించడం జరిగిందన్నారు. గుంటూరు లామ్ ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ పరిశోధన స్థానము, రైతులు ముందస్తు ప్రణాళికతో రైతు యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా మినుము లో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. కార్యక్రమములో సహా పరిశోధన సంచాలకులు డా.ఎన్ వి వి ఎస్ దుర్గ ప్రసాద్, ఏరువాక కేంద్ర బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ డా. బాల మురళీధర్ నాయక్, కారంచేడు మండల వ్యవసాయ అధికారి వి శివనాగ ప్రసాద్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు



## కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్ళ జాతర కొరకు జరుగుతున్న ఏర్పాట్లను, భక్తులకు సంబంధించిన సౌకర్యాలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ బాధ్యతగా ప్రజలకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్న స్నానాల ఘాట్‌ను, మెట్ల పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మెట్లు ఏర్పాటు చేయడంలో మరింత జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కోటప్పకొండ జంక్షన్ వద్ద ఉన్న శివుని విగ్రహం వద్ద ఫౌంటెన్ పూర్తి స్థాయిలో పని చేసే విధంగా చూడాలన్నారు. అదే విధంగా రోడ్డు మార్గాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏకాదశి నుండే భక్తుల రాక కోటప్పకొండకు ప్రారంభమవుతుందని, అసం పూర్తిగా పనులు ఉన్నాయన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడిం దన్నారు. 26వతేదీన ముఖ్య మంత్రి స్వయంగా కోటప్పకొండకు వస్తారని చెప్తున్నారని, అయితే దీనిపై సరైన సమాచారం అధికారుల వద్ద లేదన్నారు. ట్రాఫిక్ పరంగా భక్తుల దర్శనం వంటి వాటితో పాటు విఐపి పాసులు, ఆర్టీసీ స్పెషల్ బస్సులపైనా క్లారిటీ లేదన్నారు. ఇంకా 72 గంటలు మాత్రమే సమయం ఉండగా అధికారులు పనులను వేగంగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. తొలుత ఆయన త్రికోటేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కనకా పుల్లారెడ్డి, పచ్చవ రవీంద్ర, పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిపి తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



## రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలపాటిని గెలిపించాలి

**చెరుకుపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్ర అభివృద్ధి కోసం పట్టభద్రులుగా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్క పట్టభద్రునిపై ఉందని టిడిపి సీనియర్ నాయకులు ఎంఆర్‌కె మూర్తి అన్నారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలో ఇంటింటి ప్రచార కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాలలో వైకాపా ప్రభుత్వం వల్ల అభివృద్ధి కుంటుపడిందని దీనిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో తెదెపా నాయకులు దివి రాంబాబు, విస్సంశెట్టి శ్రీనివాసరావు, లీలాకృష్ణ, రాజేష్, ఆంజనేయులు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రమా చిట్‌ఫండ్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### -మాజీ కౌన్సిలర్ ఎరసాని శ్రీరామమూర్తి

**పొన్నూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రమా చిట్‌ఫండ్ నిర్వాహకులు మన్నేపల్లి చంద్రశేఖర్, అతని భార్య రమాదేవి చిట్‌ఫండ్ పేరుతో ఎంతో మంది వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు నగదు చెల్లించేవిధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ ఎరసాని శ్రీరామమూర్తి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను తెలగపాలెంలో పాత ప్లాస్టిక్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. తనను నమ్మబలికి చిట్‌ఫండ్‌లో సభ్యునిగా చేరాలని, చిట్‌ఫండ్‌ను నిజాయితీగా నిర్వహిస్తామని నమ్మబలికినట్లు చెప్పారు. వారు నిర్వహించే చిట్స్‌లో నన్ను సభ్యునిగా చేయించి రూ.5లక్షల చిట్స్‌లో 25నెలల చీటిపాటలో నెలకు రూ.20చొప్పున 25మంది సభ్యులతో ప్రతి నెలా ఒకటో తేదీన పాట నిర్వహించి కమిషన్ పోను నెలసరి వాయిదా మొత్తం కట్టించుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా రూ.2.10లక్షలు విలువ గల 30నెలల నిడివిగల 2చిట్స్‌లలో నెల 1కి రూ.7వేలు చొప్పున రెండు చిట్స్‌లలో రూ.14వేలు చొప్పున నెలకి చెల్లించేవిధంగా చిట్స్‌లలో నన్ను సభ్యునిగా చేర్చుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా చిట్స్ రిజిస్ట్రార్ వద్ద దాఖలు చేయుటకు ప్రింటెడ్ ఫారాలపై సంతకాలు పెట్టించుకొని నా ఫోటోలు, నా ఆధార్ కార్డు కాపీని కూడా తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నన్ను మోసం చేసినట్లుగానే తమ మాటలతో మన్నేపల్లి చంద్రశేఖర్, అతని భార్య రమాదేవి నమ్మించి చిట్స్‌లో చేర్చుకున్నారన్నారు. నాకు సంబంధించిన చిట్స్ గత సంవత్సరం డిసెంబర్‌లో ముగిసినవన్నారు. అయితే ఇంత వరకు తాను చెల్లించిన చిట్స్‌కు సంబంధించిన డబ్బులను ఇంత వరకు ఇవ్వలేదని చెప్పారు. నేను వారిని నా డబ్బులు అడుగుతాననే ఉద్దేశంతోనే ఇల్లు, ఊరు వదిలిపెట్టి జనవరి 5వ తేదీ సాయంత్రం కుటుంబ సమేతంగా పొన్నూరు నుండి పారిపోయినట్లు శ్రీరామమూర్తి ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు చిట్ నిర్వాహకులు కోట్లాది రూపాయలు ఖాతాదారులకు చెల్లించకుండా వెళ్ళినట్లు తెలుస్తుంది. పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకొని నాకు సంబంధించిన చిట్స్ డబ్బులను ఇప్పించాలని శ్రీరామమూర్తి పోలీసులను కోరారు.

## కార్డుదారులందరికీ ఈకెవైసి చేయించాలి

### -రేషన్ పంపిణీలో అవకతవకలను సహించం -డీలర్లు ఆదరైజేషన్ రెన్యువల్ చేయించుకోవాలి

### -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ప్రజా పంపిణీ వ్యవస్థను పక్కా నిర్వహించ డంలో డీలర్లు, ఎండియు ఆపరేటర్లే కీలక మని, వీరు విధులు సక్రమంగా నిర్వహించక పోతే వ్యవస్థ మొత్తానికి చెడ్డపేరు వస్తుందని, ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పక్కాగా కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగిన డీలర్లు, ఎండియు ఆపరేటర్లు, విఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. విఆర్వోలు కార్డుదారులందరికీ నూరుశాతం ఇకెవైసి చేయించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెలాఖరులోపు కార్డుదారులందరికీ ఈ విధానాన్ని పూర్తి చేయాలన్నారు. రేషన్ పంపిణీలో ఎండియు ఆపరేటర్లు సక్రమంగా వ్యవహరించి సకాలంలో రేషన్‌ను పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా పనిచేయాలన్నారు. తూనికలు, కొలతల్లో ఎలాంటి వ్యత్యాసం లేకుండా ఖచ్చితంగా అందజేయాలన్నారు. రేషన్ డీలర్లు తమకు సంబంధించిన ఆదరైజేషన్‌ను రెన్యువల్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో సిఎస్‌డిటీ మాదిరాజు వెంకట్రావు పాల్గొన్నారు.




## దేశవ్యాప్తంగా మందుల లభ్యత సరళతరం

**విజయవాడ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** భారతదేశవ్యాప్తంగా అండమాన్ నుండి అరుణాచల్ వరకు మందుల లభ్యతను సరళతరం అయిందని అమేజాన్ ఫార్మశీ ప్రతినిధులు తెలిపారు. తమ మార్కెట్ ద్వారా లైసెన్స్ వున్న విక్రేతలతో కస్టమర్లను కలపడానికి, 100 శాతం సేవలందించడానికి, ఆన్‌లైన్ మందుల ఆర్డర్‌లకు విశ్వసనీయమైన ఇంటివద్ద డెలివరీలతో తాము దేశవ్యాప్తంగా మందుల లభ్యతను సులభతరం చేశామన్నారు.

## వైకాపా ఉనికి కోసమే చౌకబారు ఆరోపణలు : ఎమ్మెల్యే

**మాచర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** వైకాపా ఉనికి కోసమే వైకాపా నాయకులు చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల పట్టణంలోని పెన్షనర్ అసోసియేషన్ భవనం ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. అరాచకాలు సిగ్గుమాలిన చర్యలతో రాష్ట్ర ప్రజలు గడచిన సార్వత్రిక ఎన్నికల్లో దిమ్మతిరిగే ఫలితాలు ఇచ్చినా వారిలో మార్పు కనిపించలేదని అన్నారు. సభ్య సమాజంలో ఉన్నామని ఉచ్చ నీచాలు మరచి బట్టలూడదీస్తానని మాట్లాడటం వారి మానసిక స్థితికి అద్దం పడుతుందన్నారు. ఒక్క అవకాశం అని అడిగి ప్రజలకు చుక్కలు చూపించారని, 2.0తో ఇంకా ఏమి చూపిద్దామని అనుకుంటున్నారని ప్రశ్నించారు. పిచ్చి ప్రేలాపనలు ఆపాలని అధికారంలో ఉన్నామనే భ్రమలో రౌడీ రాజ్యం అమలు చేద్దామని అనుకుంటే చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేసే నాయకులు ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎన్డీయే కూటమి నాయకులు ఎనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, సయ్యద్ అన్వర్‌బాష, గుండాల శ్రీనివాసరావు, ఒర్సు క్రాంతికుమార్, మొహిద్దీన్, ప్రకాష్, మాచర్ల వాసు, సయ్యద్ ఖాజా, నాగూర్‌బాషా, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



## చిలకలూరిపేటకు రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేయాలి

**చిలకలూరిపేటటౌన్, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** చిలకలూరిపేట ప్రాంతానికి రైల్వేలైన్ అత్యవసం మని, ఆ దిశగా రానున్న శాసనమండలి సమా వేశాలలో రైల్వేలైన్ అంశంపై శాసనమండలిలో స్పందించాలని కోరుతూ సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను శనివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని చాలా కాలం నుంచి ఎన్నో ప్రయత్నాలు జరిగాయని, దశాబ్దాల కిందటే నాటి శాసన సభ్యులుగా ఉన్న సోమేపల్లి సాంబయ్య అప్పటి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న ఆచార్య ఎన్‌జిరంగా దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంతానికి రైల్వే ఆవశ్యకత గురించి తెలియచేశారన్నారు. చిలకలూరిపేటకు రైల్వేలైన్ రావటం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆయన తెలిపారు. రైల్వే సాధన సమితి కన్వీనర్ షేక్ సుభాని మాట్లాడుతూ చిలకలూరిపేట రైల్వేలైన్‌కు ఏర్పాటు విషయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల నాయకులు, పారిశ్రామిక వేత్తల సైతం సంఘీభావం ప్రకటించారని తెలిపారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రైల్వేలైన్ ఏర్పాటుకొరకు కార్యచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా ఇన్‌చార్జి తాళ్లూరి బాబూరావు, చెరుకుపల్లి నిర్మల, అడపా మోహన్‌రావు, షేక్ బాజీ, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా తెదేపా నాయకులు విస్తృత ప్రచారం

**చిలకలూరిపేట, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు టిడిపి నాయకులు శనివారం పలు ప్రైవేటు విద్యాసంస్థలు, తదితర ప్రాంతాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. అవగాహన, అనుభవం అపారంగా ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. పట్టణంలోని కృష్ణవేణి స్కూల్, మోడరన్, బ్రిలియంట్, విజ్ఞానవిహార్ పాఠశాలలలోని ఉపాధ్యాయులను మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు కలిసి మాట్లాడుతూ యువత, రైతాంగ సమస్యల పట్ల పూర్తి అంకితభావం కలిగిన వ్యక్తి రాజేంద్రప్రసాద్ అని ఆయనను గెలుపుకు అందరం కృషి చేయాలని కోరారు. ఆయనకు మద్దతు తెలిపేందుకు పట్టభద్రులు సిద్ధంగా ఉన్నారన్నారు. విలువలతో కూడిన వ్యక్తులను శాసనమండలికి పంపించాలని, అందుకు పట్టభద్రులందరూ ఆలపాటికి మద్దతివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త తోట రాజారమేష్, బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి జయరామిరెడ్డి, టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు అమరా రమాదేవి, అమరా మణికుమార్, షేక్ మహ్మద్ రఫీ, మక్కెన నరసింహరావు, ఎస్ఎస్ సుభాని, మద్దుమాల రవి, గోగినేని నాగేశ్వరరావు, తూబాటి శ్రీహరి, ఆరె మల్లి, శిరీష్, జనసేన పార్టీ నాయకులు మునీర్ భాష, సుభాని పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు బాసటగా స్కాలర్‌షిప్ టెస్టు

**యడ్లపాడు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకి ఉన్నత విద్యను అందించేందుకు బాసట సామాజిక సాంస్కృతిక వేదిక అధ్వర్యంలో 2024-25విద్యా సంవత్సరంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా చాలెంజ్ స్కాలర్‌షిప్ టెస్ట్ శనివారం లూథరన్ ఉన్నత పాఠశాల యడ్లపాడులో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇవో నాగరత్నం, ఎస్సై వి బాలకృష్ణ పాల్గొని పరీక్ష పేపర్లను విడుదల చేసారు. ఈ పరీక్షలో పాఠశాలల నుండి మొత్తం 304మంది హాజరు కావటం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఎంఇవో మాట్లాడుతూ విద్యార్థులకు ఈ టెస్ట్ ద్వారా అర్థిక సహాయాన్ని అందించడం పేద విద్యార్థులకు ఉచిత ఉపకారమన్నారు. తదుపరి బాసట విద్యా కమిటీ కన్వీనర్ కల్లూరి శ్రీనివాసు వివరిస్తూ పేద విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయటానికి ఈ టాలెంట్ టెస్ట్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సామినేని శ్రీనివాసరావు, బాసట అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు, హెచ్‌ఎమ్ టి సుగంధరరావు, డాక్టర్ భవ్యతేజ, బాసట సంస్థ కోశాధికారి కేత రామబ్రహ్మం, కార్యదర్శులు ముత్తవరపు రవీంద్రబాబు, పోపూరి శ్రీనివాసరావు, సభ్యులు చెరుకేరి సృజన, బచ్చు రాజేష్, సాగి వెంకటార్జున్, చెన్నుపాటి హనుమంతరావు, ముత్తవరపు కృష్ణమూర్తి, బందెల పీటర్, కోయ రామోజీరావు, చొంటినేని రంగారావు రావి సురేష్, ప్రభుత్వ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రజలు వలస పోకుండా జీవనోపాధిని కల్పించాలి : ఎండిఓ శ్రీనివాసరావు

**కర్లపాలెం, ఫిబ్రవరి22, ప్రభాతవార్త:** కర్లపాలెం మండలం పెద్ద గొల్ల పాలెం పరిధిలోని యారంవారిపాలెం హబిడేషన్ పరిధిలో ఉన్నటువంటి రెండు చోట్ల జరుగుతున్న కరువు పనులు పరిశీలించిన కర్లపాలెం ఎంపీడీవో శ్రీనివాసరావు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం పొలం పనులు లేకపోవడం వలన ఎంతోమంది కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు నెలకొంటున్నాయని ఇలాంటి వారికి జీవనోపాధిని కల్పించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఎన్ ఆర్ జి ఎస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాంటి వారికి పని కల్పించే బాధ్యత మీపై ఉందని తెలియజేశారు. కరువు పనులు కల్పించి వారు వలస పోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.



## మిరపలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై శిక్షణ

**గురజాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండలంలోని గంగవరంలో మిరపలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ఆడక్టర్ వి సైదానాయక్ మిరపలో నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ప్రస్తుతం మిరప కోతలు జరుగుతున్నాయన్నారు. మిరప కోతల అనంతరం మిరపకాయలను శిల్పాలిన్ పట్టలపై ఆరబెట్టుకోవాలని, సోలార్ డ్రైయర్స్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



# బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

**-జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ మాజీ చైర్పర్సన్ పద్మశ్రీ శాంతా సిన్హా**



**మంగళగిరి,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా వేళ్లూనుకున్న బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ మాజీ చైర్పర్సన్,పద్మశ్రీ శాంతాసిన్హా పిలుపునిచ్చారు.ఇందుకోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రమైన చట్టాలతో ముందుకు సాగాలని ఆమె సూచించారు.చదువుతోనే బాల కార్మిక వ్యవస్థకు విమోచన పేరిట ఏపి ఎన్ఆర్ఐ యూనివర్సిటీలో శనివారం ప్రత్యేక చర్చాగోష్టి కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాంతా సిన్హా ఉద్యోగులు,విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.గడచిన 30 ఏళ్ళుగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎంవి ఫౌండేషన్ ద్వారా చేస్తున్న పోరాటాలను వివరించారు. నిరక్షరాస్యత పేదరికం వల్లనే బాల కార్మికులు గణనీయంగా పెరుగుతున్నారని ఆమె పేర్కొన్నారు. విద్యావకాశాలను మెరుగు పరచడం బడికి దూరంగా ఉన్నపిల్లలకు ప్రత్యేక విద్యా సదుపాయాలు కల్పించడం ద్వారా బాల కార్మికులను తగ్గించవచ్చు అన్నారు. అంతేకాకుండా రాత్రి బడులు నిర్వహించడం బ్రిడ్జికోర్సులు సెంటర్లు ఏర్పాటుచేయడం వంటివి ప్రభుత్వాలు చేపట్టాలని సూచించారు.ఇందుకోసం రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించి బాల కార్మిక రహిత సమాజ స్థాపనకు నడుంబిగించాలని కోరారు.ఎన్ఆర్ఐ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్కుమార్ అరోరా యూనివర్సిటీ ప్రగతిని వివరించారు.ఈ సందర్భంగా డాక్టర్ శాంతా సిన్హాను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్కుమార్,డీన్ విష్ణుదత్,డీన్ డాక్టర్ సివి టామీ,ఓస్డీ డీన్ డాక్టర్ రంజిత్ థాపా తదితరులు పాల్గొన్నారు.

# 7వ తరగతి విద్యార్థి దీక్షితకు స్టేట్ ర్యాంకు

**పొన్నూరు,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** సర్ సివి రామన్ ఒలంపియాడ్ ఎగ్జామ్ నందు శ్రీవేద హైస్కూల్ 7 వ తరగతి విద్యార్థి బి.దీక్షిత స్టేట్ ర్యాంకు సాధించింది.ఈ ఎగ్జామ్ నందు దాదాపుగా ఒక లక్షా 20 వేల మంది పరీక్షకు హాజరు కాగా శ్రీవేద హైస్కూల్ నుండి 4 నుండి 10 వ తరగతి విద్యార్థులైన 8 మందికి జిల్లా స్థాయి ఫస్ట్ మరియు సెకండ్ స్థానాలు సాధించారు.ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ అంబటి వెంకటేశ్వరరావు,ప్రిన్సిపాల్ అంబటి ఏడుకొండలు,అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

# నేడు అంకమ్మతల్లి 56వ తిరునాళ్ళ మహోత్సవం

**రాజుపాలెం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అంకమ్మతల్లి 56వ తిరునాళ్ళ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలియజేశారు. తిరునాళ్ళ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని, అమ్మవారి దీవెనలు పొందాలని కమిటీ సభ్యులు తెలియజేశారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారన్నారు.

# కిడ్నాప్ కేసులో నిందితుడు వైకాపా కౌన్సిలర్ అరెస్టు

**-త్రీటౌన్ సిఐ రమేష్బాబు**



**తెనాలి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** త్రీటౌన్ పరిధిలో ఈనెల 5వ తేదిన మస్తాన్వలి అనే కార్పెంటర్ను కిడ్నాప్ చేసి భౌతిక దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సిఐ ఎస్.రమేష్బాబు పేర్కొన్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో సిఐ రమేష్బాబు కేసు పూర్వ పరాలను వివరించారు. ఈ కేసులో ఏ-1, ఏ-2ముద్దాయిలుగా ఉన్న, అహ్మద్ బేగ్, రహమాన్లను శనివారం ఉదయం బాలాజీరావుపేటలో అహ్మద్ బేగ్ నివాసం వద్ద లభించిన సమాచారం మేరకు అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను మీడియా ముందు హాజరు పరిచారు. ఈ సమావేశంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అవధూత పీఠంలో కోటిదత్త హోమ యజ్ఞపూజలు

**తెనాలి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** బ్రహ్మ విష్ణు పరమేశ్వర స్వరూపుడైన శ్రీ దత్తాత్రేయ స్వామి వారి 12అక్షరముల మూలమంత్రముతో కోటి దత్త హోమ పూజలు అవధూత దత్త పీఠంలో మంగళ వాయిద్యముల వేద మంత్రుల నడుమ విశేషంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పెదరావూరు గ్రామంలో జటిలేశ్వర 18అడుగుల దత్త పీఠం ప్రాంగణంలో మైసూరు దత్త పీఠం వ్యవస్థాపకులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్యానుగ్రహంతో 9కోట్ల శ్రీ దత్త హోమ పూజలలో భాగంగా, శనివారం నుండి పెదరావూరు అవధూత దత్త పీఠంలో సప్తకోటి దత్త హోమం పూజలను, రుత్వికులు యాగ్నిక బ్రాహ్మణులుగా పూజలను ప్రారంభించారు. బుర్రా భాస్కరదత్త ఆధ్వర్యంలో మంటపారాధన, కలశస్థాపన, నవగ్రహ మంటపారాధన, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్టాపనలతో, దేవతాముఖ ప్రతిష్ఠ హోమపూజలలో 34మంది రుత్వికులు, ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి హాజరై హోమపూజలు నిర్వహించారు. నవకోటి దత్తహోమ పూజలలో భాగంగా ఏడవ కోటి దత్తహోమంలో చివరి నాలుగు లక్షల దత్తహోమ పూజలు, పెదరావూరు అవధూత ఆశ్రమంలో ఈనెల 24వరకు నిర్వహించనున్నారు. మార్చి 1వ తేది, మైసూరు దత్త పీఠంలో సప్తకోటి దత్తహోమ పూర్ణాహుతి, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి సమక్షంలో నిర్వహించనున్నట్లు రుత్వికులు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు దత్త కవచ పారాయణ చేశారు. హోమ పూజల విశిష్టతను మహిళా సభ్యురాలు కన్యాకుమారి వివరించారు. కార్యక్రమంలో ఆర్.రాధాకృష్ణ సుందర, హవిర్యాజి ఆర్.రవితేజ, ఎర్రగుంట్ల సత్యన్నారాయణమూర్తి, రాజ్రామ్, దుగ్గిరాల బాబుశర్మ, విష్ణుబొట్ల చైయినులు, ఆశ్రమ పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.



# పింఛనుదారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే

**మాచర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** పింఛనుదారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల పట్టణంలోని పింఛనుదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పింఛనుపై ఆధారపడి జీవించే వారిని అనేక ఇబ్బందులకు గురి చేశారని, సకాలంలో పెన్షన్ అందక మానసిక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. గత పాలకులు అర్థికవ్యవస్థను విచ్ఛిన్నం చేసినప్పటికీ పెన్షనర్లకు సకాలంలో వారి ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు అనేక పరిశ్రమలు తీసుకురావడం జరుగుతుందని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పెన్షన్ దారులకు పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్కు మద్దతుగా నిలిచి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

# జగన్పై కేసు పెట్టడం దారుణం : మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



**మాచర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మాజీ సీఎం జగన్ రైతులను ఓదార్చడానికి వెళ్తే కేసు పెట్టడం దారుణమని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమపై కూడా కేసు పెట్టడం నీచమైన చర్య అన్నారు. కష్టాల్లో రైతులకు అండగా ఉండాల్సింది పోయి పరామర్శకు వెళ్లిన మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తెదేపా నేతలు ఏసీ గదుల్లో కూర్చొని మాట్లాడటం కాదు.. మిర్చియార్డుకు వచ్చి రైతుల బాధలు తెలుసుకోవాలన్నారు.

# స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అనాథ శవానికి అంత్యక్రియలు



**మాచర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి శవానికి స్థానిక మున్సిపాలిటీ సహాయంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. గత అయిదు రోజులక్రితం ఎమ్మార్వో ఆఫీసు దగ్గర 50 ఏళ్ల వ్యక్తి పడిపోయి ఉండటాన్ని గుర్తించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లేసరికి చనిపోయారు. పోలీసుల దృష్టికి వెళ్లడంతో ఆచూకీ తెలిసినవాళ్లు పట్టణ పోలీసు స్టేషన్లో సంప్రదించాలని ప్రకటనలు ఇచ్చారు. అయిదు రోజులు దాటినా ఎవరూ రాకపోవడంతో, అంత్యక్రియలు జరపడానికి ట్రస్టుకు అప్పగించారు. ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవనాసి నాసరయ్య, టీచర్ గంద్రకోట శివసుందర్ ప్రసాద్, శివ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**మాచర్ల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ఈ నెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ప్రచారాన్ని శనివారం దుర్గి మండలంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు కార్యాలయాల్లో పనిచేస్తున్న పట్టభద్రులను ఆయన కలిసి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. మండల కేంద్రంలోని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ప్రభుత్వం రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వారికి వివరించారు. ప్రతిఒక్కరూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అందుకు ఎన్డీయే కూటమి అభ్యర్థులకు మద్ధతు తెలపాలని కోరారు.

# ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

**-రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ మార్కండేయబాబు**

**గురజాల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ఈనెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్, నరసరావుపేట పార్లమెంట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్త వడ్రానం మార్కండేయబాబు కోరారు. శనివారం దాచేపల్లి పట్టణంలో జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు ఆధ్వర్యాన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాఆరు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి జనసేన పూర్తి మద్దతునిస్తుందన్నారు. మొదటి ప్రాధన్యత ఓటును ఆలపాటికి వేసి గెలిపించాలన్నారు. ఆలపాటి గెలుపునకు నేతలు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అంకారావు మాట్లాడుతూ శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటి గెలుపునకు కృషి చేస్తామన్నార. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత భలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అంబటి మల్లి,బుడదల శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి దూదేకుల కాశింసైదా, మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పాముల కిషోర్, ఉప్పిడి నరసింహారావు, కౌన్సిలర్ చింతకాయల కళ్యాణ్, తక్కెలపాడు సర్పంచ్ కిచ్చంశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి కార్యక్రమం



**కర్లపాలెం,ఫిబ్రవరి22,ప్రభాతవార్త:** కర్లపాలెం ఎంపీరాజు పాలెం హైస్కూల్లో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిసు న్న జ్ఞానజ్యోతి కార్యక్రమం 4 వ రోజు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. .ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు మాట్లాడుతూ మేదాభివృధికి కృత్యాలు, కథ చెప్పడం ద్వారా సంభాషణ ,సామాజిక భావోద్వేగాభివృది జరుగుతుందన్నారు.పిల్లలకు పుట్టినరోజు వేడుకలు చేయడం ద్వారా పిల్లలు బడి మానివేతను నివారించ్చవచ్చని రిసోర్స్ పర్సన్స్ గుడారంకయ్య, రాజేష్ లు అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీస్ సూపర్వైజర్ నాగమల్లేశ్వరి ,కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్



**నరసరావుపేట క్రైం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పట్టణంలో ఆటోలను నడిపే డ్రైవర్లకు శనివారం టూటౌన్ సి.ఐ. హైమారావు, ఎస్.ఐ. అశోక్లు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, అలాగే అతివేగంతో వాహనాలను నడపరాదని, డ్రైవర్ తప్పక లైసెన్స్, వాహన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. అదే విధంగా ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, అతివేగం ప్రమాదకరమని తెలియజేశారు. ఎవరైనా పోలీస్ నిబంధనలను అతిక్రమిస్తే అట్టి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని టూటౌన్ సి.ఐ. హైమారావు, ఎస్.ఐ. అశోక్లు తెలియజేశారు.

# ఇంటింటి చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్



**నకరికల్లు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన నకరికల్లులో ఇంటింటి చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ను శనివారం ఈవోపిఆర్డి కె.వి.శివప్రసాద్ పర్యవేక్షించారు. నూరుశాతం ఇంటింటి నుండి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శులకు ఆయన ఆదేశాలిచ్చారు. ప్రతి గృహం నుండి చెత్త సేకరణ ఖచ్చితంగా జరగాలన్నారు. పల్నాడు జిల్లా గ్రామ పంచాయితీ అధికారి విజయభాస్కరరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని రూపెనగుంట్ల, దేచవరం గ్రామాలలో జరుగుతున్న చెత్త సేకరణ వివరాలను పరిశీలించామన్నారు. ఎంపిడిఓ జి.కాశయ్య ఆదేశాలను సచివాలయ సిబ్బందికి తెలియజేశామన్నారు.

# వాగ్దేవి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు



**నరసరావుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** వాగ్దేవి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, డైరెక్టర్లు కె.రామకోటేశ్వరరావు, కపులవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పి.అచ్యుతరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్బాబు హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా దర్శి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ రామాంజనేయులు కార్యక్రమంలో విద్యార్థులకు తమ సందేశం అందించారు. వాగ్దేవి విద్యార్థులు రాష్ట్ర, జాతీయ ర్యాంక్లను సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జాతీయ ర్యాంక్లతో ప్రతి ఏడాది అత్యుత్తమ కళాశాలల్లో సీట్లు సాధించడం గొప్ప విషయమన్నారు. అదే విధంగా ఆటల పోటీలలోనూ వందకు పైగా మెడల్స్ను విద్యార్థులు సాధించడం విశేషమన్నారు. ఉన్నత విద్యకు వాగ్దేవి కళాశాల వేదిక అవ్వడం పట్ల డైరెక్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్బాబు అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కోటప్పకొండకు యాభై వేల వాటర్ బాటిల్స్



**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కోటప్పకొండకు యాభై వేల వాటర్ బాటిల్స్ను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్బాబు శనివారం తెలియజేశారు. ఈ నెల 24న ఏకాదశితో పాటు 26న కోటప్పకొండ తిరునాళ్ళ మహోత్సవానికి వచ్చే భక్తుల కొరకు యాభై వేల వాటర్ బాటిల్స్ను అందిస్తున్న వ్యాపారులకు ఎమ్మెల్యే అరవింద్బాబు అభినందనలు తెలియజేశారు. వాటర్ బాటిల్స్తో ఉన్న లారీని ప్రారంభించామన్నారు. కోటప్పకొండకు వాటర్ బాటిల్స్ను తరలించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్బాబుతో పాటు ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు ఊరా భాస్కరరావు, వనమా సాంబశివరావు, పచ్చిపులుసు సతీష్, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, డాక్టర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

**- ఎన్ఐపీహెచ్ఎం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విధుకంపురత్**



**కొల్లిపర,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్ఐపీహెచ్ఎం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విధుకంపురత్ అన్నారు.శనివారం మండల కేంద్రం కొల్లిపరలో వ్యవసాయ పంటల సంరక్షణ సాంకేతికలపై రైతు శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు.విజ్ఞాన్ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ తాతినేని రమేష్బాబు అద ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ విధుకంపురత్ మాట్లాడుతూ ప్రకృతి వ్యసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం సమన్వయకర్త డాక్టర్ హోడోల్మహేష్వినాయక్,డాక్టర్ రమ్య,డాక్టర్ హరీష్,డాక్టర్ మాధవి,మండల వ్యవసాయాధికారి వెంకట్రావు,పీహెచ్ఏ రవితేజ,రైతులు నెర్ల కుటుంబరెడ్డి,దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి,ఉయ్యూరు సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆలపాటిని గెలిపిద్దాం..సమస్యలు పరిష్కరించుకుందాం

**-దుగ్గిరాల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి**

**కొల్లిపర,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ను గెలిపించుకుని మన పట్ట భద్రులు,ఉదోగ్యుల సమస్యలు పరిష్కరించుకుందామని దుగ్గిరాల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి పిలుపునిచ్చారు.శనివారం మండలంలోని వల్లభాపురం,తూములూరు,కొల్లిపర గ్రామాలలో ఆలపాటిని గెలిపించాలని కోరుతూ టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించి పట్టభద్రులను..ఉద్యోగులను కలసి మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటికి వేయాలని కరపత్రాలను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ ఆలపాటి గెలిపించి తెలుగుదేశం పార్టీకు అండగా నిలబడాలన్నారు.కార్యక్రమంలో టీడీడీ మండల అద్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి,టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు,నీటి సంఘం అద్యక్షుడు బొట్టా శ్రీరాములరెడ్డి,నీటి సంఘం ఉపాద్యక్షుడు ఆరిమండ శివనాగమల్లీశ్వరరెడ్డి,నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి,భీమవరపు లంక కోటిరెడ్డి,కొల్లి కోటిరెడ్డి,ఉమ్యూరు శ్రీనివాసరెడ్డి,షేక్ రఫీ,చాగంటి నారాయణరెడ్డి,జంగా శ్రీనివాసరెడ్డి,బొంతు చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రతివారు అంతర్జాలంలో తెలుగును విరివిగా వాడుతుండాలి

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** నాణ్యమైన చదువులకు మాతృభాషా మాద్యమమే కీలకమని ప్రపంచవ్యాప్తంగా జరిగిన జరుగుతున్న పరిశోధనలు తేల్చిచెబుతున్న నేపద్యంలో అమ్మభాషలో అభ్యసన ఎందుకు వెనకబడుతుందో అందరూ ఆలోచించాలని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమం సందర్భంగా జరిగిన మహిళల మాట-పాట కార్యక్రమంలో ప్రసంగించిన మహిళా మేధావులు,కవయిత్రులు,కళాకారిణీలు మాట్లాడుతూ అన్నారు. కార్యక్రమంలో ఫ్రీలాన్స్ జర్నలిస్టు,కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ వ్యక్తుల అభివృద్ధిలోనూ,వ్యవస్థల పురోభివృద్ధిలోనూ భాషల పాత్ర చాలా కీలకమని కేవలం మాట్లాడుకోవడానికి మాత్రమే కాక విద్యను నేర్చుకోవడానికి,దాని ద్వారా స్థిరమైన అభివృద్ధిని సాధించటానికి మాతృభాష చాలా అవసరమన్నారు.కళాపోషకురాలు వి.వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రతివారూ అంతర్జాలంలో తెలుగును విరివిగా వాడుతుండాలని ఎంతగావాడితే అంత మెరుగైన ఫలితాలు అందుతున్నా యన్నారు.కార్యక్రమంలో గాయనీమణి సూర్యలక్ష్మీ,శోభ,రచయిత్రి టి.పద్మావతి తదితరులు ప్రసంగించారు.

# ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా పయనిస్తున్న నారా చంద్రబాబు

**-ఏపి టిడిసి చైర్మన్ డాక్టర్ నూకసాని**

గుంటూరు విద్య,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త : స్థానిక తూర్పు నియోజకవర్గంలో ఉర్దూ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాటాల్డుతూ ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు.గత 8నెలల కూటమి పాలనలో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్ళను అధిగమించేందుకు ముఖ్యమంత్రి నిరంతరం కృషిచేస్తునా న్నరన్నారు.గత ప్రభుత్వ హాయాంలో ప్రజలు,ఉపాధ్యాయులు తమ సమస్యలను వ్యక్తం చేయడానికి భయపడే పరిస్థితులు నెలకొన్నాయని, ప్రస్తుతం జరుగుతున్న గ్రాడ్యూయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్కు మొదటి ప్రాధాన్య ఓటువేయాలని పిలుపునిచ్చారు.పది లక్షల కోట్లు అప్పులభారం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని వివరించారు.ఉపాధ్యాయులు,ప్రైవేటు టీచర్లు,ఇతర ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకులు రాఘవేంద్ర,అఖిల భారత ఓబిసి సంఘం చైర్మన్ అంగిరేకుల వరప్రసాద్ యాదవ్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించుకుందాం : రమాదేవి

**తెనాలి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ఉభయ కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమస్యల పట్ల స్పందించే పిడిఎఫ్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఐద్వా రాష్ట్ర మహిళా సంఘం కార్యదర్శి డి.రమాదేవి పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు రమాదేవి తెనాలి వచ్చిన సందర్భంగా స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అధికారంలో ఉన్న పార్టీల నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం నిరంకుశవాదాన్ని తలపిస్తుందని అన్నారు. సొంత లాభం కోసం కాకుండా సమస్యల పట్ల స్పందించి విలక్షణమైన వ్యక్తిత్వం గల కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. పిడిఎఫ్ అభ్యర్థి పట్ల సానుకూల స్పందన పట్టభద్రుల్లో ఉందని చెబుతూ లక్ష్మణరావుపై బురదజల్లే ప్రమాదం సరికాదన్నారు. గత 18సంవత్సరాలుగా ఉద్యమ నాయకుడిగా, ఎమ్మెల్సీగా విలువలు పాటించిన నాయకుడిగా లక్ష్మణరావు వెంట పట్టభద్రులున్నారని అన్నారు. ఈ సమావేశంలో పలువురు ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.


# పిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఫేర్వెల్ డే వేడుకలు

**రాజుపాలెం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** కేఎన్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాజుపాలెం మండలం కొండమోడు పిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో పేరు ఫేర్వెల్ డే వేడుకలు కళాశాల డైరెక్టర్స్ కోనేటి



నరసింహారావు, బడిశా మస్తాన్రావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన చైతన్య బాల కుటీర్ అధినేత జనార్ధన్రావు విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ సాంబశివరావు టిడిపి నాయకులు వడ్డపల్లి సర్వేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలతో అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కెఎన్ఆర్ విద్యాసంస్థలలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండే విధంగా తక్కువ ఫీజులతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్షిప్ సదుపాయం, దూరప్రాంత విద్యార్థులకు బస్సు సదుపాయం కళాశాల కల్పిస్తుందని, అవకాశాన్ని పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువు మధ్యలో ఆగిపోయిన వారి కోసం దూర విద్యా విధానం కూడా ఇక్కడ అందుబాటులో ఉందని తెలిపారు. విద్యార్థులు ఎవరు కూడా చదువు మధ్యలో మానివేయకూడదని, ఇంటర్ అయిపోయిన విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సుల వైపు వెళ్ళవచ్చునని, డిగ్రీ విద్యార్థులు పిజీ చేసి భవిష్యత్తును బంగారు బాటగా తీర్చుకో తీర్చుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ట్విన్స్ దినోత్సవం




**పెదకూరపాడు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పెదకూరపాడు ఆనందపేటలో ఘనంగా జాతీయ ట్విన్స్ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. యూకేజీ చదువుతున్న అంకిత్ , రికిత్ అనే ట్విన్స్ తమ పుట్టిన రోజు వేడుకలు జాతీయ ట్విన్స్ డే వేడుకలు ఒకేరోజు కావడంతో ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలో డిఎస్పీ ఆఫీసులో పని చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ పగటి రవికి ఇద్దరు ట్విన్స్ పుట్టారు. వారి జన్మదినం ఇదే రోజు కావడం జాతీయ ట్విన్స్ దినోత్సవం ఇదే రోజు కావడం విశేషం. వారి స్వగృహంలో వారి బంధువులతో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.




సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేదించాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్, మెప్మా సిబ్బంది
**( రేపల్లె(నిజాంపట్నం)- ప్రభాతవార్త )**

# నేడు శ్రీఅభయాంజనేయస్వామి 27వ వార్షికోత్సవం



**నరసరావుపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** స్థానిక వినుకొండరోడ్డులో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ 27వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పరుచూరి ఉదయ్కిషోర్ ఆదివారం తెలియజేశారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామివారికి ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు పంచామృత స్నపన, సహస్రతమలార్చన జరుగుతాయన్నారు. అలాగే 8 గంటల నుండి 10 గంటల వరకు శ్రీనివాస కాలనీలో స్వామివారి నగరోత్సవం జరుగుతుందన్నారు. అలాగే స్వామివారికి వివిధ రకాల విశేష పూజలు నిర్వహించబడతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. రాత్రికి ఆలయ ఆవరణలో భజనాలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

23-2Pg5.qxd:23-2Pg5.qxd 01/01/01 7:27 AM Page 1



# నేటి నుంచి 3 రాష్ట్రాల్లో ప్రధాని మోడీ పర్యటన

## పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడురోజులపాటు మూడురాష్ట్రాల్లో పర్యటిస్తారు. మధ్యప్రదేశ్, బీహార్, అస్సోం రాష్ట్రాల్లో 23నుంచి 25వరకూ ఆయన పర్యటన కొనసాగిస్తారు. మధ్యప్రదేశ్‌లో భాగేశ్వర్‌దామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌కు మోడీ శంకుస్థాపనచేస్తారు. ఇన్వెస్టర్స్ సదస్సును సోమవారం ప్రారంభిస్తారు. అసోంలో జమోయిర్ బినాందిని కార్యక్రమంలో పాల్గొంటారు. టీ పరిశ్రమ, పారిశ్రామికీకరణ జరిగి 200 ఏళ్లు అయినసందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని అసోం ప్రభుత్వం నిర్వహిస్తోంది. పీఎం పర్యటన వివరాల ప్రకారం 23వ తేదీ మధ్యప్రదేశ్ ఛాతర్‌పూర్ జిల్లాలో పర్యటిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు భాగే స్వర్ మెడికల్ సంస్థకు శంకుస్థాపన 24 వతేదీ భోపాల్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సును ప్రారంబిస్తారు. 60దేశాలకు సంబంధించిన ప్రతినిదులు, అంతర్జాతీయ సంస్థల ప్రముఖులు, ఇండియాలోని 300 మందికిపైగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఈ ఇన్వెస్టర్ల సదస్సులో పాల్గొంటారు. అలాగే బీహార్‌లో 24వ తేదీ ఉదయం 2.15 గంటలకు బీహార్‌లోని భాగల్‌పూర్‌చేరతారు. పిఎంకిసాన్‌స్కీమ్ 19వ విడతను విడుదలచేస్తారు. పలు అభ్రిద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితంచేస్తారు. ప్రధాని 24వ తేదీ సాయంత్రం ఆరుగంటలకు గౌహతి చేరుకుంటారు. మెఘా ఝుమోయిర్ 2025లో పాల్గొంటారు. ఉదయం 1045 గంటలకు గౌహతిలో జరిగే అడ్వాంటేజ్ అసోం 2.0 ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌ఫ్రా సదస్సులో పాల్గొంటారు. వివిధ అంతర్జాతీయ సంస్థలు, గ్లోబల్ లీడర్లు, పెట్టుబడిదారులు విధాన నిర్ణేతలు పరిశ్రమల నిపుణులు స్టార్టప్స్ విద్యార్థులు ఇతరులు పాల్గొంటారు.

# రాజస్థాన్ సిఎంను హత్య చేస్తామని బెదరింపులు

**జైపూర్, ఫిబ్రవరి 22:** రాజస్థాన్ సీఎం భజన్ లాల్‌శర్మకు హత్యచేస్తామన్న బెదిరింపులు వచ్చాయి. దౌసా జైలులో ఉన్న ఓ ఖైదీ సీఎంను చంపేస్తానంటూ ఫోన్‌ద్వారా బెదిరింపులకు పాల్పడ్డాడు. దీనితో అప్రమత్తం అయిన పోలీసులు దర్యాప్తుప్రారంభించారు. కాగా రింకు అనే వ్యక్తి పలుకేసుల్లో ఖైదీగా దౌసా జైలులో



శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే ఆతడు జైలు నుంచి పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు ఫోన్‌చేసాడు. సీఎంను చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు రాష్ట్ర హోంమంత్రి జవహర్‌సింగ్ బేధమ్ తెలిపారు. అప్రమత్తం అయిన పోలీసులు ఈఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. జైలులో ఉనన ఆతడికి ఫోన్ ఎలా వచ్చిందనే దానిపై దర్యాప్తుచేపట్టినట్లు చెప్పారు. ఈ ఘటనలో జైలులో మరో అధికారి ప్రమేయం ఉన్నట్లుప్రాథమిక విచారణలో తేలిందని మంత్రి తెలిపారు.



ప్రపంచ కుబేరుడు మస్క్ కుమారుడి అల్లరి కారణం!

# 145 యేళ్ల డెస్క్‌ను మార్చిన ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 22:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఇటీవల తన నాలుగేళ్ల కుమారుడితో కలిసి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిసిన సంగతి తెలిసిందే. వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో వీరిద్దరూ మీడియా సమావేశంలో పాల్గొనగా మస్క్ కుమారుడి అల్లరి నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. అయితే, ఆ చిన్నారి వల్ల ట్రంప్ ఇప్పుడు తన డెస్క్‌ను మార్చుకోవాల్సి వచ్చిందట. ఓవల్ ఆఫీస్‌లో 145 యేళ్ల పురాతన రెజల్యూట్ డెస్క్‌ను తీసేయించిన ట్రంప్ దాని స్థానంలో సిఅండ్ఒ డెస్క్‌ను పెట్టించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆయన తన ట్రూత్ ఖాతాలో పంచుకున్నారు. అయితే, ఇది తాత్కాలిక మార్పేనని ఆయన పేర్కొన్నారు. మస్క్ కుమారుడు ఆ టేబుల్‌పై చేతులు పెట్టడం, రుద్దడం వంటి పనులు చేశాడు. బ్యాక్టీరియా భయంతో అతిశుభ్రతను పాటించే ట్రంప్ చిన్నారి చేష్టలకారణంగానే టేబుల్‌ను మార్చినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ మార్పుపై ట్రంప్‌పోస్ట్ చేస్తూ 'శ్వేత సౌధంలోని 7డెస్కుల్లో ఏదో ఎంచుకునే అవకాశం అధ్యక్షుడికి ఉంటుంది. ఈ సిఅండ్ఒ డెస్క్‌ను గతంలో జార్జ్ బుష్, మరికొందరు అధ్యక్షులు ఓవల్ ఆఫీస్‌లు వినియోగించారు. ఇప్పటివరకు ఇక్కడున్న రెజల్యూట్ డెస్క్‌ను మరమ్మతుల కోసం పంపించాం. అది చాలా అత్యవసరం' అని రాసుకొచ్చారు. ఈ రెజల్యూట్ డెస్క్‌ను 1880లో అప్పటి బ్రిటన్‌రాణి క్వీన్ విక్టోరియా, నాటి అమెరికా అధ్యక్షుడు రూథర్‌ఫోర్డ్‌కు కానుకగా ఇచ్చారు. దీని బ్రిటిష్ రాయల్ నేవీలో సేవలందించి వైదొలిగిన హెచ్ఎంఎస్ రెజల్యూట్ అనే నౌక చెక్కతో తయారుచేశారు. గతవారం మస్క్ శ్వేత సౌధానికి వచ్చి అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఆ సమయంలో కుమారుడు ఎక్స్ ఎఇఎ-12కూడా వెంటే ఉన్నాడు. మస్క్ మీడియాతో మాట్లాడుతుండగా ఈ పిల్లాడు చేసిన అల్లరి అంతా ఇంతాకాదు. తండ్రితలపై ఎక్కికూర్చున్న దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# పోప్ ఫ్రాన్సిస్‌కు న్యుమోనియా

## డ్రగ్‌థెరఫీని మార్చిన రోమ్ వైద్యులు

### ఇప్పటికీ ఆసుపత్రిలోనే క్యాథలిక్ మతపెద్ద



**వాటికన్‌సిటీ, ఫిబ్రవరి 22:** క్రైస్తవ మతపెద్ద పోప్‌ఫ్రాన్సిస్‌కు వృద్ధాప్యసమస్యలు పెరగడంతో ఆయన ఆసుపత్రిలోనే ఉంటూ చికిత్సతీసుకుంటున్నారు. 88 ఏళ్ల పోప్‌ఫ్రాన్సిస్ వారం రోజులుగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుంటే గతవారం రోమ్‌లోని ఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి పోప్ పరిస్థితి ఆందోలనగానే ఉంది. పోప్ ఛాతీని స్కాన్‌చేయగా ఆయన రెండు ఊపిరితిత్తులలో న్యుమోనియా కనిపించిందని ఇందుకు అదనపు చికిత్స అవసరమని తెలిపింది. పోప్ రక్త పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను వైద్యులు పరిశీలించారని ఆయన ఆరోగ్యం స్వల్పంగా మెరుగుపడిందని వాటికన్ తెలిపింది. పోప్ ఉత్సాహంగానే ఉన్నారని, చదువుతూ విశ్రాంతి తీసుకుంటూ ప్రార్థనలు చేస్తూ రోజంతా గడిపినట్లు వాటికన్‌సిటీ వివరించింది. న్యుమోనియా వల్ల ఊపిరితిత్తుల్లో మంటను తెస్తుంది. ఛాతీనొప్పికి కారణం అయి శ్వాసను మరింత కష్టతరంచేస్తుందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఇటలీప్రధాని జార్జియా మెలోని పోప్‌ను పరామర్శించారు. పోప్ స్పందిస్తున్నందుకు సంతోషంగా ఉందని ఆమె చెప్పారు. ఆయనలో హాస్యచతురత తగ్గలేదని మెలోని అన్నారు. పోప్ సత్వరమే కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. పోప్ చాలాకాలంగా బ్రాంకైటిస్ లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. కార్యక్రమాల్లో పోప్ రాసిన ప్రసంగాలను అధికారులు చదివేవారు. 2025 క్యాథలిక్ హోలి ఇయర్‌కోసం జరిగే పలు కార్యక్రమాలకు పోప్ నాయకత్వం వహించాల్సి ఉంది. 2026 జనవరివరకూ జరగాల్సి ఉంది. పోప్ షెడ్యూలులోని అన్ని పబ్లిక్ ఈవెంట్‌లు ఆదివారం వరకూ రద్దుచేసారు. పోప్ ఆసపత్రిలోచేరడంతో వైద్యులు ఆయనకు మరోసారి డ్రగ్ థెరపీ మార్చారని వాటికన్‌సిటీ తెలిపింది. 21 ఏళ్ల వయసులో ఉండగానే పోప్‌కు ప్లూరిసీ డెవలప్ అయింది. ఇయనకు 21 ఏళ్లలోనే ఊపిరితిత్తుల్లో కొంతభాగం తొలగించారు. అర్జంటీనాకు చెందిన పోప్‌ఫ్రాన్సిస్ గడచిన 12 ఏళ్లనుంచి రోమన్‌క్యాథలిక్ చర్చ్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ఇటీవలికాలంలో పోప్ చాలాసార్లు ఆసుపత్రి పాలయ్యారు. ఇందులో భాగంగానే 2023 మార్చిలో బ్రాంకైటిస్‌తో మూడు రోజులు ఆసుపత్రిలోనే గడపాల్సి వచ్చింది.

# ఉనికిలో లేని శాఖకు పంజాబ్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ మంత్రి!

## అక్కడ పాలన ఒక జోక్ అంటూ ఎద్దేవా చేసిన బిజెపి

**చండీగఢ్, ఫిబ్రవరి 22:** ఉనికిలో లేని ఒక శాఖకు పంజాబ్‌లో ఓ మంత్రి బాధ్యతలు నిర్వహించారట. ఈ విషయాన్ని 20 నెలల తర్వాత పంజాబ్ ప్రభుత్వం గుర్తించింది. దానిని సవరించేందుకు ఇచ్చిన ఒక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఈ విషయం వెల్లడయింది. దీనిపై బిజెపి తీవ్ర విమర్శలు చేసింది. 2022 మార్చిలో పంజాబ్‌లో భగవంత్ మాన్ నేతృత్వంలో ఆప్ ప్రభుత్వం ఏర్పడింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2024లో చివర్లో మరోసారి పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆ మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజాగా దానిని సవరించింది. కుల్దీప్‌సింగ్‌కు కేటాయించిన అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ ఉనికిలేకపోవడం వల్ల సెప్టెంబర్‌లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో మార్పులు చేస్తున్నట్లు అందులో పేర్కొంది. దీనిపై బిజెపి విమర్శలు గుప్పించింది. పంజాబ్‌లో పాలనను ఆప్ ఒక జోక్‌గా మార్చింది.


# నాకు విరిగిన సీటిస్తారా?

## ఎయిర్ ఇండియాపై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ఆగ్రహం: క్షమాపణలు చెప్పిన సంస్థ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా పై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మండిపడ్డారు. ఇటీవల భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించిన సందర్భంలో తనకు విరిగిన సీటు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ప్రయాణికులను మోసం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఎయిర్ ఇండియా నిర్వహణను టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత ఎయిర్‌లైన్స్ సేవలు మెరుగుపడతాయని అనుకున్నానని, కానీ అది తన అపోహ మాత్రమేనని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. విమానం ఎక్కిన వెంటనే నేను బుక్ చేసుకున్న సీటు విరిగి ఉండడంతో ఆశ్చర్యపోయాను. దీనిపై ఎయిర్‌లైన్స్ సిబ్బందిని ప్రశ్నించగా ఈ సమస్యను యాజమాన్యం ఆలస్యంగా గుర్తించింది. ఈ సీటు టికెట్‌ను ప్రయాణికులకు విక్రయించకూడదని ఆదేశించిందని తెలిపారు. విమానంలో అదొక్కటే కాకుండా మరిన్ని సీట్లు కూడా సరిగా లేవని సిబ్బంది చెప్పారు అని కేంద్రమంత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. తోటి ప్రయాణికులు తమ సీట్లలో కూర్చోమని ఆఫర్ చేశారని అన్నారు. కానీ వారికి ఇబ్బంది కలిగించడం ఇష్టం లేక తాను అదే విరిగిపోయిన సీట్‌లోనే గంటన్నరపాటు కూర్చొని ప్రయాణించానని అన్నారు. ప్రయాణికుల నుంచి పూర్తి ఛార్జీలు వసూలు చేసి, అసౌకర్యమైన సీట్లు కేటాయించడం ప్రయాణికులను మోసం చేసినట్లు కాదా అని మండిపడ్డారు. భవిష్యత్తులో అయినా ఎయిర్ ఇండియా యాజమాన్యం తమ ప్రయాణికులను ఇటువంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకుంటుందా లేదంటే వారి అవసరాన్ని సొమ్ము చేసుకోవడానికి వాడుకుంటుందా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి ట్వీట్‌పై ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ ఆయనకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.


# ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా భగవద్గీతపై ప్రమాణంచేసిన కాష్‌పటేల్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 22:** అమెరికా అత్యున్నత దర్యాప్తుసంస్థ ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్‌గా భారతీయ అమెరికన్ కాష్‌పటేల్ ప్రమాణంచేసారు. తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానంటూ భగవద్గీతపై ప్రమాణం చేసారు. వైట్‌హౌస్ ఆవరణలో ఉన్న ఐసన్‌హోవర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీస్ భవనంలోని ఇండియన్ ట్రీటీ రూమ్‌లో జరిగిన ఈకార్యక్రమంలో పటేల్ స్నేహితురాలు, ఆయన కుటుంబసభ్యులు హాజరయ్యారు. అమెరికా అటార్నిజనరల్ పామ్ బాండీ ఆయనతో ప్రమాణం చేయించారు. ఇకపై ఎఫ్‌బిఐ లోపల, వెలుపల జవాబుదారీతనం ఉంటుందని ఆయన అన్నారు. కాష్‌పటేల్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పొగడ్తలతో ముంచెత్తారు. కాష్ కఠినమైన బలమైన వ్యక్తి అని ప్రశంసించారు. ఎఫ్‌బిఐ ఏజెంట్లను ఆయన ఎంతో గౌరవిస్తారని, కాష్‌ను ఎంపికచేయడానికి ఇదికూడా ఒక కారణం అన్నారు. ఈ పదవినిచేపట్టిన అత్యుత్తమ వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారని వెల్లడించారు. ఆయన నియామకంకోసం చాలా సులువుగా ఏకాభిప్రాయం సాధించగలిగానని తెలిపారు. ఎఫ్‌బిఐకి తొమ్మిదో డైరెక్టర్‌గా పటేల్‌నియమితులయ్యారు. అమెరికన్‌సెనేట్ ఆయన నియామకాన్ని ఆమోదించింది. పటేల్‌కు అనుకూలంగా 51, వ్యతిరేకంగా 49 ఓట్లు వచ్చాయి. ఇద్దరు డెమొక్రాట్లు ఆయనకు వ్యతిరేకంగా ఓట్లువేసారు. పటేల్ అమెరికాలోనిన్యూయార్క్‌లోనిగార్డెన్‌సిటీకి చెందిన వ్యక్తి అయినా ఆయన తల్లితండ్రులు గుజరాత్‌కు చెందినవారు. కాష్ తల్లితండ్రులు తొలుత ఉగాండాకు వెళ్లి అక్కడ జాతివివక్ష కారణంగా కెనడాకు వెళ్లారు. కాష్‌తండ్రి విమానయాన సంస్థ ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. కాష్ పటేల్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌నకు అత్యంత సన్నిహితుడనే పేరుంది. కాష్ రిచ్‌మండ్‌యూనివర్సిటీనుంచి హిస్టరీ, క్రిమినల్ జస్టిస్‌లో డిగ్రీపొందారు. పేస్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లానుంచి డిగ్రీకూడా పొందారు. గతంలో అమెరికా అధ్యక్షుడికి డిప్యూటీ అసిస్టెంట్‌గా, ఎన్‌ఎస్‌సిలో ఉగ్రవాద నిరోధక విభాగానికి సీనియర్ డైరెక్టర్‌గా పనిచేసారు.

# లంచం ఇస్తేనే భోజనం పెట్టారు..

## ఉగాండా జైలు కష్టాలు వెల్లడించిన స్విట్జర్లాండ్ వ్యాపారవేత్త కూతురు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** స్విట్జర్లాండ్‌లో ప్రముఖ వ్యాపారవేత్తగా పేరు గడించిన భారత సంతతికి చెందిన పంకజ్ ఓస్వాల్ కుమార్తె వసుంధర గతేడాది అక్టోబర్‌లో ఉగాండాలో అరెస్టయ్యారు. కిడ్నాప్, హత్య అభియోగాలపై ఆమెను అరెస్టు చేసిన పోలీసులు కొన్నాళ్లపాటు నిర్బంధంలో ఉంచారు. ఆ సమయంలో పోలీసులు తనతో చాలా దారుణంగా వ్యవహరించారని వసుంధర వెల్లడించారు. లంచం ఇస్తేనే తనకు ఆహారం, నీళ్లు ఇచ్చారని ఆరోపించారు. ఈ ఘటన జరిగిన దాదాపు నాలుగు నెలల తర్వాత తాజాగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఆ రోజు పోలీసులు మా ఇంటికి వచ్చి వారెంట్ లేకుండా సోదాలు చేశారు. సెర్చ్ వారెంట్ అడిగితే ఇది యూరప్ కాదంటూ ఇష్టానుసారంగా మాట్లాడారు. ఇంటర్‌పోల్ డైరెక్టర్‌ను కలవాలంటూ బలవంతంగా నన్ను బయటకు తీసుకొచ్చారు. ఓ పురుష అధికారి నన్ను లాక్కెళ్లి వ్యాన్‌లో పడేశారు. ఆ తర్వాత అయిదు రోజుల పాటు నిర్బంధించారు. అనంతరం మరో రెండు వారాలు జైలుకు పంపించారు. ఆ సమయంలో నా ప్రాథమిక హక్కులకు తీవ్రంగా భంగం కలిగించారు. స్నానం చేయనివ్వలేదు. తిండి పెట్టలేదు. కనీసం నీళ్లు కూడా ఇవ్వలేదు. నాకు భోజనం, ఇతర కనీస సౌకర్యాలు కల్పించేందుకు నా తల్లి దండ్రులు పోలీసులకు లంచం ఇవ్వాల్సి వచ్చింది. ఒక దశలో నన్ను వాష్‌రూమ్‌కు కూడా వెళ్లనివ్వలేదు. క్రిమినల్ లాయర్‌ను అనుమతించకుండానే బలవంతంగా నాతో వాంగ్మూలం రాయించుకున్నారు.

# మరో ఆరుగురు బందీల విడుదలకు హమాస్ సిద్ధం

## వారిలో ఇద్దరు రెడ్‌క్రాస్ సంస్థ అధికారులకు అప్పగింత



**టెల్‌అవీవ్, ఫిబ్రవరి 22:** గాజాలో శాంతి స్థాపన కోసం ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దీంతో 15 నెలలకుపైగా జరుగుతున్న భీకర పోరాటాన్ని పక్కనపెట్టి.. బందీలను, ఖైదీలను విడుదల ప్రక్రియను ప్రారంభించాయి. హమాస్ తమ చెరలో బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ పౌరులను విడతల వారీగా విడుదల చేస్తోంది. తాజాగా మరో ఆరుగురికి విముక్తి కల్పించేందుకు సిద్ధమైంది. ఆ ఆరుగురు బందీల వివరాలిలా ఉన్నాయి. ఎలియా కోహెన్, ఒమెర్ షెమ్‌టోవ్, ఒమెర్ వెంకెర్ట్, హిషం అల్ సయీద్, టాల్ షోహమ్, అవెరు మెంగిస్తు. కాగా, వారిలో ఇద్దరు ఇజ్రాయెలీ బందీలను రెడ్‌క్రాస్ వారికి హమాస్ అప్పగించింది. రెడ్‌క్రాస్ అధికారులకు అప్పగించే ముందు టాల్ షోహమ్, అవెరు మెంగిస్తులను చూపించారు. అయితే, వారిని ఎప్పుడు బయటకు పంపిస్తారన్న దానిపై ఇంకా స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు.

**ఆ మృతదేహం ఆమెదే:** మరోవైపు.. ఇటీవల హమాస్ పంపించిన ఒక మృతదేహం తమ దేశానికి చెందిన మహిళది కాదని ఇజ్రాయెల్ ఆరోపించింది. దీనిపై తీవ్రదుమారం రేగింది. అయితే, ఆ మృతదేహం తమ కుమార్తెదేనంటూ మృతురాలి కుటుంబం తాజాగా ధ్రువీకరించడం గమనార్హం. షిరిబిబాస్ అనే మహిళ, తన ఇద్దరు చిన్నారులు హమాస్ చెరలో ఇన్నాళ్లూ బందీగా ఉన్నారు. యుద్ధం కారణంగా మహిళతోపాటు చిన్నారులు కూడా మృతి చెందారు. ఇటీవల ఆమె మృతదేహాన్ని ఇజ్రాయెల్‌కు పంపించారు. అయితే, అది అసలు తమ దేశ పౌరురాలిది కాదని.. ఫోరెన్సిక్ అధికారులు ధ్రువీకరించారని ఇజ్రాయెల్ తెలిపింది. నిజానికి అది పాలస్తీనాకు చెందిన మహిళ శవంగా గుర్తించినట్లు పేర్కొంది. జరిగిన తప్పిదానికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు.

**దీనిపై స్పందించిన హమాస్:** బందీలు ఉన్న ప్రాంతంపై ఐడిఎఫ్ దాడులు చేయడంతో చనిపోయిన వారి మృతదేహాలు చెల్లాచెదుర్యయ్యాయని దాని వల్లే అవశేషాలు కలిసిపోయి ఉండొచ్చంటూ వ్యాఖ్యానించింది. అయినప్పటికీ దీనిపై మరోసారి సమీక్ష జరుపుతామని తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో షిరిబిబాస్ కుటుంబం స్పందిస్తూ అది ఆమె మృతదేహమేనని తెలిపింది.



# రేపు కొలువుదీరనున్న ఢిల్లీ కొత్త అసెంబ్లీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** ఢిల్లీలో కొత్తప్రభుత్వం ప్రమాణంచేసిన తర్వాత కొత్త అసెంబ్లీ తొలిసారి ఈనెల 24వ తేదీ సమావేశం అవుతోంది. సమావేశాలుప్రారంభంకాగానే ముందుప్రొటెమ్ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ఉదయం 11 గంటలనుంచి కొత్త ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారాలు జరుగుతాయి. ఆ తర్వాత లంచ్ బ్రేక్ ఉంటుంది. తర్వాత మధ్యాహ్నం రెండు గంటలకు సభ ప్రారంభం కాగానే స్పీకర్‌ను ఎన్నుకుంటారు. సమావేశాల రెండోరోజు 25న అసెంబ్లీలో లెఫ్టినెంట్‌గవర్నర్ వికె సక్సేనా ప్రసంగిస్తారు. గవర్నర్‌ప్రసంగం ముగియగానే ప్రభుత్వం కాగ్ నివేదికను అసెంబ్లీలోప్రవేశపెడుతుంది. మూడోరోజు 27వ తేదీ ఉదయం నుంచి గవర్నర్‌ప్రసంగంపై చర్చ జరుగుతుంది. చర్చ ముగిసిన తర్వాత డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. తర్వాత అసెంబ్లీ సమావేశాలనునిరవదికంగా వాయిదావేస్తారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించింది. మొత్తం 70 అసెంబ్లీస్థానాల్లో బిజెపి 48స్థానాలుగెలిచి ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఆప్ కేవలం 22 స్థానాలు మాత్రమే గెలిచి ప్రతిపక్షానికే పరిమితం అయింది.

# మ్యాచ్ మాదే.. దేశమూ మాదే

## డొనాల్డ్ ట్రంప్‌కు కెనడా పిఎం ట్రూడో చురక



**వాషింగ్టన్, ఫిబ్రవరి 22:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలిచినప్పటి నుంచి పొరుగు దేశం కెనడాతో కయ్యానికి కాలుదువ్వుతున్న సంగతి విదితమే. ఆ దేశంపై సుంకాలతో విరుచుకుపడటంతోపాటు కెనడాను 51వ అమెరికా రాష్ట్రంగా అభివర్ణిస్తూ వివాదానికి తెరలేపారు. ఈ పరిణామాల వేళ తాజాగా రెండు దేశాల మధ్య ఓ మ్యాచ్ జరిగింది. అందులో తమ దేశ జట్టు నెగ్గడంతో అమెరికా అధ్యక్షుడిపై ట్రూడో ఘాటు వ్యాఖ్యలు చేశారు.

బోస్టన్ వేదికగా 4 నేషన్స్ ఫేస్-ఆఫ్ ఐస్ హాకీ టోర్నమెంట్ జరిగింది. ఫైనల్ మ్యాచ్‌లో అమెరికా-కెనడా తలపడ్డాయి. ఈ మ్యాచ్‌కు ముందు ట్రంప్ దీనిపై స్పందిస్తూ 'త్వరలోనే మన 51వ రాష్ట్రంగా మారే కెనడాపై గ్రేట్ అమెరికా హాకీ జట్టు విజయం సాధిస్తుందని విశ్వసిస్తున్నా' అని రాసుకొచ్చారు. అయితే, ఫైనల్ పోరులో కెనడా చేతిలో అగ్రరాజ్య జట్టు ఓటమి పాలైంది. దీంతో ట్రంప్ వ్యాఖ్యలకు ట్రూడో దీటుగా బదులిచ్చారు. మ్యాచ్ అనంతరం తన ఎక్స్ ఖాతాలో 'మీరు మా దేశాన్ని తీసుకోలేరు.. మా గేమ్‌ను తీసుకోలేరు' అని కౌంటర్ ఇచ్చారు.

కెనడాపై అధిక సుంకాలు విధిస్తానని ట్రంప్ ఎన్నికల ప్రచారం నుంచే హెచ్చరిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయాలని, లేదా సుంకాలు పెంచుతానని అన్నారు. అంతేగాక, ఇందులో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడాను చేర్చుకుంటానని హెచ్చరించారు. ఈ క్రమంలోనే 'గవర్నర్ ఆఫ్ కెనడా' అంటూ ట్రూడోపై పలుమార్లు విమర్శలు గుప్పించారు.

ఈ నేపథ్యంలోనే అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కెనడాపై 25 శాతం సుంకాలను విధించారు. ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి వస్తాయని తెలిపారు. దీనికి ప్రతిగా.. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే కొన్ని వస్తువులపై తాము కూడా 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ట్రూడో ప్రకటించారు. తర్వాత ఇద్దరి మధ్య చర్చలు జరగడంతో ప్రతిపాదిత టారిఫ్‌లను కనీసం 30 రోజులపాటు నిలిపి వేసేందుకు అంగీకారం కుదిరింది.

# 20యేళ్ల క్రితమే వచ్చి ఉంటే మరోలా ఉండేది!

## ఎంఎన్ఎం అధినేత కమల్ హాసన్



**చెన్నై, ఫిబ్రవరి 22:** రెండుదశాబ్దాలుముందే రాజకీయ ప్రవేశంచేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని నటుడు మక్కల్ నీది మెయ్యం అధినేత కమల్‌హాసన్ అన్నారు. రాజకీయంగా తానెంతో ఉన్నతస్థానంలో ఉండేవాడినన్నారు అప్పట్లో రాజకీయాల్లోకి రాకుండా వెనుకంజవేయటమే తన మొదటి ఓటమి అని అన్నారు. తనపార్టీ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ఆళ్వార్‌పేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన జెండా ఎగురవేసారు. తన రాజకీయ పయనంలో అభిమానులు వేరు, ఓటర్లువేరు అనే విషయాన్ని గ్రహించానన్నారు. పార్టీకి చివరి ఓటరు ఉన్నంతవరకూ తమ పార్టీ సేవలు కొనసాగిస్తామన్నారు. 20 ఏళ్లక్రితం తాను రాజకీయ ప్రవేశం చేసి ఉండాలని అప్పట్లో తగునిర్ణయం తీసుకుని ఉంటే తాను రాజకీయాల్లో ఉన్నతస్థితిలో ఉండేవాడినని కమల్‌హాసన్ అన్నారు. ఇక తమిళభాషపై మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరినీ సమైక్యపరిచేది తమిళభాషేనని తాను ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకు పోతుండటానికి కారణం తమిళ ప్రజలేనని కమల్ చెప్పారు. ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన తమిళ భాషను ఎవరూ కిందకు దించలేరని అన్నారు. అలాగే ఈ ఏడాదిపార్లమెంటులో తొలిసారి పార్టీ వాణి వినిపించనున్నదన్నారు. తమిళనాడులోని కొన్ని రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ముందుచేసుకున్న ఒప్పందం ప్రకారం అధికార డిఎంకె కమల్‌పార్టీకి రెండు ఎంపిస్థానాలు కేటాయించనున్నది. కమల్‌హాసన్‌తోపాటు ఆయన పార్టీకి చెందిన మరోవ్యక్తి రాజ్యసభకు వెళ్లనున్నారు. వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీలోకూడా పార్టీ సభ్యులు ఉంటారని ఆశాభావం వ్యక్తం చేసారు. పార్టీ శ్రేణులంతా తోచినట్లుగా ప్రజలకు సేవచేయాలని అప్పుడేపార్టీకి బంగారుభవిష్యత్తు ఉంటుందని కమల్‌హాసన్ అన్నారు.

# ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శిగా శక్తికాంతదాస్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** ప్రధాని నరేంద్రమోడీకి ప్రధాన కార్యదర్శిగా ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంతదాస్ నియమితులయ్యారు. శనివారం కేంద్ర ప్రభుత్వం ఈమేరకు నోటిఫికేషన్ విడుదలచేసింది. శక్తికాంతదాస్ పదవీకాలం నరేంద్రమోడీ ప్రధానిగా ఉన్నంతవరకూ లేదంటే తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకూ ఏది ముందైతే అప్పటివరకూ ఉంటుందని కేంద్ర కేబినెట్ నియామకాలకమిటీ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. శక్తికాంతదాస్ గతంలో ఆర్థికశాఖలో కూడాపనిచేసారు. అనంతరం ఆయన్ను ఆర్‌బిఐ గవర్నర్‌గా ఎన్డీయే ప్రభుత్వం నియమించింది. పదవీవిరమణ తర్వాత ఆయనకు మళ్లీ పీఎంఒలో కీలక పోస్టు లభించింది. అదేవిధంగా నీతి ఆయోగ్ సిఇఒ బివి ఆర్‌సుబ్రహ్మణ్యం పదవీకాలం కూడా ఒక ఏడాదిపాటు పొడిగించారు. ప్రస్తుతం ఆయన పదవీకాలం 2025 ఫిబ్రవరి24తోముగుస్తుండగా ఈ పొడిగింపువల్ల ఆయన2026 ఫిబ్రవరి 24వరకూ కొనసాగుతారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి అయిన సుబ్రహ్మణ్యం 1987 బ్యాచ్‌కు చెందిన అధికారి రెండేళ్ల పదవీకాలానికి ఆయనను 2023 ఫిబ్రవరిలో నీతి ఆయోగ్ సిఇఒగా నియమించారు.

23-2Pg6exHMNWJQE.qxd:23-2Pg6exHMNWJQE.qxd 01/01/01 9:13 AM Page 1



# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

## - సుప్రీం తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి :అన్నమయ్య జిల్లా ఉమ్మడి అధ్యక్షుడు రత్నకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నేత లేబూరి రత్నకుమార్

**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** దేశంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు వంత పాడుతూ కార్మికుల హక్కులను ఏమాత్రం పట్టించుకోక పోవడం దారుణమని ఎన్‌టీయూసీ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఉమ్మడి అధ్యక్షులు లేబూరి రత్నకుమార్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఏనాడు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు వెలువరిచిందని, నేటికీ ఈ తీర్పు అమలు కాకపో వడంతో టీటీడీ, వివిధ యాజమాన్యాలలో కార్మికులు చాలీ చాలని వేతనంతో బ్రతుకు జీవనం సాగిస్తున్నార న్నారు. కార్మికుల విధ విధానాలలో మార్పులు తీసుకుని రావాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘ విస్తరణలో భాగంగా అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లె టౌన్ ప్రెసిడెంట్‌గా షేక్ ఆరిఫ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాబా జుబేర్‌ను నియమిస్తూ నియామక పత్రాలను వారికి అందించారు. మధ్యవర్తిత్వ వేతన పంపిణీ కాకుండా ప్రభుత్వమే నేరుగా చెల్లించే విధానాన్ని అతీసుకోవాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఆప్కాస్‌లో కలపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఉమ్మడి జిల్లా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఆర్. మురళీధర్, మహిళా అధ్యక్షురాలు అనూష, పీలేరు ఆటో యూనియన్ అధ్యక్షులు బోధేషా వల్లి తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పాలనలో దేశం భ్రష్టు పట్టింది

## - బిజెపి గెలుపునకు ఇవిఎం మిషన్లే కారణం.. రాష్ట్రంలో బాబు పాలన పర్వాలేదు!

## - ఎస్సీ వర్గీకరణ దేశానికే ప్రమాదం : కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



పాత్రికేయుల సమావేశంలో ప్రసంగిస్తున్న చింతామోహన్

**కుప్పం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త** ప్రధాని నరేంద్రమోడీ పాలనలో దేశం భ్రష్టు పట్టిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. శనివారం కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రధాని మోడీ అమెరికా పర్యటన అదానీ కేసుల మాఫీ కోసమేనని ఆయన విమర్శించారు. భారతీయ జనతా పార్టీ గెలుపుకు ఇవిఎం మిషన్లే కారణమన్నారు. ఎక్కడో అంతరిక్షంలో ఉన్న సునీతా విలియమ్స్‌ను భూమిపైనుంచి దిశానిర్దేశం చేస్తున్న తరుణంలో పాఠశాల భవనాల్లో ఉండే ఇవిఎం యంత్రాలను మేనేజ్ చేయడం కష్టమా? అని ఆయన ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ అనేది రాజ్యాంగంలో లేదన్నారు. దళితుల్ని విభజించి పాలించాలనేది మానుకోవాలన్నారు. వర్గీకరణపై ఏకసభ్య మిశ్రా కమీషన్ వేశారన్నారు. వర్గీకరణతో దేశానికే ప్రమాదం అని దేశం కష్టాల్లో పడుతుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో ఉన్న బ్యాంకుల్ని వర్గీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ జనాభాలో 25శాతం ఉన్న దళిత, గిరిజనులకు కేవలం 1శాతం కంటే తక్కువగా బ్యాంకర్లు రుణాలిస్తున్నారన్నారు. అలాగే 50శాతం జనాభా గల ఒబిసిలకు 2శాతం రుణాలు ఇస్తూ మార్వాడీలకు 50శాతం బ్యాంకర్లు రుణాలివ్వడం దారుణమన్నారు. దేశ సంపద గుజరాత్‌కు తరలుతోందని దీనిపై ప్రధాని మోడీ స్పందించాలన్నారు. బిజెపి పాలనలో ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నాయుడు పాలన పర్వాలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతికి 60వేల కోట్లు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో వెనుకబడ్డ ఒక్కో జిల్లాకు 3వేల కోట్లు నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్నారు. రాయలసీమనుంచి వచ్చిన ముఖ్యమంత్రులు రాయలసీమకు ఏం చేశారని ప్రశ్నించారు. మాజీ సిఎం జగన్ ఒక్కఛాన్స్ అడిగారని అక్కడికే పరిమితం అని పేర్కొన్నారు. మరలా అధికారంలో వస్తానని జగన్ చెబుతున్నారని రాష్ట్రంలో ఆ పరిస్థితులు లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత నిజాం పాల్గొన్నారు.

# గంజాయి మీద ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది : డిజిపి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరిష్‌కుమార్ గుప్తా

**యడ్లపాడు(పల్నాడు జిల్లా), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** గంజాయి మీద ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, కొత్త కార్యక్రమం ప్రారంభించటం జరిగిందని, ఇందులో ఈగల్ అర్గనైజేషన్ ఏర్పాటుచేసి ఏవిధంగా నిర్మూలన చేయాలన్నదానిపై ఒక విధానాన్ని రూపొందించామని, ఇందులో పోలీస్ డిపార్ట్‌మెంట్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్, ఈగల్ అర్గనైజేషన్ మొత్తం గంజాయి గ్యాంగులపై దృష్టి పెట్టామని, త్వరలోనే వారిని అదుపులోకి తీసుకొని సమస్యను అదుపులోకి తీసుకు వస్తామని అం ధ్రప్రదేశ్ డీజీపీ హరిష్‌కుమార్ గుప్తా తెలిపారు. పల్నాడు జిల్లా, యడ్లపాడు మండల పరిధిలోని కొండవీడు రెవిన్యూ గ్రామం కొత్తపాలెం వద్ద ఏర్పాటుచేసిన జిందాల్ వేస్ట్‌మేనేజ్ మెంట్ ఎనర్జీ పవర్ ప్లాంటుకు అయన శనివారం విచ్చేసారు. కృష్టా జిల్లాలో పట్టుబడిన గంజాయి 3737కేజీలు మరియు 4.22కిలోల లిక్విడ్ గంజాయిని నియమ నిబంధనలు అనుసరించి డ్రగ్ డిస్పోజల్ కమిటీ సమక్షంలో దగ్ధం చేయు కార్యక్రమానికి రావటం జరిగిందన్నారు. అనంతరం అయన మీడియాతో మాట్లాడుతూ ఉన్న సమస్యఅల్లా ఒరిస్సా రాష్ట్రం నుండి దిగుమతి అవుతుందని, వాటిని పట్టుకుంటున్నామని, మన రాష్ట్రంలో గంజాయి సాగు అవుతున్న రెండు వందల ఎకరాల వరకు ధ్వంసం చేయటం జరిగిందన్నారు. పరివర్తన పేరిట అన్ని కళాశాలల్లో అవగాహనకల్పించి అక్కడ ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయిస్తున్నామని, ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారంగా వారి అస్తుల్ని సైతం సీజ్ చేయడం జరుగుతు oదని, ఇలాంటి వ్యవహారాలు చేసిన కొందరు ఇతర రాష్ట్రాల్లో ఉన్నా అక్కడి వారితో కోఅర్డినేట్ చేసుకొని మన టాస్క్‌ఫోర్స్ పంపించడం జరిగిందన్నారు. త్వరలో వారిని కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. బెంగుళూరు నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గుంటూరు నగరంలో గంజాయి, మత్తు పదార్ధాల సరఫరా చేస్తున్నారన్నారు. వారందరిపై నిఘా పెట్టామని గుంటూరులో రెండు కేసులు వచ్చాయని పరిశీలిస్తున్నామన్నారు. కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు సమన్వయంగా గంజాయి, ఇతర మత్తు పదార్ధాల నిర్మూలనకు పోలీసులతో సహకరించాలని, అనుమానమున్న అన్ని ప్రాంతాల్లో నూ వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. విద్యార్ధులకు అవగాహన కల్పించి వారిచే ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు గంజాయి గ్యాంగ్స్‌ను అందరికీ హెచ్చరిస్తున్నామని, మత్తు పదార్ధాల విక్రయాలు, కొనుగోలు చేసేవారిపై పూర్తి నిఘా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వాటిలో దొరికిన వారిపై క్రిమినల్ కేసులే కాకుండా కఠిన శిక్షలు కూడా పడేలా చేస్తామని, మత్తు పదార్ధాలు విక్రయించే వారిని గుర్తించి వారి అస్తుల్ని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవిజి అశోక్‌కుమార్, ఈగల్ ఐజీ అకే రవి కృష్ణ, గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠీ, కృష్ణ జిల్లా ఎస్పీ అర్ గంగాధర్, పల్నాడు ఎస్పీ కె శ్రీనివాసరావు, జిందాల్ ఫ్లాంట్ ఎండీ చారీ, జీఎమ్ రామకృష్ణ, ఇతర పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూరోపియన్ యూనియన్ అధ్యక్షురాలు భారత్ పర్యటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** యూరోపియన్ యూనియన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్ లేయేన్ వచ్చే వారం రెండురోజులపాటు భారత్‌లో పర్యటించనున్నట్లు విదేశాంగశాఖ ప్రకటించింది. ఆమెతోపాటు హైపవర్ యూరోపి యన్ యూనియన్ కాలేజ్ ఆఫ్ కమిషనర్లు కూడా భారత్‌లో పర్యటిస్తారు. ఈనెల 27,28 తేదీల్లో ప్రధాని నరేంద్రమోడీ ఆహ్వానంమేరకు భారత్ పర్యటనకు వస్తున్నారు. భారత్‌లో ఈయూకాలేజ్ ఆఫ్ కమిషనర్లు మొదటిసారి పర్యటనకు వస్తున్నారు. ప్రధానిమోడీతో ఉర్సులా వాండర్ లేయెన్ ప్రతినిధిబృందం స్థాయి చర్చలు జరుపుతారు. ఈయూ ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్, ద్వైపాక్షికమంత్రిత్వస్థాయి సమావేశాలు జరుగుతాయి. యూరోపియన్ యూనియన్ కమిష నర్లు, భారతప్రతినిధిబృందంతో సమగ్ర చర్చలుజరుపుతారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలిగా ఉర్సులా వాండర్‌లేయన్ మూడ ోసారి పర్యటనకు వస్తుఆన్నరు. 2022 ఏప్రిల్‌లో మొదటిసారి ద్వైపాక్షిక పర్యటనగా వచ్చారు. ఆ తర్వాత 2023 సెప్టెంబరులో జి20 నేతల సదస్సుకు భారత్‌లో పర్యటించారు. గత ఏడాది యూరోపియన్ పార్ల మెంటరీ ఎన్నికలు జరిగిన తర్వాత ఈయూ కళాశాల ఉంటాయన్నారు.


సరుకు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల, ఆనం, ఎంపి వేమిరెడ్డి తదితరులు

# వచ్చే నెలలో కొత్త రేషన్ కార్డులు

## - పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

**బుచ్చి (నెల్లూరు)ఫిబ్రవరి 22 ప్రభాతవార్త** వచ్చే నెలలో ఆధునిక టెక్నాలాజితో క్యూ ఆర్ కోడ్‌తో కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సంగం మండలం జెండాదిబ్బ వద్ద స్టాక్ పాయింట్‌ను ,దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. స్టాకు పాయింట్‌లో ఉన్న సరుకు పూర్తిగా పరిశీలించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం మహిళల పక్షపాత ప్రభుత్వం అని అన్నారు. వచ్చే నెల నుండి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డులు రానున్నాయని తెలిపారు. రేషన్‌కార్డులలో మార్పులు,చేర్పులకు అవకాశం ఉంటుందని అన్నారు. ఎన్నికల మ్యానిపెస్టులో ఇచ్చిన విధంగా దీపం-2 పథకం హామిని సిఎం చంద్రబాబు నెరవేర్చారని,ఇందులో భాగంగా ఈ జిల్లాలో 4 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణి చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో93.42 లక్షల మందికి గ్యాస్ కనక్షన్ ఇచ్చామని తెలిపారు. మేనెల నుండి అన్ని సంక్షేమ హాస్టళ్ళలలో పాఠశాలల్లో మధ్యహ్న బోజనం పథకాన్ని మంచి సన్నబియ్యంతో పంపిణి చేస్తామని తెలిపారు. కోవూరు నియోజకవర్గం శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అహర్నిశలు శ్రమిస్తు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ప్రజలందరు కూడా మంచి పరిపాలన అందిస్తున్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలని కోరారు.అనంతరం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతు మంత్రి నాదెండ్ల మనోహర్ క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారని,ఇలాంటి చిత్తశుద్ధి గల మంత్రి సివిల్ సప్లయిస్ కి మంత్రిగా ఉండడం మనందరి అదృష్టమని అన్నారు. జిల్లాలోని స్టాక్‌పాయింట్లు అధికారులు అందరు అప్రమత్తమై ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రజలకు తుకాల్లో తేడాలు లేకుండా నాణ్యమైన వస్తువులు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేమూలపాటి అజయ్‌కుమార్, రాష్ట్ర వక్స్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తిక్, ఆర్డీవోపావని, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి,డిసివో గురప్ప, సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, మున్సిఫల్ చైర్‌పర్సన్ సుప్రజా మురళీ,వైస్ చైర్‌పర్సన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఎం.వి శేషయ్య, జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, బత్తల హరికృష్ణా, వింజం రామానాయుడు, కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్, కౌన్సిలర్ బెళ్ళం మల్లారెడ్డి, డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి శ్రీదేవి,ఎంపిఎం శ్రీదర్,మెప్మా ఎపిఎం అంకయ్య, కౌన్సిలర్ చీర్ల ప్రసాద్‌యాదవ్,తాళ్ళ నరసింహస్వామి, టిడిపినాయకులు పఠాన్ మహబూభాషా, కౌన్సిలర్ రహమత్, జెండా దిబ్బ టిడిపి నారాయణనాయుడు, నరేష్ చౌదరి,వెంకటరత్నం, చిన్న జబ్బార్, తదితరులు పాల్గోన్నారు. మంత్రులకు ఘనస్వాగతం మంత్రులు ఆనం రామనారాయణరెడ్డికి, సివిల్ సప్లయ్ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని టిడిపినాయకులు మోర్ల మురళీ, కౌన్సిలర్ చీర్ల ప్రసాద్ యాదవ్ క్రేన్‌తో మాల తెప్పించి ఘన స్వాగతం పలికారు.

# అదానీ ప్రయోజనాలు కోసమే మోడీ అమెరికా ప్రయాణం

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి. హరినాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథరెడ్డి

**తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్ర మోదీ ఆగమేఘాలపై అమెరికాకు వెళ్ళింది కేవలం అదాని ప్రయోజనాలను కాపాడేందుకేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యులు పి. హరినాథరెడ్డి తీవ్రంగా విమర్శించారు. స్థానిక బైరాగిపట్టెడ సీపీఐ కార్యాలయంలో తిరుపతి జిల్లా కార్యవర్గ సమావేశం చిన్నిరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచన విధానం మొత్తం కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకు తమ శక్తి మంచి పని చేస్తున్నాడని ఈ దేశ ప్రజల ప్రయోజనాలను గాలికి వదిలేశారని ట్రంప్ మోదీ సమక్షంలో తీవ్రంగా మాట్లాడుతున్న కనీసం నోరు కూడా మెదపకుండా భారత దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా మోడీ వ్యవహరించడానికి ఆయన తప్పు పడుతూ ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఈ రాష్ట్రాన్ని చిన్నచూపు చూస్తూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రకటించిందని దీన్ని బట్టి చంద్రబాబు నాయుడు మాట్లాడక పోవడం అంటే బీజేపీకి ఎంత అణికి మణిగి ఉంటున్నాడో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని ట్రంప్‌కు తాకట్టుపెడుతున్న మోదీతో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో బీజేపీ అజెండాను మోస్తున్నాడన్నారు. అందులో భాగంగానే దక్షిణ భారతదేశ గుడిలోన్నింటిని తిరిగి రావడం కాషాయ వస్త్రాలు ధరించి మోదీకి వీరభక్తున్ని అని చెప్పుకోవడం నిదర్శనమన్నారు. బీజేపీ బడ్జెట్‌ను వ్యతిరేకించలేని చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిని ఎలా సాధిస్తాడో ప్రజలకు చెప్పాలన్నారు. హిందూత్వం పేరుతో ప్రజలపై భౌతిక దాడులకు పాల్పడుతున్న మతోన్మాద శక్తులను అడ్డుకోవాలంటే జనసేనా దళ్ కార్యకర్తలకు మరింత శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు కోసం పోరాటాలను ఉధృతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం ఇస్తున్న ఉచితాల వలన సోమరిపోతులు ప్రజలు మారుతున్నారని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చెప్పడం సరైన విధానం కాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళీ మాట్లాడుతున్న రానున్న మార్చి నెల లోపు ప్రతి శాఖ మహాసభ పూర్తి చేయాలని అలాగే అన్ని పట్టణాలలో బాడుగ ఇళ్ళలో ఉన్న నిరుపేదలందరికీ ఇళ్ళ స్థలాల మంజూరు కోసం వారందరినీ పోరాటానికి సిద్ధంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేవాదళ్ శిక్షణ ఏర్పాట్లు చేయడానికి శశికుమార్ బండి చలపతి బాధ్యత వహించాలని అలాగే మేధావుల అందరిని ఐక్యం చేస్తూ ప్రజా చైతన్యం కోసం సాహిత్య సమావేశాలు ఏర్పాటు చేయడానికి చిన్నం పెంచలయ్య బాధ్యత వహించాలని సమావేశంలో తీర్మానించారు.


ఎరి(కల్) ముత్తురాజు ధనంజయుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సాహిత్యసంస్థల ప్రతినిధులు

# రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో ఎరి(కల్) ముత్తురాజు ధనంజయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

## అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సభలో వక్తలు

**విజయవాడ,ఫి బ్రవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుభాషను రాజభాషగా చేసి, తొలి తెలుగు శాసనాన్ని చెక్కించిన రేనాటి చోళరాజు ఎరి(కల్) ముత్తురాజు ధనంజయుడి శిలావిగ్రహాన్ని శాసనసభా ప్రాంగణంలో ప్రతిష్టింపచేయాలని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన సభలో వక్తలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముందుగా సంఘ అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ శ్రీమతి పిల్లి లక్ష్మి తులసి జ్యోతి ప్రజ్వలనం చేసి తొలి తెలుగు శాసనకర్త నిలువెత్తు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీశ. 6 నుండి 10వ శతాబ్దం వరకు తెలుగును రాజభాషగా కొనసాగించి తెలుగుభాషను అభివృద్ధి చేసిన రేనాటి చోళమహరాజుల చరిత్రను ఉన్నతవిద్యలో ఒక పాఠ్యాంశంగా చేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. క్రీ.శ. 575 సం.లోనే తెలుగుభాషను రాజభాషగా చేస్తూ శాసనం ముత్తురాజు చేసారన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు

## - 24 నుండి మార్చి 3 వరకు నిర్వహణ

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 22, ప్రభాత'వార్త' :** దుర్గమ్మ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను ఈనెల 24 నుండి 28 వరకు నిర్వహిస్తామని ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు. అలాగే మార్చి 1 నుండి 3 వరకు ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 24న సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీ గంగాపార్వతి సమేత మల్లేశ్వర స్వామి ఉత్సవర్లకు మంగళ స్నానములు, వధూవరులుగా అలంకరిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనము, అంకురార్పణ, మండపారాధన, కలశ స్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర హవనములు, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, తీర్ధ ప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. ఈనెల 25నుండి 28 వరకు మంటప పూజ, మూలమంత్ర హవనములు, హారతి, మంత్రపుష్పం, తీర్ధ ప్రసాద వినియోగం, ఈనెల 26న ఉదయం నుండి సాయంత్రం వరకు శ్రీ మల్లేశ్వర స్వామివార్లకు త్రికాల అభిషేకాదులు, రాత్రి 9 గంటలకు మహన్యాసం, అనంతరం లింగోద్భవ కాల అభిషేకము అనంతరం మహానివేదన, హారతి, మంత్రపుష్పం, శ్రీ గంగాపార్వతి (దుర్గా) సమేత మల్లేశ్వర స్వామివార్ల దివ్యలీలా కళ్యాణోత్సవము జరుగుతాయన్నారు. 27న సాయంత్రం 4 గంటలకు రథోత్సవము, 28వ తేదీన ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకోటోత్సవం, వసంతోత్సవము, అవభృథోత్సవం (దుర్గాఘాట్‌నందు) , తదుపరి ధ్వజారోహణం జరుగుతాయన్నారు. మార్చి 1న శ్రీ మల్లేశ్వర స్వామివార్లకు సాయంత్రం పంచహారతులు, ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవ, మార్చి2, 3వ తేదీల్లో ఉదయం 8 గంటలకు పవళింపు సేవలు జరుగుతాయన్నారు. 26వ తేదీ నిర్వహించే మహాశివరాత్రి కళ్యాణోత్సవంలో పాల్గొన వలసిన ఉభయ దాతలు ఆర్జిత సేవా రుసుము రు.1,116లను చెల్లించి పాల్గొనాలన్నారు. పాల్గొన్న వారికి శేషవస్త్రము, రవిక, శ్రీ చక్రలడ్డూ అందిస్తామన్నారు. టిక్కెట్లను డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు. కనకదుర్గమ్మ. ఓఆర్‌జి నందు టిక్కెట్లు బుక్‌చేసుకోవాలన్నారు.

# కొత్త ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు శిక్షణ

## 28 నుంచి మార్చి 12 వరకు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా నియమితులైన ఉపాధ్యా యులకు పాఠశాల విద్యా శాఖ తరఫున శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్‌జీటీలతోపాటు, స్కూల్ అసిస్టెంట్, పండిట్స్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు 3 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. డీఎస్‌సీ-2024లో నియమితులైన వారికి ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 28 నుంచి శిక్షణను ప్రారంభించ నున్నారు. ముందుగా ఈ నెల 27 నుంచి శిక్షణను ప్రారంభించాలని భావించినప్పటికీ.. 27న రెండు ఉపాధ్యాయ, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ ఉన్న నేపథ్యంలో దానిని కాస్త 28 నుంచి ప్రారంభించాలని షెడ్యూల్‌లో మార్పులు చేశారు. రాష్ట్రంలోని ఎస్‌జీ టీలకు ఈ నెల 28 మార్చి 1, 3 తేదీల్లో శిక్షణ నిర్వహించనున్నారు. మార్చి 4 నుంచి 6 వరకు స్కూల్ అసిస్టెంట్స్(ఎస్‌ఏ), పండిట్స్‌కి శిక్షణ ఇవ్వనున్నారు. మార్చి 10 నుంచి 12 వరకు స్పెషల్ ఎడ్యుకేషననటీచర్లకు శిక్షణ ఇవ్వను న్నారు. 2024 డీఎస్‌సీ ద్వారా ఎంపికైన 10006 మందికి రాష్ట్ర విద్యాశాఖ బోధన ప్రణాళికలో శిక్షణ ఇవ్వనున్నారు. వారికి శిక్షణ ఇవ్వడానికి జిల్లాల స్థాయిలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్(డీఆర్‌పీ)లను ఎంపికచేసి వారికి హైదరాబాద్‌లో ఇప్పటికే శిక్షణ ఇచ్చారు, వారిలో 2006, 2008, 2012, 2017 డీఎస్‌సి పూర్తి చేసినవారు ఉన్నారు. వారందరూ తమ జిల్లాల్లో .. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్త టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఒక్కోబ్యాచ్‌కి 40 నుంచి 45 మంది ఉపాధ్యాయుల చొప్పున ఏర్పాటు చేసి.. జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇవ్వ నున్నారు. ఎస్‌జీటీలకు కొత్త జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనుండగా.. స్కూల్ అసిస్టెం ట్(ఎస్‌ఏ)తోపాటు మిగిలినవారికి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకి వెళ్లే ఉపాధ్యాయులందరికి టీఏ/డీఏ సౌకర్యం కల్పించ నున్నా రు. శిక్షణ జరిగే తేదీల్లో ఉపాధ్యాయులకు ఎలాంటి సెలవులు ఇవ్వరాదని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

### డిఆర్‌పిలకు పాఠశాల విద్యా డైరెక్టర్ నరసింహారెడ్డి సూచనలు

కొత్తగా నియమితులైన డిఎస్‌సి-2024 ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి హాజరైన డీఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలను ఉద్దేశించి డైరెక్టర్ నరసింహారెడ్డి కొన్ని సూచ నలు చేశారు. ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించి ఉంటారని పిల్లలు ఉపాధ్యాయుడు చెప్పిన దేనినైనా నమ్ముతారని అన్నారు.
పరిస్థితులు ఎలా ఉన్నా విద్యార్థిలో ఆలోచనలకు.. ఆలోచనల మార్పునకు దోహదపడే విధంగా ఉపా ధ్యాయులు ఉండాలన్నారు. ఇప్పుడు ఎఫ్‌ఎల్‌ఎన్‌లో భాగంగా విద్యార్థులను ఒక నిమిషంలో ఎన్ని పదాలు చదవగలుగుతారో పరీక్షిస్తున్నారు. కానీ ఉపాధ్యా యులుగా మీరు ఎప్పుడైనా ఒక నిమిషంలో ఎన్ని పదాలు చదవ గలరో పరీక్షించుకున్నారా అని ఆర్‌పీలను డైరెక్టర్ ప్రశ్నించారు. పిల్లలకు ఇచ్చిన పాఠ్య పుస్తకాలు అభ్యాసానికి అనుగుణంగా ఉన్నాయని.. పాఠ్యపుస్తకంలోనే అభ్యాసాల సాధనకు వీలుగా ఉన్నాయని.. దాంతోపాటు అదనంగా వర్క్ బుక్స్ అంటే అభ్యాసపత్రాలు సాధన చేద్దాం పేరుతో ఇచ్చారు. ఈ రెండింటిని సమన్వ యం చేసుకొని బోధించేలా ఉపాధ్యాయుల కొరకు హ్యాండ్‌బుక్స్ కూడా ఇచ్చామని అన్నారు. మూడింటిని సమన్వయం చేసుకుంటూ బోధన కొనసాగిస్తే పిల్లలు తప్పకుండా చదవడం.. రాయడం నేర్చుకుంటారని అన్నారు. పిల్లలు పాఠశాలకు రాకముందే మాట్లాడటం నేర్చుకుని ఉంటారు. కాబట్టి వారికి బడికి వచ్చాక చదవ డం. రాయడం నేర్పించడంపై దృష్టి పెట్టాలన్నారు. అందుకొరకు సాంకేతికను కూడా ఉపయోగించి బోధన చేయాలని నరసింహారెడ్డి సూచించారు.

# బిట్‌కాయిన్ పేరుతో మోసం..

## చెన్నైలో నిందితుని అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్, హైదరా బాద్‌లోని బాధితుడు (35) బిట్‌కాయిన్ ఇండియా సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బిట్‌కాయిన్ ఇండియా వాలెట్ ఎక్స్ఛేంజ్ ద్వారా మోస పో యానని పేర్కొన్నాడు. బాధితుడు బిట్‌కాయిన్ ఇండియా నుండి రూ. 8,49,585 విలువైన క్రిప్టోకరెన్సీ 256416 క్యూటీని కొనుగోలు చేశాడు. అయితే కొన్ని తెలియనికారణాల వల్ల బాధితుడి ఖాతాను సస్పెండ్ చేసి, సమీక్షలో ఉందని పేర్కొంటూ, బాధితుడి ఖాతాను రద్దుచేసి/బ్లాక్‌చేశాడు. ఆ తరువాత బాధితుడు తన ఖాతాలోకి లాగిన్ అవ్వగలిగాడు కానీ అతను తన ఖాతా బ్యాలెన్స్ పోర్ట్ ఫోలియోను తనిఖీ చేసినప్పుడు అది సున్నా, గడువు ముగిసినట్లు కనిపించింది. బాధితుడు వెంటనే ఇ మెయిల్ ద్వారా బిట్ కాయిన్ ఇండియా వాలెట్ మద్దతును సంప్రదిస్తే మోసగాడు నిర్వహణ రుసుం పేరిట అతని మొత్తం నిధులను దోచుకున్నాడు. కాగా హైదరా బాద్‌లోని సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. నిందితుడు రామ కృష్ణారెడ్డి తన సోదరుడితో కలిసి భారతదేశ మంతటా అమాయక క్రిప్టోకరెన్సీ వ్యాపారులను మోసం చేయడానికి ప్రణాళికను రూపొం దించారు. అందులో భాగంగానే వారు బిట్‌కాయిన్ ఇండియా సాఫ్ట్‌వేర్ సర్వీ సెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీని ప్రారంభించి, 'క్రిప్టోకరెన్సీ అప్లికేషన్ బిట్‌కాయిన్ ఇండియా వాలెట్ ఎక్స్ఛేంజ్' వెబ్‌సైట్‌ను సృష్టించారు. ఈ కేసు లో ఫిర్యాదుదారుడిని మోసం చేసిన నిందితుడు రామకృష్ణారెడ్డిని హైదరా బాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చెన్నైలోని అన్నానగర్‌లో అరెస్టు చేశారు.

## గుండ్ల సింగారం సలీమాను ఆదుకోవాలి

### సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 22:** కాలిన గాయాలతో దీనస్థితిలో మంచానికే పరిమితమైన సలీమాను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తక్షణమే ఆమెకు తగిన వైద్య సహాయం అందించడంతో పాటు దివ్యాంగుల పింఛను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు కూడా ఇవ్వాలని సీఎం అధికారులకు సూచించారు. వంట చేసుకుని తినే పరిస్థితి లేకపోవడంతో ఆమెకు భోజనం సదుపాయం కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం గుండ్ల సింగారం గ్రామానికి చెందిన సలీమా దీనస్థితిపైన ఓ పత్రికలో వచ్చిన కథనంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తో మాట్లాడారు. కాలిన గాయాల కారణంగా సలీమా నరాలు దెబ్బతినడంతో ఆమె మంచానికే పరిమితమయ్యారు. దీంతో సలీమా పదేళ్ల కుమార్తె రిజ్వానా తల్లికి సపర్యలు చేస్తోంది. ఒక వైపు తల్లి బాధ్యతలు చూసుకుంటూనే బడికి వెళ్లి చదువుకోవడం విశేషం.



దేవనార్ అంధుల పాఠశాలలో దాతలను సత్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## దివ్యాంగులు సమున్నతంగా ఎదగాలి

### దేవనార్ అంధుల పాఠశాల వార్షికోత్సవాల్లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (బేగంపేట) ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** దివ్యాంగులు మరెంతో ఉన్నత స్థాయికి ఎదగాలని, ఉన్నత చదువులు చదివి సమాజానికి ప్రయోజనకరంగా మారాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. శనివారం బేగంపేట దేవనార్ అంధుల పాఠశాల 33వ వార్షికోత్సవాల్లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అంధ విద్యార్థినీ విద్యార్థులు బాగా చదువుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఎన్నో యేళ్లుగా దేవనార్ పాఠశాల ఎదుగుదలలో భాగస్వాములైన దాతలను ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా సన్మానిం చారు. ముందుగా దేవనార్ విద్యార్థులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఆహూ తులను రంజింపజేసాయి. ముందుగా దేవనార్ అంధుల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సాయిబాబాగౌడ్, సహవ్యవస్థాపకుడు జ్యోతిగౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే మద్దతు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 27న జరగనున్న కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మద్ధతు ఇస్తు న్నట్టు సిపిఐ ప్రకటించింది. ఆ నియోజవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులైన ఓటర్లకు సిపిఐ విజ్ఞప్తి చేసింది. తమకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి మేరకు.. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ రాసిన లేఖపై నిర్ణయం తీసుకున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెఇపారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న స్నేహ ధర్మం ప్రకారం సానుకూలంగా స్పందిస్తున్నట్టు ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగం కల్పించిన సమైక్య స్ఫూర్తిని కేంద్రంలోని బీజేపీ విఘాతం కలిగిస్తుందన్నారు. 12 యేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి.. రాష్ట్రం నుండి చెల్లించిన పన్నుల్లో న్యాయబద్ధంగా రావలసిన వాటానే ఇచ్చిందే తప్ప.. తెలంగాణకు అదనంగా చేసిందేమీ లేదన్నారు.



## సబ్బండ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యం

### ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**రామగిరి, ప్రభాతవార్త:** సబ్బండ వర్గల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధరాబాబు అన్నారు.పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన ప్రచారం కార్యక్రమాల్లో భాగంగా శనివారం మండలంలోని సెంటినరీకాలనీ ఐఎన్టీయుసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు,ఉపాధ్యాయుల సమస్యల పై పూర్తి పరిజ్ఞానంతో ఉన్న ఆల్ఫోర్స్ కళాశాలల కరస్పాండెంట్ అధికారులు, కార్మికులు బారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కొరారు. గత టీఆర్ఎస్ పది సంవత్సరాల కాలంలో డిఎస్సీ, గ్రూప్1 పోస్టులు ఉసేత్తలేదని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన సంవత్సరంలోనే న్యాయపరమైన చిక్కులను పూర్తి చేస్తు 56వెల ఉద్యోగాల ఖాళీల భర్తీ చేశామన్నారు. ముఖ్యంగా సింగరేణిలో చాల సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న క్లారికల్ ఉద్యోగ అవకాశాలను కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్లు అప్పులు అదనంగా వాటికిసంబందించిన సంవత్సరానికి వడ్డీ రూ.67వెల కొట్లు చెల్లింపు చేపడుతున్నామన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ అవసరాలు తీరుస్తాం

### దేశంలో తెలంగాణ పోలీస్‌కు మంచి పేరుంది

### ప్రతి పౌరుడు సురక్షితంగా జీవించేందుకు భద్రత పెరగాలి

### పోలీసు ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 22:** రాష్ట్రంలో ప్రతి పౌరుడు సురక్షితంగా జీవిస్తున్నారు అన్న భరోసాతో ఉండాలి, ఆ మేరకు పోలీసు శాఖ అవసరాలు తీర్చే బాధ్యత మేము తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో హోంశాఖ ప్రీ బడ్జెట్ సమావేశాల్లో ఆయన పలు అంశాలపై పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. తెలంగాణ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది, నగర రాజ్యముగ రాష్ట్రం స్థిరపడుతుంది అని వివరించారు. హైదరాబాదులో ప్రస్తుతం ఉన్న మూడు నగరాలకు తోడు నాలుగవ నగరం ఫ్యూచర్ సిటీ సైతం సిద్ధం అవుతుంది, రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వనరులు, వాతావరణం, ఉపాధి అవకాశాల నేపథ్యంలో పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు, రాష్ట్రానికి వలసలు పెరుగుతున్నాయని ఈ మేరకు భద్రత విషయంలో హోం శాఖ సిద్ధం కావాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. సహజంగానే ఉండే సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కరిస్తామని పోలీసు ఉన్నతాధికారులకు డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు ఉంది, ప్రధానంగా సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం విషయంలో దేశంలో అగ్రస్థానంలో ఉన్నారు అందుకు ఉన్నతాధికారులు, సిబ్బందికి డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నివాసానికి క్వార్టర్స్ నిర్మించాల్సిన అవసరం ఉందని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి అవకాశం ఉందో వెంటనే ప్రతిపాదనలు పంపించాలని డిప్యూటీ సీఎం పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. సి ఎస్ఆర్ నిధులు సమీకరించేందుకు అవకాశం ఉన్న ప్రతి చోట అధికారులు ప్రయత్నం చేయాలని, పోలీస్ శాఖ బలోపేతానికి వాటిని వినియోగించుకోవాలని సూచించారు. గత ఏడాది కాలంగా పోలీస్ శాఖలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య, ప్రస్తుతం ఉన్న ఖాళీల వివరాలు పైన సమీక్షించారు. గ్రేహౌండ్స్, నార్కోటిక్స్, ఇంటలిజెన్స్, ఫైర్,ఎక్స్ సర్వీస్‌మెన్ మొత్తం ఎనిమిది విభాగాల ఉన్నతాధికారులు వారి బడ్జెట్ అవసరాలపై సమావేశంలో నివేదిక సమర్పించారు. డిజిపి జితేంద్ర మొత్తం శాఖ పరంగా అవసరమైన బడ్జెట్ పై నివేదిక సమర్పించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రవి గుప్తా, డీజీ అభిలాష్ బిస్త్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ సిటీ కమిషనర్ సివి ఆనంద్, రాచకొండ సి పి సుధీర్ బాబు, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు.



శనివారం సచివాలయంలో హోంశాఖ ప్రీబడ్జెట్ సమా వేశాల్లో పలు అంశాలపై పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

## కాంగ్రెస్‌లో ఉంటూ విపక్ష నేతలతో చీకటి సమావేశాలు

### అభివృద్ధి పనులను అడ్డుకోవడం హాస్యాస్పదం

### నాయకుల తీరు మారాలి : వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీలో 40 యేళ్ల రాజకీయ చరిత్ర కలిగిన కొందరు సీనియర్ నాయకుల తీరు మార్చుకుని వనపర్తి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని, కడుపులో కత్తెర్లు.. నోట్లో చక్కెర్లు అన్న చందంగా ఉండకూడదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు భూమి పూజలు నిర్వహించారన్నారు. 18 కోట్ల రూపాయల పనులకు వారు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెద్దమందడి మండలం వెల్టూర్‌లో నూతన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేశారు. అనంతరం జాతీయ రహదారి బుర్రవాగు స్టేజి నుంచి మోజెర్ల గ్రామానికి రహదారిపై వంతెనల నిర్మాణాలకు వారు భూమి పూజ చేశారు. అనంతరం పెద్దమందడి మండలానికి మంజూరైన పదివేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థం గల గోద నిర్మాణాలకు వారు శంకుస్థాపన భూమి పూజలు నిర్వహించారు. పెబ్బేరు మండల కేంద్రంలో గోదాం నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. బుద్ధారం గండి పుల్కా పహాడ్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించే గోపాల్‌పేట, రేవల్లి ,ఏదుల మండలాలకు సంబంధించిన నూతన మార్కెట్ యార్డ్ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రతిపక్ష నాయకులతో చీకటి సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఈ చీకటి సమావేశాల అంతరార్థం ఏమిటో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. సీనియర్ మంత్రి నీతి నిజా యితీకి మారుపేరైన తుమ్మల నియోజకవర్గానికి రావడం కొంతమందికి ఇష్టం లేకనే ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# ప్రశ్నించే గొంతుకు ప్రాధాన్యత ఇవ్వండి

### కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో నమ్మకం పోయింది

### 317 జిఓ ప్రకారం న్యాయం జరగలేదు : డికె అరుణ



శనివారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ జాతీయ ఉపాధ్య క్షురాలు డికె అరుణ

**హన్మకొండ బ్యూరో, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో జరిగే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ అన్నారు. శనివారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో జరిగిన మీడియాలో సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ అభ్యర్థి సరోత్తంరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్ సర్కారు పనితీరుపై డికె. అరుణ సెటైర్లు వేశారు. రేవంత్ పాలనకు.. మోడీ పాలనకు నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నదని అన్నారు. ప్రజల్లో మీమీద, మీ పాలనపై ఎంత నమ్మకం, విశ్వాసం ఉందో తెలుసుకో అన్నారు. 2047 కల్లా భారత్‌ను ఆర్థికంగా తొలి స్థానంలో నిలిపేందుకు మోడీ కృషి చేస్తున్నారని అన్నారు. మోడీ పాలనపై విశ్వాసంతోనే మూడోసారి ప్రజలు ఆయనను ప్రధానిగా గెలిపించారన్నారు. రాష్ట్రంలోని మూడు స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు గెలుస్తారన్న నమ్మకం ఉన్నదని డికె అరుణ అన్నారు. ముఖ్యంగా వరంగల్ ఖమ్మం నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి సరోతంరెడ్డి గెలుపు ఖాయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది, అందుకే కనీసం అభ్యర్థులకు కూడా పోటీలో పెట్టలేద న్నారు.

ముఖ్యంగా తెలంగాణలో ఉపాధ్యాయులు, విద్యా రంగ సమస్యలు పరిష్కారం కావాలంటే.. బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలని టీచర్లు, మేధావులు మీ మొదటి ప్రాధాన్యత ఓటును సరోత్తంరెడ్డికి వేసి గెలిపించాలి అని కోరారు. ఎన్నికల హామీలుగా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మీరిచ్చిన హామీలు ఏమయ్యాయి అన్నారు ఇప్పటి వరకు 4 డిఏ లు లేవు పీఆర్సీ లేదు, బిల్లులు మంజూరు కావడం లేదు సిపిఎస్ రద్దు చేయలేదు 2003 డిఎస్‌సి అభ్యర్థులకు ఒపిసి అమలు చేయడంలేదు.

జూనియర్ ఇంటర్ కాలేజీలలో లెక్చరర్‌ల భర్తీ కాలేదు అని అన్నారు. వరంగల్ జిల్లాలో 317 జీవో ప్రకారం చాలా మందికి న్యాయం జరగలేదు అన్నారు. ముఖ్యంగా 2003 డిఎస్‌సి లో ఎంపికైన వారిలో ఎక్కువ మంది స్కూల్ అసిస్టెంట్‌లు వరంగల్ లోనే ఉన్నారు వారందరికీ ఓ పి సి అమలు చేయాలని కేంద్ర జీవో ఇచ్చినా వీళు అమలు చేయడం లేదు అని అన్నారు. మరి ఇంకెందుకు కాంగ్రెస్ పార్టీని ఉపాధ్యాయులు నమ్మాలి అని ఇప్పటికయినా టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు, మేధావులు ఆలోచించి ఓటు వెయ్యాలి అని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్న నాయకుడు సరోత్తంరెడ్డిని గెలి పించాలని అని కోరారు.

## కులగణన సర్వే దేశానికి తెలంగాణ రోల్‌మోడల్

### సామాజిక న్యాయం కాంగ్రెస్‌తో సాధ్యం

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** కులగణన సర్వేతో తెలంగాణ దేశానికి రోల్‌మోడల్‌గా మారిందని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ బిసి కులగణనతో కొత్త అధ్యాయం మొదలైందని అన్నారు. మోడీ దేశవ్యాప్తంగా కులగణ చేయాలని డిమాండ్ చేశారు. బిహార్, కర్ణాటకలో కులగణన సర్వేచేశారు అసెంబ్లీలో తీర్మాణం చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ల చట్టబద్ధపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని మహేష్ కుమార్‌గౌడ్ కీలక ప్రకటన చేశారు. అన్ని పార్టీలకు తీసుకుపోయి కేంద్రంతో చర్చిస్తామని అన్నారు. బిసిలకు సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని వెల్లడించారు. రాహుల్‌గాంధీ 25 రోజులు తెలంగాణలో పాద యాత్ర చేశారు ఎన్నో ఇబ్బందులు ఎదొర్కొని సోనియాగాంధీ తెలం గాణను ఇచ్చారు అని గతంను మహేష్‌కుమార్ నెమరేసుకున్నారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు సమగ్రకులగణ చేపట్టామని తెలిపారు. పారదర్శకంగా సర్వే ఉండాలని ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యం చేశామని తెలిపారు.

## కుటుంబాన్ని వేధింపులకు గురిచేస్తున్న కన్నతండ్రిని కడతేర్చిన కొడుకు!

**హైదరాబాద్ (కుషాయిగూడ), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** కుటుంబాన్ని పోషించాల్సిన తండ్రి బాధ్యత విస్మరించి తన తల్లిని, కూతురును, కొడుకును సైతం వేధింపులకు గురిచేస్తున్న ఓ కన్నతండ్రిని కడతేర్చిన ఉదంతం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ లాలాపేట్ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన ఆర్ ఎల్ ఈ మొగిలిగౌడ్ (45) భార్య, కుమారుడు సాయికుమార్(25) కూతురుతో కలిసి హైదరాబాద్ లోని లాలాపేట్ ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. తండ్రి మొగిలిగౌడ్, కుమారుడు సాయికుమార్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ ఏజెన్సీలో పనిచేస్తున్నారు. మృతుడు మొగిలిగౌడ్ బాధ్య తను విస్మరించి ప్రతిరోజు తప్ప తాగి భార్యను, కుమారుడు కూతురిని వేధింపులకు గురి చేస్తున్నాడు. కాగా ఈ నెల 22న (శనివారం) మొగిలి గౌడ్ ఇంట్లో భార్యను కొట్టడంతోపాటు కుమారుడు సాయికుమార్‌పై కత్తెరతో దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. విసుగు చెందిన కుమారుడు సాయి కుమార్ ఈసీఐఎల్‌కు వెళ్తున్న తన తండ్రి మొగిలి గౌడ్‌ను వెంబడించి ఈసీఐఎల్ చౌరస్తాలో బస్సు దిగగానే తన ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి, కింద పడిపోయిన తండ్రిని తన వెంట తెచ్చుకున్న కత్తితో 14 కత్తిపోట్లు పొడిచాడు. సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలపాలైన బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు గురుకుల ఎంట్రన్స్ టెస్ట్

### 1.69 లక్షల దరఖాస్తులు

### విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో అడ్మిషన్లతోపాటు.. 6 నుంచి 9వ తరగతిలో మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం నేడు(ఆదివారం) రాష్ట్రంలో ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. నేడు ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కోసం మొత్తం 1,69,171 దరఖాస్తులు వచ్చాయి. 643 ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాలు ఉన్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా 15వేల దరఖాస్తులు వచ్చినట్టు మంత్రి తెలిపారు. వాటిలో 5వ తరగతిలో 51,880 సీట్లు ఉండగా 89,246 మంది విద్యార్థులు, 6 వ తరగతిలో 2271 సీట్లు ఉండగా 20088 మంది, 7వ తరగతిలో 1034 సీట్లు ఉండగా 19108 మంది, 8వ తరగతిలో 1006 సీట్లు ఉండగా 15746 మంది, 9 వ తరగతిలో 1150 సీటు ఉండగా 11983 మంది దరఖాస్తు చేసుకున్నారని మంత్రి తెలిపారు. కార్పోరేట్ పాఠశాలల కంటే మెరుగైన సౌకర్యాలు, సిబ్బంది ఉన్నందున గురుకులాల్లో చేరే వారి సంఖ్య పెరుగుతోందని, అన్నీ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రవేశపరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఎంట్రన్స్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆల్ ది బెస్ట్ చెప్తూ శుభాకాంక్షలు తెలిపారు. నేడు జరిగే గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను విధ్యార్థులంతా ప్రశాంత వాతావరణంలో రాయాలని.. అందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పిన మంత్రి పొన్నం ప్రభాకర్.. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కాళేశ్వరం కూలడంతో కరవు

### కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కమీషన్లకు కక్కుర్తి పడి, కచరా కరువు తెచ్చారని కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో శనివారం మీడియాతో మాట్లడుతూ రాష్ట్రంలో నలభై ఏడు వేల కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలడం వల్లనకరువు వచ్చిందని ఆయన దుయ్యబట్టారు. పది సంవత్సరాలు కృష్ణా పరీవాహక ప్రాజెక్టులను పెండింగ్ పెట్టినారని ఆరోపించారు. రాయలసీమ రాగిసంకటి నాటుకోడి పులుసు తిని నీటి వాటాలను కొల్లగొట్టిన దొంగలు మిగిల్చిన కరువు అంటూ ఆయన కెటిఆర్ కరువు విమర్శలను తిప్పకొట్టారు. మీరు కట్టిన ప్రాజెక్టులతో మీ కుటుం బం జేబులు మాత్రమే నిండాయని ఆయన అన్నారు. తెలంగాణలో చెరువులు నిండలేదని తెలిపారు.



డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

## హాస్టళ్లకు మెస్, విద్యుత్ బిల్లులు, ఇంటి అద్దెలు చెల్లించాలి

### ప్రభుత్వానికి ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** బిసి కాలేజీ హాస్టళ్ళ మెస్ బిల్లులు, ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని రాజ్యసభసభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సంఘం ప్రతినిధి బృందం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గత ఐదు నెలలుగా బిసి హాసళ్ళ మెస్ బిల్లులు, 3 సంవత్సరాల నుంచి అద్దె భవనాలకు బిల్లులు, కరెంట్ బిల్లులు చెల్లించడం లేదని, దీంతో విద్యార్థులు ఆనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు, మాంసం, గుడ్ల బిల్లులు, పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర బిల్లులు 5 నెలలుగా చెల్లించడం లేదని, దీంతో హాస్టళ్ళకు కూరగాయలు, పప్పులు, గుడ్లు తదితర వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు, వ్యాపారులు అప్పులపాలైనారని విచారం వ్యక్తం చేశారు. దీంతో హాస్టళ్లు మూసివేసే పరిస్థితి వచ్చిందన్నారు. కరెంట్ లేకపోతే విద్యార్థులు చదువుకోవడానికి చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే హాస్టళ్ళకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బిసి నేతలు నీల వెంకటేష్, గోరిగె మల్లేష్, లాల్‌కృష్ణ తదితరులు ఉన్నారు.

## ప్రేమ వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

**బిజినేపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ప్రేమ పేరుతో వేధింపులు తాళలేక అవమాన భారంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన వట్టెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడింది. తండ్రి శ్రీశైలం, తల్లి సుజాత తెలిపిన వివరాల మేరకు.. బంధువుల ఇంట్లో వివాహానికి తల్లి సుజాత వెళ్లగా, తండ్రి శ్రీశైలం గేదెలు మేపేందుకు పంట పొలాలకు వెళ్లాడు. కాగా గ్రామానికి చెందిన సొంట మల్లేష్, శివ కొద్దిరోజులుగా ప్రేమ పేరుతో ఆమెను వేధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి వద్ద ఎవరులేని సమయంలో మల్లేష్, శివ గురువారం సాయంత్రం తగువులాడడంతో అవమానభారం భరించలేక సదరు యువతి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇరుగుపొరుగు వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు ఆమె మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న కేసు దర్యాప్తు చేస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై కె శ్రీనివాస్ తెలిపారు.

# ఉద్యోగుల పెండింగ్ బిల్లులను చెల్లించాలి

### డిఎలు, హెల్త్ కార్డులు, పిఆర్‌సిలను ప్రకటించాలి

### టిజిఓ కేంద్ర సంఘం కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలతోపాటు హెల్త్ కార్డ్స్, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని శనివారం జరిగిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం కార్యవర్గ తీర్మానం చేసింది. కేంద్ర సంఘ కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగింది. కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు బి శ్యామ్, కోశాధికారి ఎం ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏ జగన్మోహన్ రావు, బి సహదేవ్, ఎం రామకృష్ణ గౌడ్, నరహరి రావు, ప్రొఫెసరల్ మల్లేశం, మహిళా ప్రతినిధి దీపారెడ్డి, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతోపాటు సచివాలయం, హైదరాబాద్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం 106 శాఖల ఫోరమ్స్ అధ్యక్ష, కార్యదర్శుల పాల్గొన్నారు. ఆర్థిక శాఖ (ఈ-కుబేర్)లో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే చెల్లించాలని తీర్మానించింది. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని తీర్మానించినట్టు సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వం మరియు ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ సమాన నిష్పత్తిలో చేసి ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఇహెచ్ఎస్)ను వెంటనే అమలు పరచాలన్నారు. ట్రస్ట్‌లో ఉద్యోగులకు సమాన భాగస్వామ్యం ఉండాలని తీర్మానించినట్టు తెలిపారు. రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్(సీపీఎస్)ను రద్దు చేసి పాతపెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ చేయాలని తీర్మానించారు.

ఉద్యోగ సంఘాలకు రికగ్నైజేషన్ పునరుద్ధరించి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను మరియు ఆఫీసర్స్ కమిటీని ఏర్పాటు చేసి రికగ్నైజ్డ్ సంఘాలకు ఆన్ డ్యూటీ(ఓడీ) ఫెసిలిటీని రెగ్యులర్ బేసిస్‌లో పునరుద్ధరించాలని తీర్మానించారు. డీపీసీని సెప్టెంబర్ మాసంలోనే అన్ని శాఖలలో నిర్వహించి ఉద్యోగులకు వెంటనే పదోన్నతి కల్పించాలి.. పీఆర్‌సీ రిపోర్ట్‌ను వెంటనే తెప్పించుకొని ఉద్యోగులకు తెలంగాణ రెండవ పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని తీర్మానించారు. జి.ఓ.317 అమలులో నష్టపోయి ఉద్యోగులు చేసుకొన్న ఫిర్యాదులను, దరఖాస్తులను పరిశీలించి క్యాబినెట్ కమిటీ సమర్పించిన నివేదిక ప్రకారం ఉద్యోగ సంఘ ప్రతినిధులతో చర్చించి ఉద్యోగులకు న్యాయం చేయాలని తీర్మానించారు. పదవీ విరమణ పొందిన అధికారుల సర్వీసు పొడిగింపు ఎట్టి పరిస్థితిలో చేయరాదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు శ్రీనివాస రావు తెలిపారు. తీర్మానాల వినతి పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు మంత్రివర్గ ఉప సంఘానికి, త్రిసభ్య కమిటీకి (ఉద్యోగుల సమస్యలపై వేసిన) అంద చేయనున్నట్టు వారు తెలిపారు.

23-2pg10.qxd:23-2pg10.qxd 01/01/01 7:32 AM Page 1



## హాకీ ప్రో లీగ్‌లో భారత్‌కు
# మరో విజయం
### 3-1తో ఐర్లాండ్‌పై గెలుపు



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రొలీగ్‌లో భారత పురుషుల జట్టుకు మరో విజయం లభించింది. భువనేశ్వర్‌లో జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా 3-1 గోల్స్ తేడాతో ఐర్లాండ్ జట్టును ఓడించింది. భారత్ తరఫున మన్దీప్ సింగ్ (22వ నిమిషంలో), జర్మన్‌ప్రీత్ సింగ్ (45వ నిమిషంలో), సుఖ్జీత్ సింగ్ (58వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఐర్లాండ్ జట్టుకు జెరెమీ డంకన్ (8వ నిమిషంలో) ఒక గోల్ అందించాడు. మరోవైపు జర్మనీతో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 0-4 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది.

## కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో..
# హర్యానా శుభారంభం



### తెలంగాణ, ఆంధ్ర జట్లు ఓటమి

**న్యూఢిల్లీ:** సీనియర్ జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హరియాణా శుభారంభం చేసింది. కటక్‌లో ప్రారంభమైన ఈ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తొలి విజయం హరియాణా దక్కించుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జట్లకు ఓటమి ఎదురవగా, హరియాణాతో పాటు రైల్వేస్, మధ్యప్రదేశ్ జట్లు కూడా భారీ విజయాలతో టోర్నీని ఆరంభించాయి. పూల్ ఎ లో హరియాణా 50-20 స్కోరుతో తెలంగాణ జట్టును ఓడించింది. పూల్ డి లో మధ్యప్రదేశ్ 59-35తో ఆంధ్రప్రదేశ్ ఘనవిజయం సాధించింది. ఇదే పూల్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో చండీగఢ్ 40-24తో గుజరాత్‌పై గెలిచింది. అలాగే పూల్ బి లో రైల్వేస్ 59-17తో మణిపూర్‌పై ఏకపక్ష విజయం సాధించగా, పూల్ ఎఫ్ లో ఒడిశా 57-28తో విదర్భపై జయభేరి మోగించింది. ఇక పూల్ సి లో మహారాష్ట్ర 39-35తో కేరళపై పోరాడి గెలిచింది. కాగా జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ బరిలో ఉన్న 30 జట్లను ఎనిమిది పూల్స్‌గా విభజించారు. ఆయా జట్లతో ముందుగా ప్రిలిమినరీ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. ఒక్కో పూల్ నుంచి రెండేసి జట్ల చొప్పున నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి.

# టాప్స్ నుండి వినేశ్, భజరంగ్, శ్రీకాంత్ ఔట్
### జాబితాలో తెలంగాణ అమ్మాయి నిఖత్




**న్యూఢిల్లీ:** మెగా ఈవెంట్స్‌లో పతక విజేతల్ని తయారు చేయడమే లక్ష్యంగా అమలు చేస్తున్న టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) జాబితాను కేంద్ర క్రీడా శాఖ కుదించింది. క్రీడాకారుల ప్రదర్శన ఆధారంగా పారదర్శకంగా ఈ జాబితాను రూపొందించామని, కేవలం ప్రతిభే ప్రామాణికంగా తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలో గతంలో 179 మందికి టాప్స్ కింద ఆర్థిక అండదండలు అందించిన కేంద్రం తాజాగా 94 మందికే చేయూత ఇవ్వనుంది. ఈ పథకం కింద లబ్ధి పొందిన క్రీడాకారుల ప్రదప్రర్శనను సమీక్షించిన క్రీడాశాఖ దాదాపు సగం మందికి కోత పెట్టింది. ఈ 94 మంది జాబితాలో 42 మంది రెగ్యులర్ అథ్లెట్లు కాగా, 52 మంది పారా అథ్లెట్లు ఉన్నారు. పారిస్ పారాలింపిక్స్‌లో విశేష ప్రతిభ కనబరిచిన పారా అథ్లెట్లు 7 స్వర్ణాలు సహా 29 పతకాలు సాధించారు. దీంతో క్రీడా శాఖ దివ్యాంగ అథ్లెట్లకు టాప్స్‌లో పెద్దపీట వేసింది. గతంలో 78 మం దితో ఉన్న రెగ్యులర్ అథ్లెట్లలో చాలా మందిని తప్పించింది. ఇక గోల్ఫ్, స్విమ్మింగ్, టెన్నిస్‌లలో ఏ ఒక్కరికి టాప్స్‌లో చోటు దక్కలేదు. మేటి రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియాలను టాప్స్ నుంచి పక్కకు తప్పించింది. రెజ్లింగ్ నుంచి వీడ్కోలు తీసుకున్న వినేశ్ రాజకీయాల్లోకి వచ్చి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి గెలిచింది. అలాగే డోప్ టెస్టులకు గైర్హాజరు అయ్యాడనే కారణంగా జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బజరంగ్‌పై 4ఏళ్ల నిషేధం విధించింది. అథ్లెటిక్స్‌లో నిరాశజనక ప్రదర్శన వల్ల 30 మందిలో ఇప్పుడు ముగ్గురితో సరిపెట్టింది. చాంపియన్ జావెలిన్ త్రోయర్, స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా, స్టీపుల్‌చేజర్ అవినాశ్ సాబ్లే, లాంగ్ జంపర్ శ్రీశంకర్‌లకు మాత్రమే టాప్స్‌లో చోటు దక్కింది. కాగా తెలంగాణ రైజింగ్ స్టార్, ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య విజేత లవ్లీనా బొర్గొహైన్‌లు ఇద్దరూ మహిళా బాక్సర్లకే టాప్స్‌లో లబ్ధి చేకూరనుంది. గతంలో 8 మంది బాక్సర్లుండగా ఈసారి కేవలం ఇద్దరే ఇద్దరికి చోటు దక్కింది. షట్లర్లలో కిడాంబి శ్రీకాంత్, డబుల్స్ స్పెషలిస్ట్ అశ్విని పొన్నప్పలను పక్కన బెట్టిన క్రీడాశాఖ సింధు, ప్రణయ్, లక్ష్యసేన్, డబుల్స్ అగ్రశ్రేణి జోడీసాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టిలను జాబితాలో కొనసాగించింది.

# నేడే హై ఓల్టేజ్ మ్యాచ్
## భారత్ v/s పాక్




**న్యూఢిల్లీ:** ఐసీసీ నిర్వహించే ఏ టోర్నమెంట్‌లో అయినా భారత్ -పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే హైప్ వేరు. ఈ హై వోల్టేజ్ మ్యాచ్ కోసం ఈ రెండు జట్ల అభిమానులే కాదు, వరల్డ్ వైడ్‌గా క్రికెట్ ఫ్యాన్స్ ఎదురుచూస్తుంటారు. తాజాగా దాయాది దేశాలు మరో సమరానికి సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో భారత్ నేడు కీలక మ్యాచ్ ఆడనుంది. దుబాయ్ వేదికగా ఈ నెల 23న జరిగే ఈ మ్యాచ్‌లో భారత్, పాక్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. 2017 ఫైనల్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలన్న కసితో భారత్ బరిలోకి దిగుతోంది. ఈ టోర్నీలో తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై నెగ్గిన టీమిండియా అదే జోష్‌తో పాకిస్తాన్‌తో సమరానికి రెడీ అవుతోంది. కెప్టెన్ రోహిత్ శర్మ టచ్‌లోకి రాగా, శుభ్‌మన్ గిల్ ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. పాకిస్తాన్‌పై మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న విరాట్ కోహ్లీ ఈసారి కూడా చెలరేగితే భారీ స్కోర్ ఖాయం. ఇక బౌలింగ్ దళం మరోసారి రాణిస్తే టీమిండియాకు తిరుగు ఉండదు. మరోపక్క ఈ మ్యాచ్‌లో టీమిండియాలో ఓ కీలక మార్పు చేయాలనే దిశగా భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ఆలోచన చేస్తోంది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన హర్షిత్ రాణాను పక్కన పెట్టే విషయమై తర్జన భర్జన పడుతోంది. రాణా స్థానంలో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి అవకాశం ఇస్తే ఎలా ఉంటుందనేదానిపై చర్చ సాగుతోంది. బంగ్లాతో మ్యాచ్‌లో పేసర్లే అధికంగా వికెట్లు తీసినప్పటికీ, స్పిన్నర్లు టీమిండియా గెలుపులో ప్రధాన పాత్ర పోషించారు. అలాగే షమీకి జతగా హార్దిక్ పాండ్యాను రెండో పేసర్గా వినియోగించుకునే అవకాశం కనిపిస్తోంది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లో పేసర్ల కంటే స్పిన్నర్లే పొదుపుగా బౌలింగ్ చేసిన విషయాన్ని గమనంలో పెట్టుకుంటోంది. వీటిని దృష్టిలో ఉంచుకునే భారత్ కీలకమైన పాకిస్తాన్ మ్యాచ్‌లో నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దించితే ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపై భారత్ క్రికెట్ బోర్డు పరిశీలిస్తోంది. ఇదే సమయంలో పాకిస్తాన్ పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ మ్యాచ్ పాక్‌కు చావో రేవో కానుంది. ఈ మ్యాచ్‌లో పాక్ ఓడితే ఇక అంతే. తాజాగా ఈ ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నీని భారత్ ఇప్పటికే విజయంతో ప్రారంభించగా, పాకిస్తాన్‌కు తొలి మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. ఈ బాధలో ఉండగానే స్టార్ బ్యాటర్ ఫకర్ జమాన్ దూరమయ్యాడు. ఈ పరిస్థితుల్లో బలమైన భారత్‌ను ఢీ కొట్టేందుకు రెడీ అవుతోంది. అయితే ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓడితే ఇర టోర్నీ నుంచి ఇంటిముఖం పట్టాల్సిందే. దీంతో భారత్‌ను ఓడించేందుకు టీమ్ సభ్యులను పాకిస్తాన్ క్రికెట్ బోర్డు సమాయుత్తం చేస్తోంది.







# గెలిచే మ్యాచ్‌లో ఓడిన రాయల్ ఛాలెంజర్స్
### మహిళల ప్రీమియర్ లీగ్: ముంబయి ఇండియన్స్ గెలుపు



**న్యూఢిల్లీ:** వుమెన్స్ ప్రీమియర్ లీగ్-2025లో ముంబై ఇండియన్స్ చేతిలో 4 వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు ఓటమిపాలైంది. వరుసగా రెండు విజయాల తర్వాత బెంగుళూరుకు తొలి ఓటమి ఎదురైంది. హర్మన్‌ప్రీత్ కౌర్ (50) అద్భుత ప్రదర్శనతో జట్టును నడిపించగా, అమన్‌జోత్ కౌర్ చివర్లో మెరుపు షాట్లతో మ్యాచ్‌ను ముగించింది. శనివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఆఖరి వరకు పోరాడినప్పటికీ, చివరి బంతికి ముందే ముంబై లక్ష్యాన్ని చేరుకొని 4 వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన బెంగుళూరు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ఎల్లిస్ పెర్రీ (81 పరుగులు, 43 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగింది. రిచా ఘోష్ (28 పరుగులు, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (26 పరుగులు, 13 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుగైన స్టార్ట్ ఇచ్చినప్పటికీ, చివర్లో భారీ స్కోరు చేయడంలో జట్టు విఫలమైంది. ముంబై బౌలర్లలో అమన్‌జోత్ కౌర్ (3/22) అద్భుత బౌలింగ్‌తో మూడు కీలక వికెట్లు పడగొట్టింది. షబ్నిమ్ ఇస్మైల్, నాట్ సీవర్ బ్రంట్, హీలీ మాథ్యూస్, సాంస్క్రిత్ గుప్తా తలో వికెట్ తీసి బెంగుళూరు స్కోరును పరిమితం చేశారు. ఇక 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 19.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ (50 పరుగులు, 38 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో జట్టును నడిపించింది. నాట్ సీవర్ బ్రంట్ (42 పరుగులు, 21 బంతుల్లో 9 ఫోర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. చివర్లో అమన్‌జోత్ కౌర్ (34 నాటౌట్, 27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలకంగా రాణించింది. రాయల్ ఛాలెంజర్స్ బౌలర్లలో జార్జియా వేర్‌హామ్ (3/21) మూడు వికెట్లు తీయగా, కిమ్ గార్త్ (2/30) రెండు వికెట్లు తీసింది. ఆఖరి ఓవర్‌కు ముంబైకి 6 పరుగులే అవసరమయ్యాయి. బెంగుళూరు బౌలర్ ఎక్తా బిస్త్ తొలి నాలుగు బంతుల్లో కేవలం 4 పరుగులే ఇచ్చింది. కానీ కమలి ఐదో బంతిని బౌండరీకి తరలించి ముంబై విజయాన్ని ఖరారు చేసింది.

## వాణిజ్యం

# లక్ష కోట్లపైనే ఎఫ్‌పిఐ విక్రయాలు..

**ముంబై, ఫిబ్రవరి 22:** దేశీయ స్టాక్ మార్కెట్‌ను గత కొన్నాళ్లుగా వరుస నష్టాలు వెంటాడుతున్నాయి. మధ్యలో లాభాల్లోకి వచ్చినా, మెజారిటీ సెషేన్లలో నష్టాల పరంపర కొనసాగుతోంది. దీనికి కారణమేంటని అడిగితే వెంటనే గుర్తుకొచ్చేది విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌పిఐ) విక్రయాలు. కొత్త యేడాదిలో ఇప్పటికే రూ.లక్ష కోట్ల పైనే నిధులను వీరు ఉపసంహరించుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది డిసెంబరులో దేశీయ ఈక్విటీ మార్కెట్లో రూ.15,446 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసిన ఎఫ్‌పిఐలు, ఈ యేడాది జనవరిలో రూ.78,027 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఫిబ్రవరి నెలలో ఇప్పటి వరకు రూ.23,710 కోట్ల విలువైన షేర్ల విక్రయాలు జరిపారు. మొత్తంగా రూ.1.01 లక్షల కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్‌ఎస్‌డిఎల్) వెల్లడించింది. గతవారం ఈ అమ్మకాల విలువ రూ.2,437.04 కోట్లుగా ఉండగా, అంతకు ముందు వారం ఈ మొత్తం రూ.13,930.48 కోట్లుగా ఉంది. గత వారం ఎఫ్‌పిఐల అమ్మకాలు తగ్గడం వెనుక ఎయిర్‌టెల్ బ్లాక్ డీల్ కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. విదేశీ ఇన్వెస్టర్లు తరలిపోవడానికి వివిధ కారణాలు ఉన్నాయి. భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు, అమెరికాలో బాండ్ రాబడులు పెరగడం వంటివి కారణాలుగా మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధికార పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో అక్కడి ఆర్థిక వ్యవస్థతను బలోపేతం చేయగలరన్న విశ్వాసం కూడా నెలకొనడం భారత్ వంటి అభివృద్ధి చెందిన మార్కెట్ల నుంచి ఎఫ్‌పిఐలు తరలిపోవడానికి ప్రధాన కారణమని అంచనా వేస్తున్నారు. ఒకసారి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం కనిపిస్తేనే ఎఫ్‌పిఐల పునరాగమనం సాధ్యమవుతుందని అనలిస్టులు చెబుతున్నారు. అప్పటి వరకు స్టాక్ మార్కెట్ల నుంచి నిధులు ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.




# తరిగిపోతున్న అదానీ, అంబానీ సంపద!



**ముంబై, ఫిబ్రవరి 22:** కొంతకాలంగా స్టాక్ మార్కెట్లు భారీగా పడిపోతున్నాయి. ఈ తరుణంలో దిగ్గజ పారిశ్రామిక వేత్తలు భారీగా నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. వారి కంపెనీల షేర్లు పతనం అవుతుండడమే దీనికి కారణం. 2025లో ఇప్పటి వరకు ఎక్కువగా నష్టపోయిన వారిలో భారత్‌కు చెందిన గౌతమ్ అదానీ రెండో స్థానంలో ఉన్నారు. అపర కుబేరుడు ఎలాన్ మస్క్ ఏకంగా రూ.3 లక్షల కోట్లు నష్టపోయాడు. అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ 2025లో ఇప్పటి వరకు అంటే దాదాపు 50 రోజుల వ్యవధిలో 11.9 బిలియన్ డాలర్ల సంపదను కోల్పోయారు. భారత కరెన్సీలో చూస్తే సుమారు లక్ష కోట్లుగా ఉంటుంది. ఇప్పుడు ఆయన మొత్తం సంపద రూ.5.75 లక్షల కోట్లకు పరిమితం అయ్యింది. ప్రస్తుతం సంవత్సరంలో అత్యధికంగా సంపదను కోల్పోయిన వారిలో అదానీరెండోస్థానంలో ఉన్నట్లు బిలియనీర్స్ ఇండెక్స్ తెలి పింది. ప్రపంచ కుబేరుల జాబితాలో గౌతమ్ అదానీ ఏకంగా 23వస్థానానికి పడిపోయారు. 2023లో హిండెన్ బర్గ్ రిపోర్ట్ వెలువడక ముందు అదానీ ఒక దశలో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఏకంగా రెండవ స్థానానికి కూడా చేరారు. రిపోర్టు తర్వాత ఒకదశలో టాప్ 30అవతలికి చేరారు. ఆ తర్వాత క్రమంగా పుంజుకుంటూ వస్తున్నారు. 2025లో అత్యధికంగా నష్టపోయిన వారిలో అగ్రస్థానంలో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన టెస్లా, స్పేస్ఎక్స్, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఉన్నారు. ఈ యేడాదిలో మస్క్ సంపద సుమారు రూ.3 లక్షల కోట్లు తగ్గి ఇప్పుడు 397 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది భారత కరెన్సీలో రూ.34 లక్షల కోట్ల వరకు ఉంటుంది. భారత దిగ్గజ పారిశ్రామికవేత్త, అత్యంత ధనవంతుడు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్‌అంబానీ బిలియనీర్స్ జాబితాలో 17వస్థానంలో నిలిచారు. అంబానీ సందప సుమారు రూ.25వేల కోట్లుతగ్గింది. దీంతో ఇప్పుడు రూ.7.50 లక్షల కోట్లకు పడిపోయింది. ఇక ఐటి సంస్థ హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ అధినేత శివ్ నాడార్ సంపద రూ.39వేల కోట్లు పడిపోయి ప్రస్తుతం రూ.3.32 లక్షల కోట్లు ఉంది. ప్రపంచ అపర కుబేరుల్లో మస్క్ తొలి స్థానంలో ఉండగా, ఆ తర్వాత వరుసగా మెటా చీఫ్ మార్క్ జుకర్ బర్గ్, అమెజాన్ ఫౌండర్ జెఫ్‌జెబోస్, ఒరాకిల్ ఫౌండర్‌లారీ ఎల్లిసన్ ఉన్నారు.

# గోల్డ్ ఇటిఎఫ్‌లతో రాబడుల వెల్లువ

**ముంబై, ఫిబ్రవరి 22:** భారతదేశంలో బంగారాన్ని ఎక్కువగా ఆభరణాల రూపంలోనే కొనుగోలు చేస్తూ ఉంటారు. భారతీయులు బంగారాన్ని సురక్షితమైన ఆస్తిగా, ద్రవ్యోల్బణ ప్రమాదాలకు వ్యతిరేకంగా ఒక రక్షణగా పరిగణిస్తారు. భారతదేశంలో బంగారు ఆభరణాల డిమాండ్ నిరంతరంతగ్గుతోంది. ప్రపంచ బంగారు మండలి డేటా ప్రకారం దేశంలో బంగారు ఆభరణాల డిమాండ్ 2022లో 600టన్నుల నుంచి 2024లో 563 టన్నులకు పడిపోయింది. భారత దేశంలో బంగారం ధర నిరంతరం పెరుగుతోంది. దీనివలన ఆభరణాల కొనుగోలు ఖరీదైనదిగా మారిం ది. అంతేకాకుండా ఆభరణాలపై 1012శాతం అద నపు తయారీ ఛార్జీలుఉన్నాయి, వీటిని ఈ ఆభరణా లను అమ్మితే ఈ సొమ్ము తిరిగిరాదు. అలాగే యువ పెట్టుబడిదారులు ఇకపై ఆభరణాలను పెట్టుబడి ఆస్తిగా భావించడంలేదు. ఈ నేపథ్యంలో డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడికి ముందుకు వస్తున్నారు. భారతదేశంలో పెట్టుబడిదారులకు గోల్డ్‌ఈటీఎఫ్‌లు ప్రముఖ పెట్టుబడి మార్గంగా మారుతున్నాయి. అసో సియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్ ఇన్ ఇండియా డేటా ప్రకారం గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి నికర ఇన్‌ఫ్లో 2024లో 216శాతం పెరిగి రూ.9,225కోట్లకు చేరుకుంది. గోల్డ్ ఈటీఎఫ్‌లను సాధారణ ఈక్విటీల మాదిరిగా స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా కొనుగోలు చేయవచ్చు, అమ్మవచ్చు. పెట్టుబడిదారులు వాటిపై ఎటువంటి మేకింగ్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరంలేదు. బడి మొత్తం మొత్తాన్ని ఎటువంటి కోతలేకుండా పెట్టుబడిగా ఉపయోగించుకోవచ్చు. 2024కేంద్ర బడ్జెట్‌లో, భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బంగారు ఈటీఎఫ్‌లపై దీర్ఘకాలిక మూలధన లాభాలు కేవలం 12నెలలు ఉంచుకుంటే ఇండెక్సేషన్ లేకుండా ఫ్లాట్ 12.5శాతం రేటుతో పన్ను విధిస్తామని ప్రకటించారు. గతంలో గోల్డ్ ఈటీఎఫ్‌లపై ఎల్‌టీసీజీ మూడు సంవత్సరాలకుపైగా ఉంచితే ఇండెక్సేషన్‌తో 20శాతంపన్ను విధించేవారు. మరోవైపు ఎల్‌టీసీజీ ప్రయోజనాలకు అర్హత సాధించడానికి ఆభరణాలు, కడ్డీలు, నాణేలు వంటి భౌతిక బంగారాన్ని 24 నెలల హోల్డింగ్ వ్యవధి వరకు ఉంచుకోవాలి.

# బ్యాంకులపై సైబర్ దాడులకు ఇక చెక్

**ముంబై, ఫిబ్రవరి 22:** ఆర్థిక సేవల కోసం డిజిటలైజేషన్ మరింత వేగవంతమైంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు టెక్నాలజీని మరింత అభివృద్ధి అవుతోంది. అయితే టెక్నాలజీ పెరిగే కొద్ది సైబర్ మోసాలు కూడా అంతే జరుగుతు న్నాయి. ఎంతో మంది డిజిటల్ మోసాలకు గురవుతున్నారు. అయితే ఈ బ్యాంకింగ్ రంగంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు ఆర్బీఐ చర్యలు చేపడుతూనే ఉంది. ఇప్పుడు ఆర్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) భారతీయ బ్యాంకుల కోసం ప్రత్యేకమైన 'బ్యాంకు డాట్‌ఇన్' డొమైన్‌ను ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ భద్రతను మెరుగుపరచ దం, ఫిషింగ్ దాడులను తగ్గించడం, డిజిటల్ బ్యాంకింగ్, చెల్లింపు వ్యవస్థలను మరింత బలోపేతం చేయనుంది. ఆర్థిక మోసాలను అరికట్టడానికి భారతీయ బ్యాంకుల కోసం ప్రత్యేక 'బ్యాంకు డాట్‌ఇన్' ఇంటర్నెట్ డొమైన్‌ను ప్రారంభించినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల ప్రకటించారు. భారతీయ బ్యాంకుల కోసం రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక ఇంటర్నెట్ డొమైన్ బ్యాంకుడాట్‌ఇన్‌ను అమలు చేయబోతోంది. ఈ విధానం ఏప్రిల్ 2025 నుండి అమలులోకి వస్తున్నట్లు ఆయన వెల్లడించారు. చట్టబద్ధమైన బ్యాంకింగ్ వెబ్‌సైట్‌లు, మోసపూరిత వెబ్‌సైట్‌ల మధ్య తేదాను గుర్తించడంలో కస్టమర్‌లకు సహాయ పడటం ఈ విధానం లక్ష్యం. ఆర్బీఐ బ్యాంక్ 'బ్యాంకుడాట్‌ఇన్' డొమైన్‌ను ప్రత్యేక ఇంటర్నెట్ డొమైన్‌ను అమలు చేస్తుంది. ఈ డొమైన్ పేరు నమోదు ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి ప్రారంభ మవుతుంది. ఇది బ్యాంకింగ్ మోసాలను నివారించడంలో సహాయపడుతుంది. దీని తరువాత ఆర్థిక రంగానికి 'ఈ కొత్త డొమైన్‌ను స్వీకరించనున్నారని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. బ్యాంకింగ్ మోసాలను నిరోధించడానికి ఈసంవత్సరం ఏప్రిల్‌లో ఈడొమైన్ కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. తదనంతరం, ఆర్థిక రంగానికి 'ఎఫ్‌ఐఎన్ డాట్‌ఇన్' డొమైన్ ప్రారంభించనున్నామని గవర్నర్ తెలిపారు.




# భారీగా పెరగనున్న సిగరెట్ ధరలు



**ముంబై, ఫిబ్రవరి 22:** 2026 మార్చి 31 నాటికి ఈ ఉత్పత్తులపై పరిహార సెస్ (కంపెన్సేషన్ సెస్‌రాష్ట్రాలకు చెల్లించే పన్ను విధానం)ను దశలవారీగా ఎత్తివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపాదిత విధానం ద్వారా ప్రజారోగ్య సమస్యలను పరిష్కరిస్తూ పన్ను ఆదాయాన్ని కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. గతంలో 25శాతం జిఎస్‌టి తగ్గించినప్పటికీ, ప్రస్తుతం 40శాతానికి పెంచే ఉద్దేశ్యం ఉందని చెబుతున్నారు. ప్రభుత్వాలు ఆదాయ కొరతను ఎదు ర్కొన్నప్పుడు లేదా ఎక్కువ ఆదాయం అవసరమైనప్పుడు, వారు మొదట చూసేది ధూమపానం చేసేవారిని, మద్యపానం చేసేవారిని ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను మినహాయింపులను అందించింది. దీనివల్ల ప్రభుత్వానికి పన్ను వసూళ్ల స్వల్పంగా తగ్గుతాయని భావిస్తున్నారు. అదేవిధంగా, పొగాకు ఉత్పత్తులపై పరిహార సెస్ వచ్చే ఏడాదితో ముగుస్తుంది. దీనివల్ల ప్రభుత్వానికి పన్ను ఆదాయం కూడా తగ్గవచ్చు. దీనిని భర్తీ చేయడానికి, ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై బిళీగిని పెంచబోతోంది. ఇలా జీఎస్టీ పెంచినట్లయితే సిగరేట్ల ధర భారీగా పెరిగే అవకాశం ఉంది. మానవ ఆరోగ్యానికి హానికరమైన పొగాకు, మద్యం ఉత్పత్తులను ప్రమాదకరమైన వస్తువులుగా పరిగణిస్తారు. ఈ వస్తువులపై ఎక్కువ పన్ను విధిస్తారు. దీని వలన ప్రజలు వాటిని కొనకుండా నిరుత్సాహపడతారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు ప్రకారం, సిగరెట్లపై 75 శాతం పన్ను విధించాలి. భారతదేశంలో 28శాతం జిఎస్‌టితో సహా, సిగరెట్లపై మొత్తం పన్ను 53 శాతంగా ఉన్నాయి. ఇందులో 5శాతం పరిహార సెస్ కూడా ఉంటుంది. ఎక్సైజ్ సుంకం, జాతీయ విపత్తు నిధి సుంకంతో సహా మొత్తం పన్ను రేటు 10శాతం. ఇది 52.7 శాతం అవుతుంది. ఈ పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని గరిష్టంగా 40 శాతానికి పెంచడంతో పాటు అదనపు ఎక్సైజ్ సుంకాన్ని విధించాలని కూడా జీఎస్టీ కౌన్సిల్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక సర్వే ప్రకారం.. దేశంలో సిగరెట్ తాగే వారి సంఖ్య 27 కోట్లకు పైగా ఉంది. పొగాకు ఉత్పత్తులపై పన్నుల ద్వారా ప్రభుత్వానికి రూ.80,000 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది.

# రూ.30వేల కోట్ల పెట్టుబడులకు ప్రణాళికలు

**ముంబై, ఫిబ్రవరి 22:** కేరళ ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహకంగా అదానీగ్రూప్ ఐదేళ్లలో రాష్ట్రంలో రూ.30,000కోట్ల పెట్టుబడులు పెట్టి ప్రణాళికలను ప్రకటించింది. మౌలిక సదుపాయాలను పెంచడం, ఆర్థిక వృద్ధిని పెంచడం, అనేక ఉద్యోగ అవకాశాలను లక్ష్యంగా ఈ పెట్టుబడులు సృష్టించబోతున్నట్లు ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్ 2025 సందర్భంగా అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ (ఏపీఎస్ఈజెడ్) మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ ఈమెరకు ప్రకటన చేశారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ సదస్సును కలిగిఉన్నారు. రూ.20,000 కోట్ల పెట్టుబడిలో అభివృద్ధికి, విఝింజం పోర్టు మళ్లించబడుతుం ది. అదానీ గ్రూప్ ఇప్పటికే ఈ ప్రాజెక్టులలో రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టింది. విజంజం పోర్టును దేశంలోనే మొదటి ట్రాన్స్ పెమ్మెంట్ హబ్గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయం 45 లక్షల ప్రయాణికుల నుంచి 1.2 కోట్లకు పెంచేందుకు అదానీగ్రూప్ రూ.5,500 కోట్లు పెట్టుబడి పెట్టాలని యోచి స్తోంది. ఇది విమానా శ్రయం ప్రాథమిక సౌకర్యాన్ని మెరుగు పరుస్తుంది. కొచ్చి లాజిస్టిక్స్ అండ్ కొచ్చిలో లాజిస్టిక్స్, ఇ-కామర్స్ హబ్ను ఏర్పా టు చేసి అదానీ గ్రూప్ ఈ రంగంలో కేరళకు మరింత మద్దతునిస్తుంది. సమర్థవంతమైన సప్లై మేనేజ్‌మెంట్‌ను ఈ హబ్ సులభతరం చేస్తుం ది. రాష్ట్రంలో పెరుగుతు న్న ఇ-కామర్స్ పరిశ్రమ కు ఇస్తుంది. కొచ్చిలో తన సిమెంట్ ఉత్పత్తి గ్రూప్ పెంచాలని అదానీ ఏర్పాట్లు సిద్ధం చేస్తుంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14